UNIVERSAL
LIBRARY
OU_204615
UNIVERSAL
LIBRARY

శ్రీ

అభిజ్ఞాన

# శాకుంతలనాటకము.

ఇది

శ్రీ కాళిదాస ప్రణీతమైన సంస్కృత గ్రంథమునుండి

గద్యపద్యాత్మకముగా

తెనుఁగున

చెన్నపురి రాజధానియందలి దొరతనపువారి కాలేజిలో

తెనుఁగుపండితుఁడుగా నుండిన


కందుకూరి-వీరేశలింగముచేత,


రచియింపఁబడినది.


ఏడవకూర్పు 1000 ప్రతులు.

రాజమహేంద్రవరము:

శ్రీ సత్యానంద ప్రెస్సునందు

ముద్రింపఁబడినది.

1931

వెల 12 అణాలు.

# మొదటికూర్పు పీఠిక.

ఈనాటకము మహాకవియైన కాళిదాసునిచే రచియింపఁబడినది. ఈతఁడు విక్రమాదిత్యుని యాస్థానకవీశ్వరులలోనెల్ల నగ్రగణ్యుఁడు గనుక, ఈనాటకము రచియింపఁబడి యిప్పటికి రమారమి రెండువేల సంవత్సరములు కావచ్చినది. ఇదిసంస్కృతనాటకములలో బహుపురాతనమయినది. ఇప్పుడున్న నాటకములలో నొక్క మృచ్ఛకటిక మాత్రమె దీనికంటె ప్రాచీనమయినది. సంస్కృతకవిసార్వభౌముఁడని యెల్లవారిచేతను శ్లాఘింపఁబడు కాళిదాసునిగాని, ఒక్కహిందువులు మాత్రమేకాక నాగరికాగ్రేసరులయిన యూరపుఖండపండితులు సహితము నాటకరాజ మని శిరసావహించి గౌరవించు శాకుంతలనాటకమునుగాని, నేనిప్పు డిచ్చట శ్లాఘింపవలసిన యావశ్యకములేదు. గీర్వాణభాషలోఁగల నాటకములలోనెల్ల సర్వోత్కృష్టమయిన యీ యభిజ్ఞానశాకుంతలమును రసవంతముగా తెనిఁగింపఁగల సామర్థ్యము నావద్దలేనిసంగతి పూర్ణముగా నెఱిఁగినవాఁడ నయ్యును, అట్టి నాటకమును జదివినమీఁదట దానిని తెనిఁగింపవలయునని నామనస్సులో పుట్టినబుద్ధిచాపలమును మరలించుకోలేక నాశక్తిని విచారింపక సాహసము చేసి యీమహాకార్యమున కారంభించినాఁడను. ఒకవేళ జనుల కీపుస్తకము సంతోషజనకముగానే యున్నయెడల, ఇందు నాకల్పన మేమియు లేక సర్వమును కాళిదాసునిదే యగుటవలన నామహాకవిని మెచ్చవలయునే కాని నన్ను శ్లాఘింపవలసినపని యెంతమాత్రమును లేదు. ఇట్లని నాలోపమువలన తిన్నఁగా నుండనివిషయముల కెల్లను కాళిదాసునే యుత్తరవాదినిగాఁ జేసి తప్పించుకొన నెంచినట్లు దీనిం జదువువా రెంచఁగూడదు. దీనియందుఁగల దోషములన్నియు నావియే కనుక తమ కేవేవి లోపములు కనఁబడినచో పండితజనులు నాయస మర్థతనుమన్నింతురని ప్రార్థించుచున్నాను. మఱియునీ తెనుఁగునుబట్టియే కాళిదాసుని రచనానైపుణ్యమును నిర్ణయించుకొనక యిది యొకవేళ హృదయాహ్లాదకరముగా నుండకపోయినను మూలగ్రంథ మత్యంత శ్లాఘాపాత్రముగా నుండునవియే సమ్మి యామహాకవియెడ పరిపూర్ణ గౌరవము నుంచుదురని నమ్ముచున్నాను. నేనీగ్రంథమును కొన్ని సంవ

త్సరముల క్రిందట నారంభించి మొదటి రెండంకములను మాత్ర మాంధ్రీకరించి తరువాత కొన్ని కారణముల చేత నప్పటికంతటితో నిలిపినాఁడను. కాని రెండుమాసముల క్రిందట నామిత్రులు కొందఱీనాటకమును తెనుఁగున నాడుట యుచితముగా నుండునని తెలిపినందున, అందునిమిత్తమయి మరల పనిపూని తక్కినయైదంకములను కొంత తొందరగా వ్రాయవలసినవాఁడ నైనాఁడను. అప్పుడు మొదటి రెండంకములను కొంచెము కఠినశైలితో వ్రాసినను నాటకమాడునప్పుడందఱకును దెలియుట యత్యంతావశ్యకమను నభిప్రాయముతో నిప్పుడీయయిదంకములను మిక్కిలి సులభముగా వ్రాసినాఁడను. నేనీ గ్రంథమును తెనిఁగించుటలో బహుప్రతులనుజూచి మొట్టమొదట నన్ని ప్రతులలో నున్న విశేషాంశములనన్నిటిని జేర్పవలయునని యెంచి ప్రథమ ద్వితీయాంకములయందు కలకత్తా ప్రతియందుఁగల యధిక శ్లోకములనుగూడ జేర్చితినిగాని, తరువాత పరిశీలింపఁగా నట్టివి ప్రక్షిప్తములుగాఁ గానఁబడినందున తరువాత నట్టివానిని వదలివేసి బహుప్రతులయం దున్నరీతినే తక్కినభాగమును తెనిఁగించినవాఁడను. నాకు లభించిన నాలుగుభిన్నదేశప్రతులయందును కొన్నిభాగములు భిన్నభిన్నములుగానున్నవి. అటువంటి స్థలములలో నాబుద్ధి కేపాఠము సరసముగానున్నట్టు తోఁచినదో దాని ననుసరించి తెనిఁగించుచు వచ్చినాఁడను. విద్వాంసులు దీనియందలి లోపములను గనఁబఱచిన యెడల మరల ముద్రించునప్పుడు వందనపూర్వకముగా సవరించెదను.

రాజమహేంద్రవరము.
ది ౨౫ అక్టోబరు ౧౮౮౩ సం॥.

కందుకూరి-వీరేశలింగము.

మూఁడవకూర్పు పీఠిక.

నేనీనాటకమును తెనిఁగించి ౧౮౮౩ వ సంవత్సరాంతమునందు మొదటసారి ముద్రింపించినాఁడను. ఇది ౧౮౮౬ వ సంవత్సరమునందు రెండవసారి ముద్రింపఁబడినది. ఈసారిపుస్తకమునందు మూలగ్రంథానుసారముగా నక్కడక్కడఁ గొన్నిమార్పులను జేసియున్నాఁడను. ఇఁకనైనను దెలుఁగువారు దీనియం దధికాదరమును జూపుదురనినమ్ముచున్నాను

రాజమహేంద్రవరము.
ది ౧౫ ఏప్రియల్ ౧౮౮౬.

కందుకూరి వీరేశలింగము.

# ఈనాటకమునందు వచ్చుపాత్రములు.

——: 0 :——

## పురుషులు.

దుష్యంతుఁడు—కథానాయకుఁడయిన పూరువంశపురాజు.
మాఢవ్యుఁడు—రాజునకు వేడుక చెలికాఁడు.
కణ్వుఁడు—శకుంతలకు పెంపుడుతండ్రియగు మహర్షి.
వైఖానసులు—కణ్వాశ్రమప్రాంతమునందలి ఋషులు.
శార్ఙ్గరవుఁడు—కణ్వశిష్యుఁడు.
శారద్వతుఁడు—కణ్వశిష్యుఁడు.
మిత్రావసువు—రాజుబావమఱఁది ; ఆరక్షకభటాధిపతి.
రైవతకుఁడు—రాజద్వారపాలకుఁడు.
కరభకుఁడు—రాజుతల్లి పంపిన భటుఁడు.
సోమరాతుఁడు—రాజపురోహితుఁడు.
జానుకుఁడు—ఆరక్షకభటుఁడు.
సూచకుఁడు—ఆరక్షకభటుఁడు.
వాతాయనుఁడు—అంతఃపురద్వారపాలకుఁడు.
మాతలి—ఇంద్రసారథి.
భరతుఁడు—దుష్యంతుని పుత్రుఁడు.
కశ్యపుఁడు—మరీచిపుత్రుఁడగుమహర్షి.
కుంభీలకుఁడు—బెస్తవాఁడు.

## స్త్రీలు.

శకుంతల—కథానాయికయగు దుష్యంతునిభార్య.
అనసూయ—శకుంతల చెలికత్తె.
ప్రియంవద—శకుంతల చెలికత్తె.

గౌతమి—ఒకవృద్ధతాపసస్త్రీ.
వసుమతి—దుష్యంతుని మొదటిభార్య.
సానుమతి—శకుంతల చెలియైన యప్సరస.
తరళిక—వసుమతి పరిచారిక.
చతురిక—రాజుపరిచారిక.
పరభృతిక—ఉద్యానవనపాలకురాలు.
మధుకరిక—ఉద్యానవనపాలకురాలు.
అదితి—కశ్యపునిభార్య.
సువ్రత—ఒకతాపసస్త్రీ.

వీరుగాక సారథి మొదలగువారు మఱికొందరు వత్తురు.

శ్రీ

అభిజ్ఞాన

# శాకుంతలనాటకము.

## ప్రస్తావన.

### నాంది.

ఉ. ఎయ్యది యాద్యమౌ సజునిస్సృష్టికి, హవ్యము నేది తాల్చుఁ, దా
నెయ్యది సోమయాజి, మఱి యేయవి కాలవిభాగ మిచ్చు రెం,
డెయ్యది తాల్చు శబ్దగుణ మెల్లెడ నుండును, హేతుభూతమౌ
నెయ్యది సర్వభూతములు, కెయ్యది ప్రాణము ప్రాణికోటి కెం,
దయ్యతులాష్టదేహములసందు శివుం డిడు మీకు భద్రముల్.

సూత్రధారుఁడు—(నాందియైనతరువాత తెరవంకఁజూచి) ఓసీ! అలంకరించుకొనుట పూర్ణముగానైనపక్షమున, నీ విటు రమ్ము.

నటి—(ప్రవేశించి) అయ్యా! ఇదిగో వచ్చితిని. నే నేనియోగమును జేయవలయునో దేవర యాజ్ఞాపింతురుగాక!

సూత్ర—ఓసీ! ఈసభ విద్వాంసులతో నిండియున్నది. ఇప్పుడు మనము కాళిదాసునుచేతఁ గ్రొత్తగా రచియింపఁబడిన యభిజ్ఞానశాకుంతల మనునాటకముచేత వీరిని సేవింపఁదగును. కాఁబట్టి సావధానముగా దాని ప్రయోగమును నడపవలెను.

నటి—చక్కఁగా నాడుటయందు సమర్థులైన తమ కేలోపమును రాదు.

సూత్ర—ఓసీ! నేను నీతో సత్యము పలికెదను.

గీ. తలఁప నాదు ప్రయోగకౌశలము మంచి
దంచుఁ, బండితుల్ సంతోషమందునంతకు;
నెంతయుఁ బ్రవీణు లగు వారిహృదయ మైనఁ,
జాలనమ్మక మిడ దాత్మశక్తియందు.

నటి—(వినయముతో) అదియట్టిదే. తరువాతఁ జేయఁదగినపని నిప్పుడు దేవర యాజ్ఞాపింపవలయును.

సూత్ర—ఈసభవారికి కర్ణరంజనమునకంటె మఱియొకటియేమున్నది?

నటి—ఇఁక నేనిప్పుడేఋతువునిగుఱించి పాటపాడుదును?

సూత్ర—ఓసీ! ఇంతకుముందే వచ్చినదియు భోగములకుఁ దగినదియునైన యీగ్రీష్మసమయమునుగూర్చియే పాడవలెను. ఇప్పుడు—

గీ. హాయిగా స్నానములుచేయ ననువుపడుచుఁ,
పాటలసుగంధయుతవనపవన మమర,
సులభముగ నీడలను నిద్రసుఖము కలిగి,
దినసములు రమ్యమగుఁజాలఁ జివరలందు.

నటి—అలాగే. (అని పాడుచున్నది.)

గీ. భ్రమరములచేతఁ జుంబింపఁబడియు, నింత
మృదువులగు కేసరంబులతుదలు కలుగు
నలశిరీషపుష్పంబుల నతులదయను
జెలువలు ధరించుచున్నారు శిరసులందు.

సూత్ర—ఓసీ! చక్కఁగాఁ బాడితివి! ఆహా! రంగ మంతటను మనస్సులు రాగమందుఁ దగులఁ జిత్తరువువలెనున్నది! కాఁబట్టి యిప్పుడేనాటకము నారంభించి వీరిని సంతోషపెట్టుదము?

నటి—ఓయీ! అభిజ్ఞానశాకుంతల మనుపేరుగల యపూర్వనాటకప్రయోగముచేత వ్యవహరింతమని మొదటనే యాజ్ఞ యిచ్చియున్నావుగదా?

సూత్ర—ఓసీ! చక్కఁగా జ్ఞప్తికిఁ దెచ్చితివి! ఈక్షణమున నేను మఱచిపోతినిసుమా! ఎందుచేతనన—

గీ. రమ్యమగు నీదుమృదుగీతరాగమునను
బలిమిమెయి సమాకర్షింపఁబడినవాఁడ;
లీల నతివేగవంతమౌ లేడిచేత
వశిగ దుష్యంతనృపుఁ డీడ్వఁబడినయట్లు.

ఇది ప్రస్తావన.

శ్రీ

అభిజ్ఞాన

# శాకుంతలనాటకము.

## ప్రథమాంకము.

రంగము—కణ్వాశ్రమారణ్యము.

[విల్లును అమ్మును, కేలఁ దాలిచి, రథముపై నెక్కి, ఒకజింకనుదఱుముచు సారథితోడఁగూడ దుష్యంతమహారాజు ప్రవేశించుచున్నాఁడు.]

సూతుఁడు—(రాజువంకను, మృగమువంకను, జూచి) దేవా !

గీ. ఆమృగమును, సధిజ్యశరాసనంబు,
గరమున ధరించుమిమ్మును, గాంచ నాకు,
యజ్ఞమృగమును వెన్నంటియరుగునట్టి
యలపినాకపాణిని గన్నయట్లయయ్యె.

రాజు—సూతుఁడా ! మనల నీసారంగము బహుదూరముగొని వచ్చినది. చూడు. అది మఱియిప్పుడును—

చ. నడిఁ బఱతెంచు తేరిదెసఁ బల్మఱు మాఱ్మెడవెట్టి చూచుచుం,
గడు శరపాతభీతిఁ దనకాయము ముందుకుఁ గుంచి, యెంతయుం
బడలిక నోటినిండెఱచి, మార్గమునిండ సగంబుతిన్నద
ర్భలు పడ, మింటఁ జాలెడు ధరం బదమూనక, పెద్దదాఁటులన్.

(విస్మయముతో) ఆ ! ఏమిది! ఎంతవేగముగా వెంబడించుచున్నను, ఇంతలోనే యది కనఁబడుట ప్రయత్నసాధ్యమయ్యెను!

సూతు—దేవా! నేల మిట్టపల్లములుగా నున్నదని గుఱ్ఱముల పగ్గములు బిగియఁబట్టి రథవేగము మందమునొందించితిని; అందుచేతనే, మృగము మనకెడమయినది. ఇప్పుడు మనము సమప్రదేశమునఁ జనుచున్నాము కాఁబట్టి దేవరకది లభింపకపోదు.

రాజు.—అట్లయినఁ బగ్గముల సడలవిడువుము.

సూతు.—దేవరవారాజ్ఞాపించినట్లు కావించెద. (అని రథవేగము నిరూపించి) దేవా! ఇప్పుడు చూడుండి! చూడుండి!

ఉ. పగ్గముల స్సడలు్చుటను, వాజులు మేనులుసాఁచి పాఱెడున్
నిగ్గగు చామరాగ్రములు నిశ్చలత న్వహియింపఁగాఁ, జెవుల్
దిగ్గన నిక్కఁబెట్టి తమలేపినధూళికి నంటరానివై,
బెగ్గిలిపాఱునామృగము వేగము సైఁపక కూడఁబాఱునాన్.

రాజు.—(సంతోషముతో) నిజముగా నీహరులు సూర్యాశ్వములను, హరిణములను మించి పరుగెత్తుచున్నవి.

గీ. ఏది కడుఁజిన్నదై యుండు నిప్పుడదియ
క్షణములోపల గొప్పదై కానిపించు;
నేది నడుమను నెడముండి యొసఁగుచుండు
నదియు నొకటిగాఁ గలిసియున్నట్లు తోఁచు;
గీ. ప్రకృతిచేతను నెయ్యది వక్రమగునొ
పరఁగ నయ్యది సమరేఖనలెనె యుండు;
దూరమిది చేరువిది యని, తేటపడిని,
నిర్ణయింపఁగరా దేకనిమిషముననె.

సూతుఁడా! ఇదిగో హరిణంబును మరణంబునొందించుచున్నాఁడఁ జూడుము. (అని వింటబాణమును సంధించుచున్నాఁడు.)

(తెరలోనుండి) ఓహో! రాజా! ఇది యాశ్రమమృగము. చంపఁదగినది కాదు. చంపఁదగినది కాదు.

సూతు.—(ఆవంకఁజూచి యాలకించి) దేవా! ఇదిగో బాణపాతదూరమున నున్న యీసారంగమునకును మనకును నడుమ నెవ్వరో జడదారులు వచ్చుచున్నారు.

రాజు.—(తొట్రుపాటుతో) అట్లయిన గుఱ్ఱములనిలుపుము.

సూతు—ఆలాగుననె. (అని రథము నిలుపుచున్నాఁడు.)

[అప్పు డిద్దఱుశిష్యులతో వైఖానసముని ప్రవేశించుచున్నాఁడు.]

వైఖా—(చేయెత్తి) రాజా! ఇది మాయాశ్రమమృగము. చంపకు చంపకుము.

గీ. వలదు వల దల్లబాణంబు విడలఁబోకు
మృదువయినయీకురంగంబు మేనిమీఁద,
దారుణంబుగ మండెడుదహనశిఖను
విరులమొత్తంబుమీఁదను విడుచునట్లు.

గీ. వజ్రసారంబు నిశితనిపాతఘోర
మట్టినీమార్గణం బేడ ? యక్కటకట !
యరసిచూడంగ నత్యంతతరళమైన
యీహరిణపోతజీవితం బిదియు నేడ ?

గీ. కాన నిప్పుడ, మనుజేంద్ర ! కార్ముకమునఁ
జక్కసంధించినశరంబు సంహరింపు ;
ఆర్తులనుగావఁ బుట్టినయట్టినీదు
శరము నిరపరాధులమీఁదఁ జనఁగఁదగునె ?

రాజు—ఇదిగో ! ఉపసంహరించినాఁడ. (అని చెప్పినట్లుచేయుచున్నాఁడు.)

వైఖా—(హర్షముతో) ఇది పూరువంశప్రదీపకుండవగు నీకే చెల్లినది.

క. ధరఁ బూరువంశజుండగు
దొరకుం దగు నీక యిట్టిదొడ్డగుణంబుల్ ;
మరినీవుఁ బడయుమిటువలె
వరగుణములుగలుగుచక్రవర్తిం బుత్రున్ !

శిష్యులు—(చేతులెత్తి) తప్పక చక్రవర్తి యగు కొడుకుం బడయుదువుగాత !

రాజు—(ప్రణమిల్లి) భూసురాశీర్వాదముం బ్రతిగ్రహించినాఁడ.

వైఖా—రాజా! మేమిప్పుడు సమిధలందేర బయలుదేఱి నారము. మాలినీతీరమునఁ గులపతులును మాగురువులును నగుకణ్వ మహామునుల యాశ్రమమిదె కానఁబడుచున్నది. కార్యాంతరభంగంబు వాటిలకుండునేని, అందుఁ బ్రవేశించియతిథిసత్కారంబుఁ గైకొనఁదగును.

గీ. పుణ్యదములును నిర్విఘ్నములును నైన
యలతపోధనానుష్ఠానములను జూచి,
జ్యాకిణాంక మీభుజమె కా యరసి యింత
దవ్వు రక్షించునది? యని తనరఁగలవు.

రాజు—కులపతులగు కణ్వమహర్షు లిప్పు డాశ్రమముననే యున్నారుకదా!

వైఖా—లేరు. అతిథిసత్కారార్థము తమకూఁతు శకుంతల నియోగించి, యామెయొక్క ప్రతికూలదేవతం బ్రశాంతినొందించు నిమిత్తము వారిప్పుడే సోమతీర్థమునకుం బోయినవారు.

రాజు—కానిండు; ఆమెనేకాంచెద. ఆమెయైన నాభక్తి నమ్మహర్షికి విన్నవింపఁగలదు.

వైఖా—ఇఁక మేము మాపనికింజనియెదము.

(అని శిష్యులతోఁగూడ నిష్క్రమించె.)

రాజు—సూతుఁడా! అశ్వంబులందోలుము. పుణ్యాశ్రమసందర్శనంబున మనగాత్రములం బవిత్రము గావించుకొందము.

సూతు—దేవర యాజ్ఞాప్రకారము చేసెద.

(అని రథమును వేగముగాఁ దోలుచున్నాఁడు)

రాజు—(అంతటఁ గలయంజూచి) సూతుఁడా! ఇది చెప్పకున్నను, తపోవనముయొక్క పరిపూర్ణతయని తెలియవచ్చుచున్నది!

సూతు—ఏలాగున?

రాజు—నీవు చూడవా యేమి? ఇదిగో—

సీ. చిలుకతొఱ్ఱల కందువులనోళ్లనుండి ని
వ్వరిధాన్యములు జాఱె దరుల క్రింద,
నింగుదీఫలముల నిందందునూఱిన
పొలుపుఁ దెల్పెడు నూనెగలుగుశిలలు,
విశ్వాసమునఁ జేసి వింతశబ్దము సైఁచి
మెదలక నిల్చె నీమృగచయంబు,
వల్కలాంచలములవలన జాఱినవారి
ధారాంకితము లేటిదారు లొప్పె,
పవనాప్తిఁ గదలు కాలువనీటఁ దడిసిన
మూలంబులను నొప్పె భూరుహములు,
క్రమ్ముకొన్నట్టియాజ్యధూమమ్ముచేతఁ
జిగురుటాకులరాగంబు చెన్నుమాసె;
కుశలుకోసినకోనలఁ గొంకులేక
మేసెడుఁ గురంగశాబముల్ మెల్లమెల్ల.

సూతు—సర్వమును సరిగానున్నది.

రాజు—(కొంచెముదూరముపోయి) సూతుఁడా! తపోవనవాసులకు బాధకలుగరాదు. రథ మిక్కడనే నిలుపుము. నేను దిగియెదను.

సూతు—పగ్గములం బట్టినాఁడను. ఇఁక దేవర దిగవచ్చును.

రాజు—(దిగి తనవేషముఁ జూచుకొని) సూతుఁడా! తపోవనంబులకుం బోవునపుడు వినయవేషంబులతోడనె చనవలయునుగదా? వీనిం బట్టుకొమ్ము. (అని ధనువును, ఆభరణములును, సూతునిచేత నిచ్చి) నేనాశ్రమవాసులం జూచి మరలి వచ్చునంతలోన గుఱ్ఱములం గడుగుము.

రాజు—(నడచి యిటునటుఁజూచి) ఇదే యాశ్రమద్వారము ; లోనికింజనియెదను. (ప్రవేశించి నిమిత్తమును సూచించి)

గీ. ఇది ప్రశాంతమౌయాశ్రమపదము చూడ ;
నదరెడు భుజంబు ; ఫలమెట్టులొదవు నిందు ?
అట్లనఁగనేల ? భాగ్యంబు లమరనున్న
కాలమందు, సర్వత్ర మార్గములు గలుగు.

(తెరమఱుఁగున) నెచ్చెలులారా ! ఇక్కడ ఇక్కడ.

రాజు—(చెవియిచ్చివిని) ఇదిగో సమీపమునఁ జెట్లచాటునకు దక్షిణమున మాటలవలె వినఁబడుచున్నవి. అచ్చటకుఁ బోయెదను. (వెళ్లిచూచి) ఇదె యాతపస్వికన్నెలు తమశక్తికిందగిన నీళ్లకుండలతో లేఁతచెట్లకు నీళ్లుపోయ నీవైపునకే వచ్చుచున్నారు. (వారివంకఁ బాఱఁ జూచి) ఓహో ! వీరిదర్శన మెంతమనోహరముగా నున్నది !

గీ. ఆశ్రమంబున నున్న, నియతివజనము
లలితమూర్తి శుద్ధాంతదుర్లభము చూవె ;
ఔనుగా యెందునేని యుద్యానలతల
వనలతలె మించవే గుణగణముచేత ?

కానిమ్ము. నేనీ చెట్లనీడనునిలిచి వీరివ్యాపారముంగనిపెట్టెదను.

[పూర్వము చెప్పినపనియందే ప్రవర్తించుచు సఖులతో శకుంతల ప్రవేశించుచున్నది.]

శకుం—నెచ్చెలులారా ! ఇక్కడ, ఇక్కడ.

అనసూయ—చెలియా ! శకుంతలా ! గురువులగు కాశ్యపులకు నీకంటె నీవృక్షములే ప్రియతరంబులని నే ననుకొనియెదను. ఎందుచేత నందువేని, ఈనవమల్లికాకుసుమకోమలి వగునిన్నును వీనిపాదులకు నీళ్లుపోయనియమించెను.

శకుం___ఓయనసూయా ! కేవలపితృనియోగమేగాదు. నాకును వీనియెడల సోదరస్నేహమే. (అని చెట్లఁదడుపుట నభినయించుచున్నది.)

ప్రియం___సఖీ ! శకుంతలా ! ఇంతదనుక నీళ్ళుపోసిన యాశ్రమ వృక్షము లీగ్రీష్మకాలమునం బుష్పించునవి. పుష్పించుకాలము గడచి పోయినవృక్షముల కిప్పుడు నీళ్ళు పోయుదము. అందుచే మనకధిక పుణ్యము వచ్చును.

శకుం___ఓప్రియంవదా ! చక్కఁగా నాలోచించితివి.

(అని మరలఁ జెట్లుదడుపుట నభినయించుచున్నది.)

రాజు___ఈమె నేలాగునఁ గణ్వపుత్త్రి యనుకొందును? (విస్మయముతో) ఓహో ! ఈమె నిట్లాశ్రమధర్మమునందు నియోగించిన పూజ్యుఁడయినయాకాశ్యపుఁ డుచితాలోచన లేనివాఁడుగానున్నాఁడు !

గీ. ఈనిసర్గమనోహరం బైనమేని
నుగ్రతపములపాల్ సేయ నొప్పు నిమ్మ
హర్షి నీలోత్పలదళమ్మునంచుచేత
తాఁ సమిల్లతలను గోయఁ దలఁపఁడెట్లు ?

ఔఁగాక ! చెట్లమఱుఁగున నుండియే వీరి కనుమానము పుట్టకుండ నీమెజాడలఁ గనిపెట్టుచుండెద. (అని యాప్రకారము చేయుచున్నాఁడు.)

శకుం___అనసూయా ! ప్రియంవద దయమాలి స్తనవల్కల మ్మును గట్టిగా బిగించినది. దీనిని సడలింపుమా.

అన___ఆలాగుననే. (అని వదులు చేయుచున్నది.)

ప్రియం___(నవ్వుచు) ఇప్పుడు నీగుబ్బల నుబ్బించిన నీయౌవన ప్రాదుర్భావమునే నిందించుకొమ్ము. ఊరకనన్నేలనిందించెదవు ?

రాజు___ప్రియంవద యధార్థము చెప్పినది.

గీ. పండుటాకులలోఁ గప్పఁబడినపూవు
భంగి, నిజశోభ నింతినవాంగకంబు

చూపలేదయ్యెఁ, జిఱుముడి మూపునోటియఁ
గవచనులయుబ్బు మాటువల్కలముచేత.

ఏమి? ఈమెశరీరమున కీవల్కలము తగనిదేయయినను, అలం
కారశోభం బెంపుఁ జెందింపకున్నదికాదు.

చ. నలినము శైవలంబునఁ బెనంగొనియుండియు రమ్యమేయగుర్ ;
మలినకళంకముం గలిగి మంజులతన్వహియించుఁ జంద్రుఁడుర్ ;
చెలువునమించె నీజలజనేత్రయు వల్కలధారణంబునర్ ;
తలఁపఁగ సుందరాంగులకుఁ దాను విభూషణ మేదిగాదిలర్ ?

మఱియు నాడెందంబునందు—

గీ. కఠినమయ్యు మృగాక్షికిఁ గాంతవల్క
లమ్ము రుచిభంగ మీదయ్యె లవము, వికచ
కంజములుగల్గునళినికిఁ గంఠ మింత
విడువఁబడిన శర్కశవృంతవితతివోలె.

శకుం—(ముందువంకఁజూచి) సఖులారా ! ఈపొగడచెట్టు గా
లిచేఁ గదలు చిగురుఁగేల నన్నుఁ ద్వరపెట్టుచున్నట్టున్నది. దీనిం గార
వింతము రండు. (అని యందఱు నడుచుచున్నారు.)

ప్రియం—సఖీ ! శకుంతలా ! ఇచ్చటనే మఱి నిమిషము
నిలువుము.

శకుం—ఎందునిమిత్తము ?

ప్రియం—నీవు దాపున నిలుచుటంజేసి యీపొగడవృక్షము
లతతోడంగూడియున్నట్టు ప్రకాశించుచున్నది.

శకుం—ప్రియంవదా ! ఇందువల్లనేకదా నీవు ప్రియంవద
వైతివి.

రాజు—ప్రియంవదా ? ప్రియమయినను సత్యమేపలికినది.
ఈమెకు—

గీ. కిసలయంబుపగిదిఁ గెమ్మోవి తనరారు ;
బాహువులు మృదువిటపములఁ బోలు ;
అంగకములనెల్ల నమరెను బరువంబు
వలపుగొలుపఁదగుచు నలరువోలె.

అన — సఖీ ! శకుంతలా ! ‘వనజ్యోత్స్న’ యని నీవు పేరు పెట్టుకొన్న యీనవమాలిక యిప్పుడు బాలరసాలమునకు స్వయంవరవధువైనది. దీనింజూచితివా ?

శకుం — (లతయొద్దకుఁబోయిచూచి) చెలియా ! ఆహా ! ఈరమణీయకాలమున, ఈలతాపాదపమిథునమునకు నొండొరులం గలియుట సంభవించినది ! నవకుసుమయౌవన యీవనజ్యోత్స్న ; పల్లవరాగంబున నొప్పి భోగార్హమయినది యీ క్రొమ్మామిడిగున్న.

(అని చూచుచు నిలుచున్నది.)

ప్రియం — (చిఱునవ్వుతో) అనసూయా ! ఎందుచేత శకుంతల ‘వనజ్యోత్స్న’ ను దడవుగఁ జూచుచున్నదో నీవెఱుఁగుదువా ?

అన — నే నూహింపఁజాలను, నీవె తెలుపుము.

ప్రియం — ఈవనజ్యోత్స్న యేప్రకారముగాఁ దగిన పాదముతోడఁ గూడినదో యాప్రకారముగాఁ దానును తనకుఁదగినవరునిఁ బొందవలయునని.

శకుం — (అసూయతో) ఇది నిశ్చయముగా నీకు నీమనసులోనున్నకోరిక. (అని జలకలశమును వంచుచున్నది.)

అన — ఓశకుంతలా ! జనకులగు కాశ్యపులచే నీవలెనే స్వహస్తముతోఁ బెంపఁబడిన మాధవీలత యిది. దీని న్మఱచిపోతివిగదా ?

శకుం — నన్ను నేను మఱతునేని, అప్పుడు దీని న్మఱతును. (లతనుజూచి) ఆశ్చర్యము ! ఆశ్చర్యము ! ప్రియంవదా ! నీకొక్క ప్రియము చెప్పెదను.

ప్రియం—సఖీ! నాకుఁ బ్రియమేది?

శకుం—అకాలమయినను, ఈమాధవీలత యిప్పు డామూలమును మొగ్గదొడిగినది.

ఉభయ—(సత్వరముగాఁ జనుచు) చెలియరో! నిజముగానా? నిజముగానా?

శకుం—నిజముకాదా? మీరు చూచుచుండి.

ప్రియం—(సంతోషముతోఁజూచి) సఖీ! దీనిచేతనే నీకు నే నొక్క ప్రతిప్రియము చెప్పెదను.

శకుం—నాకుఁ బ్రతిప్రియమేది?

ప్రియం—నీకుఁ బాణిగ్రహణము సమీపించుచున్నది—

శకుం—(అసూయతోఁగూడినట్టుగా) ఇది నీమనసులోని పిచ్చియూహ. కాఁబట్టి నీమాట నేను వినను.

ప్రియం—సఖీ! నేను పరిహాసముగాఁ జెప్పుచున్నదానంగాను. ఇది నీకళ్యాణసూచకమయిన నిమిత్తమని పూజ్యులగు కణ్వమహర్షుల ముఖమువలననే విన్నదానను.

అన—ప్రియంవదా! అందుచేతనేకదా శకుంతల యీమాధవీలత కంత ప్రేమతో నీళ్లుపోయుచున్నది.

శకుం—అది నాకుఁ దోఁబుట్టువు. కాఁబట్టి నేనెట్లు నీళ్లుపోయకుండఁగలను? (అని కలశము వంచుచున్నది.)

రాజు—(మనసులో) నాయీమనోరథము దుర్లభమేమో ఈమె కులపతియగు కణ్వునకు స్వజాతీయమైన భార్యయందుఁ బుట్టినది కాకుండవచ్చునా? తప్పు దలఁచితిని; సందేహింపఁబనిలేదు.

గీ. నృపపరిగ్రహయోగ్య యీనెలఁత నిజము;
కాక, నామది నిర్దోష మీకె నెట్లు

దవులు? నెందు సందేహవస్తువులయందు
నాత్మగతులె ప్రమాణంబు లార్యులకును.

అయినను, ప్రత్యక్షముగానే యీమె నెఱింగెద.

శకుం.—(తొట్రుపాటుతో) నీళ్లుపోయుటచే త్రుళ్లిపడి, యీ తుమ్మెద నవమాలికాకుసుమమ్మును విడిచిపెట్టి నానెమ్మోమున వ్రాల వచ్చుచున్నది! (అని భ్రమరబాధ నభినయించుచున్నది.)

రాజు.—(ఆశమీాఱ విలోకించి) మేలు! ఈమెపీడయును రమణీయముగానేయున్నది.

క. ఎందెందుఁ దిరుగుఁ దుమ్మెద,
యందందే బెళుకుఁగనుల నడరింపు చని
చ్చం ద్రిప్పెడు బోమ లఘుకున
మందగమన దృష్టివిభ్రమము నేర్చెనో!

(అసూయ కలిగినట్టుగా)

చ. కదలెడుకల్కిబెళ్కుఁగడకన్నుల నంటెదు మాటిమాటికిన్;
పదిగ రహస్యమాడుగతిఁ బల్కెదు కర్ణముచెంతఁజేరి; బల్
ముదమున శాస్పదంబయినమోవిని గ్రోలెదు కేల్విదల్ప; ష
ట్పద! కృతివీవ; మేమె చెడువారము తత్త్వవిచారమగ్నతన్.

శకుం.—చెలులారా! నీతిమాలిన యీతుమ్మెదచేత బాధింపఁబడుచున్న నన్ను రక్షింపుఁడు.

ఇద్దఱు.—(చిఱునవ్వుతో) ఈతపోవనంబులు రాజుచే రక్షింపఁబడుచుండ, నిన్ను రక్షించుటకు మే మెవరము? దుష్యంతునిం బిలువుము.

రాజు.—(తనలో) బయల్పడుటకు నాకిదియ మంచిసమయము. (ప్రకాశముగా) భయపడవలదు—(అని సగముచెప్పి మనసులో) ఇట్లయిన రాజభావము వెల్లడి యవును. అవుఁగాక! ఇట్లుపలికెదను.

ప్రియం—సఖీ! నాకుఁ బ్రియమేది?

శకుం—అకాలమయినను, ఈమాధవీలత యిప్పు డామూలమును మొగ్గదొడిగినది.

ఉభయ—(సత్వరముగాఁ జనుచు) చెలియరో! నిజముగానా? నిజముగానా?

శకుం—నిజము కాదా? మీరు చూచుండి.

ప్రియం—(సంతోషముతోఁ జూచి) సఖీ! దీనిచేతనే నీకు నే నొక్క ప్రతిప్రియము చెప్పెదను.

శకుం—నాకుఁ బ్రతిప్రియమేది?

ప్రియం—నీకుఁ బాణిగ్రహణము సమీపించుచున్నది—

శకుం—(అసూయతోఁ గూడినట్లుగా) ఇది నీమనసులోని పిచ్చియూహ. కాఁబట్టి నీమాట నేను వినను.

ప్రియం—సఖీ! నేను పరిహాసముగాఁ జెప్పుచున్నదానంగాను. ఇది నీకళ్యాణసూచకమయిన నిమిత్తమని పూజ్యులగు కణ్వమహర్షుల ముఖమువలననే విన్నదానను.

అన—ప్రియంవదా! అందుచేతనేకదా శకుంతల యీమాధవీలత కంత ప్రేమతో నీళ్లుపోయుచున్నది.

శకుం—అది నాకుఁ దోఁబుట్టువు. కాఁబట్టి నేనెట్లు నీళ్లుపోయకుండఁగలను? (అని కలశము వంచుచున్నది.)

రాజు—(మనసులో) నాయీమనోరథము దుర్లభమేమో! ఈమె కులపతియగు కణ్వునకు స్వజాతీయయైన భార్యయందుఁ బుట్టినది కాకుండవచ్చునా? తప్పు దలఁచితిని; సందేహింపఁబనిలేదు.

గీ. నృపపరిగ్రహయోగ్య యీనెలఁత నిజము;
కాక, నామది నిర్దోష మీకె నెట్లు

దవులు ? నెందు సందేహవస్తువులయందు
నాత్మగతులె ప్రమాణంబు లార్యులకును.

అయినను, ప్రత్యక్షముగానే యీమె నెఱింగెద.

శకుం.—(తొట్రుపాటుతో) నీళ్లుపోయుటచే త్రుళ్లిపడి, యీ తుమ్మెద నవమాలికాకుసుమమ్మును విడిచిపెట్టి నానెమ్మోమున వ్రాల వచ్చుచున్నది ! (అని భ్రమరబాధ నభినయించుచున్నది.)

రాజు.—(ఆశమీఱ విలోకించి) మేలు ! ఈమెపీడయును రమణీయముగానేయున్నది.

క. ఎందెందుఁ దిరుగుఁ దుమ్మెద,
యందందే బెళుకుఁగనుల నడరింపు చని
చ్ఛం ద్రిప్పెడు బోమ లఘుకున
మందగమన దృష్టివిభ్రమము నేర్చెకునో !

(అసూయ కలిగినట్టుగా)

చ. కదలెడుకల్కిబెళ్కుఁగడకన్నుల నంటెదు మాటిమాటికిన్ ;
పదిగ రహస్యమాడుగతిఁ బల్కెదు కర్ణముచెంతఁజేరి ; బల్
ముదమున కాస్పదంబయినమోవిని గ్రోలెదు కేల్విదల్ప ; ష
ట్పద ! కృతివీవ ; మేమె చెడువారము తత్త్వవిచారమగ్నతన్.

శకుం.—చెలులారా ! నీతిమాలిన యీతుమ్మెదచేత బాధింపఁబడుచున్న నన్ను రక్షింపుఁడు.

ఇద్దఱు.—(చిఱునవ్వుతో) ఈతపోవనంబులు రాజుచే రక్షింపఁబడుచుండ, నిన్ను రక్షించుటకు మే మెవరము ? దుష్యంతునిం బిలువుము.

రాజు.—(తనలో) బయల్పడుటకు నాకిదియ మంచిసమయము. (ప్రకాశముగా) భయపడవలదు—(అని సగముచెప్పి మనసులో) ఇట్లయిన రాజభావము వెల్లడి యవును. అవుఁగాక ! ఇట్లుపలికెదను.

శకుం.—ఈదుష్టషట్పదము నన్ను వదలకున్నది. మఱియొక చోటికేగెద. (మఱియొక యడుగునడచి నిలిచి చూపులు నిగిడించుచు) హో! హో! ఇదియేమి! ఇక్కడకును వెంటఁబడుచున్నది!

రాజు.—(సత్వరముగావచ్చి)

గీ. ఎవఁడవుర నీవు? ముగ్ధలౌయీతపస్వి
కన్యకల నేచ వచ్చితి కావరమున;
దుర్వినీతుల దండించు చుర్వినెల్లఁ
బౌరవుం డేలుచుండంగ భయములేక.

(అందఱును రాజుంజూచి తత్తరపడుచున్నారు.)

అన.—అయ్యా! ఇప్పుడు విశేషోపద్రవము మఱేమియులేదు. మాప్రియసఖియైన యీకొమ్మ తుమ్మెదబాధవలన బెగడొందినది.

(అని శకుంతలం జూపుచున్నది.)

రాజు.—(శకుంతలవంకఁ దిరిగి) చక్కఁగాఁ దపస్సు వర్ధిల్లు చున్నదా?

శకుం.—(సిగ్గుచేతఁ దలవంచుకొని యూరకొన్నది.)

అన.—ఇప్పు డతిథిలాభముచేత మఱింతచక్కఁగా వర్ధిల్లుచున్నది.

ప్రియం.—దేవరవారికి స్వాగతము. (అని శకుంతలవంకఁదిరిగి) సఖీ! శకుంతలా! నీవు పర్ణశాలకుంబోయి, పండ్లతోడఁ గూడఁ బూజాద్రవ్యంబులం గొనిరమ్ము. ఇంతలో నీయుదకము పాదప్రక్షాళనంబున కుపయోగపడును.

రాజు.—ఏమియు నక్కఱలేదు. ఇప్పుడు మీప్రియవాక్యముల చేతనే నాకాతిథ్యము జరిగినది.

అన.—అట్లయిన ముహూర్తమాత్రము దేవర యీచల్లనినీడ గల యేడాకుల యరఁటిచెట్టుక్రింది వేదికమీఁదఁ గూరుచుండి యలయికం దీర్చుకోఁదగును.

రాజు—పనిచేసి మీరునునలసియున్నారు.ముహూర్తకాలము కూర్చుండుఁడు.

అన—సఖీ! శకుంతలా! మన కతిథిసేవయే యుక్తకృత్యము. కాఁబట్టి యిందుఁ గూర్చుందము. (అని యందఱుఁ గూరుచున్నారు.)

శకుం—(ఆలోచించి మనసులో) ఇదియేమోకాని యీయనం జూచి తపోవనంబులం గారాని యొకవికారంబునకు లోనయినదానను.

రాజు—(అందఱిని జూచి) ఓహో! మీస్నేహము సమానమయినవయస్సు చేతను రూపముచేతను రమణీయముగానున్నది!

ప్రియం—(రహస్యముగా) అనసూయా! ఈయన యెవరు? చతురగంభీరాకారంబున, మధుర ప్రియవాక్యంబులం బలుకుచు రాజువలెఁ గానవచ్చుచున్నాఁడు.

అన—నాకును గౌతూహలమగుచున్నది. ఈయననడిగెదను. (ప్రకాశముగా) దేవరవారిమధురాలాపంబులవలనం గలిగినవిశ్వాసము తమ్ముఁ గొన్నిసంగతుల నడుగ నన్నుఁ బ్రేరేఁచుచున్నది. తమచే నే రాజర్షివంశ మలంకరింపఁబడుచున్నది? ఏదేశమందు జనులు దేవర వియోగమునకుం గుందుచున్నారు? సుకుమారమయ్యు నీశరీరమెందు నిమిత్తము తపోవనగమనపరిశ్రాంతిపాలు చేయఁబడినది?

శకుం—(మనసులో) హృదయమా! ఆరాటమున్మానుము. నీవడుగఁదలఁచినదాని నీయనసూయయే యడుగుచున్నది.

రాజు—(మనసులో) నన్ను నేనేమని యిప్పుడు తెలుపుకొందును? ఏలాగున నన్ను నే మఱుంగు పెట్టుకొనైన నేర్తును? ఏమయినంగానిమ్ము; ఈప్రకారముగాఁ జెప్పెదను. (ప్రకాశముగా) పూరువంశసంభవుండయిన రాజుచేత ధర్మాధికారమునందు నియోగింపఁబడినవాఁడనయి, యాశ్రమవాసులక్రియానుష్ఠానములు నిర్విఘ్నములుగా నెగడుచుండుటం దెలిసికొన నీధర్మారణ్యంబునకు వచ్చినాఁడను.

అన—ధర్మమార్గమునంజరించు నాశ్రమవాసు లిప్పుడుగదా రక్షకునిఁగలవారైరి.

శకుం—(శృంగారలజ్జ నభినయించుచున్నది.)

సఖులు—(ఉభయులయాకారములం దెలిసికొని రహస్యముగా) సఖీ! శకుంతలా! పూజ్యులగుకణ్వమహాముని లిప్పు డిచ్చటనుండి రేని—

శకుం—(రోషముతో) ఉండిన నేమి?

సఖు—తమ ప్రాణతుల్యమైన ధనమొసంగి యీయతిథిం గృతార్థునిఁ గావింపఁగలరు.

శకుం—సఖులారా! వేఱొక్కటేదియో మనసునను౦చుకొని గూఢముగా మాటలాడెదరు. మీపలుకు లాలింపను.

రాజు—మేము నించుక మీ౦నెచ్చెలి వృత్తాంతము నడుగ వచ్చునా?

సఖు—దేవర యిట్లు కోరుట మాకనుగ్రహమకదా!

రాజు—మహానుభావుఁడగు కాశ్యపుఁడు శాశ్వత బ్రహ్మనిష్ఠుఁడని ప్రసిద్ధి. అట్టివాని కెట్లు మీ౦నెచ్చెలి కూఁతురయ్యెను?

అన—దేవర యాకర్ణింపవలయును. కౌశికుండనివంశనామము గల మహాప్రభావసంపన్నుఁ డయినరాజర్షి యొకఁడు కలఁడుకదా?

రాజు—కలఁడు; వినియున్నాము. అనంతరము.

అన—అతఁడే మాచెలియఁ గన్నవాఁడు. కన్నవారిచే విడువంబడినయీమెను బెంచుట మొదలుగాఁ గల పనులు నిర్వర్తించుటఁజేసి పూజ్యులగుకణ్వులును నీమెకు జనకులయిరి.

రాజు—"విడువఁబడి" యను శబ్దశ్రవణముచేతనే వేడుక పొడముచున్నది. మొదటినుండియు వినఁగోరుచున్నాను.

అన—దేవర యవధరింపవలయును. పూర్వ మారాజర్షి యుగ్ర

తపస్సు చేయుచుండఁగా, దేవతలు భయపడి యానియమమునకు విఘ్నమాచరింప మేనక యనునచ్చరం బుచ్చిరి.

రాజు—దేవతల కీపరతపోభయశీలత యెప్పుడునున్నదియే. తర్వాత, తర్వాత.

అన—అంత నత్యంతరమణీయ మగువసంతకాలమున నున్మాదమును బుట్టించు నాపెరూపమునుజూచి—(అని సగము చెప్పి లజ్జచే నూరకున్నది.)

రాజు—ఆపయిని దెలియనే తెలియుచున్నది. తప్పక యీమె యప్సరస్సంభవయే.

అన—సందేహమేమి?

రాజు—స్పష్టమగుచునే యున్నది.

క. ఇటువంటిరూప మూరయ
నెటుపుట్టును మర్త్యచంచలేక్షణలందున్?
చటులప్రభాతరళ మగు
తటిల్లత జనింపఁగలదె ధారుణి నెందున్?

శకుం—(క్రిందుచూచుచుఁ గూరుచున్నది.)

రాజు—(మనసులో) నామనోరథమున కవకాశమున్నది. అయినను, చెలికత్తెయుచేఁ బరిహాసముగా నుదాహరింపఁబడిన యీమెయొక్క వరవిషయకమైన ప్రార్థనను విని నాడెందము సందేహముచే నాందోళించుచున్నది.

ప్రియం—(చిఱునవ్వుతో శకుంతలవంకఁ జూచి, నాయకాభిముఖియై) దేవరవారు మఱియు నేమో పలుకఁ దలఁపు గలిగి యున్నట్టు కనుపట్టుచున్నారు.

శకుం—(అంగుళిచే నచ్చెలిని బెదరించుచున్నది.)

రాజు—నీవు లెస్సగాఁ గనిపెట్టితివి. సచ్చరిత్రశ్రవణమునందలి యపేక్షవలన మఱియు నొకప్రశ్న మడుగవలసియే యున్నది.

ప్రియం.—సందేహింపవలదు. తపస్విజనులను సంకోచములేక యడుగఁ దగునుగదా ?

రాజు—మీసఖినిగూర్చియె యెఱుంగఁ గోరుచున్నాము.

ఉ. ఈరమణీలలామ హృదయేశున కీఁబడుదాఁకఁ గాముప్యా
పారనిరోధి యైనవ్రతభారము దీనిని బూనియుండునా ?
చారువిలోచనప్రభల సామ్యమువచ్చుకురంగభామినీ
వారముతోడ నిచ్చటనె వాసము నిత్యము చేయుచుండునా ?

ప్రియం.—దేవా! ధర్మాచరణమునందుసహిత మీతరుణి పరాధీనయే. అయిన నీమెం దగినవరున కీవలెననియే యెప్పుడును దండ్రి సంకల్పము.

రాజు—(సంతోషముతో మనసులో) ఆయనసంకల్పము దుర్లభముకాదు.

గీ. హృదయ ! సాభిలాషివి గమ్ము యింక నీవు ;
సంశయనివృత్తి యిత్తఱి సంభవించె ;
ననల మని దేని భ్రమియించి తదియె యిప్పు
డంటఁగూడినమానిక మయ్యెఁజుమ్ము.

శకుం—(రోషముతోఁ గూడినట్లుగా) అనసూయా ! నేను వెళ్లెదను.

అన—ఎందునిమిత్తము ?

శకుం—ఈయసంబద్ధప్రలాపములను ప్రేలుప్రియంవదకథ పూజ్యురాలయిన గౌతమితోఁ జెప్పుటకు.

అన—సత్కారముం బడయని యతిథిప్రశస్తు నిట్లు విడిచిపెట్టి మనసువచ్చినట్లు పోవుట యాశ్రమవాసినులగు నాఁడువారికిం దగవు కాదు.

శకుం—(ఏమియు బదులుపలుకక బయలుదేఱినది.)

రాజు—ఆ! ఎట్లుపోవుచున్నది! (కూడఁజనఁగోరు తనమనసును నిగ్రహించి) కాముకజనమనోవ్యాపారము చేష్టలతో సమానమయినది గానే యుండును! కావుననే నేనును—

క. మునిపుత్రికవెంటం బడి
చనఁజూచియు నిలుపఁబడితి సౌశీల్యముచే
త నిపుడ, యిమ్ముఁ గదలకయుఁ
జనిక్రమ్మరవచ్చినట్టె సరిగాఁ దోఁచున్.

ప్రియం—(శకుంతలం బట్టుకొని) సఖీ! నీవు పోఁగూడదు.

శకుం—(బొమముడితో) ఎందుచేత?

ప్రియం—నీవు నాకు రెండుచెట్లకు నీళ్లుపోయ నప్పుపడి యున్న దానవు. కాఁబట్టి నాఋణముతీర్చి మఱిపోదువుగాని రా.

(అని బలాత్కారముగా మరలించుచున్నది.)

రాజు—ఓదయామయీ! నాకుంజూడ వృక్షములకు నీళ్లు పోయుటవలననే యీమె యలసిపోయినట్టు తోఁచుచున్నది. ఔను గదా? ఈమెకు,

ఉ. కుండనుబూన మూఁపు లవి క్రుంగెను, హస్తతలంబు లెఱ్ఱనై
యుండె, వడంకఁజొచ్చెఁగుచయుగ్మము, మిక్కిలియయ్యె శ్వాసముల్,
నిండెను మోమునందుఁ జెవినిడ్డ శిరీషమువాడఁ జెమ్మటల్,
వెండ్రుకలుం గలంగె ముడివీడఁగఁ దా నొకచేతఁ జెర్వటన్.

కావున నీమెఋణమును నేను దీర్చెదను; కైకొనుఁడు.

(అని చేతియుంగరము నిచ్చుచున్నాఁడు.)

సఖులు—(పుచ్చుకొని నామముద్రాక్షరములఁ జదువుకొని యొకరినొకరు చూచుకొనుచున్నారు.)

రాజు—మమ్ము వేరువిధముగా భావింపవలదు. రాజపురుషుల మగుటచే, మాకిది రాజువలన లభించినది.

ప్రియం.—అందుచేతనే యీయుంగరము దేవరవ్రేలి నెడఁబాయఁదగదు. తమ మాటచేతనే యీమెఋణము తీరిపోయినది.

అన.—సఖీ! శకుంతలా! దయాళువయినయీయనచే, లేక, యీమహారాజుచే, నీఋణవిమోచన మయినది. ఇప్పుడు నీవు పోవచ్చును.

శకుం.—(మనసులో) నేనే స్వతంత్రురాల నయితినేని—

ప్రియం.—ఇంకను వెళ్లవేమి?

శకుం.—ఇప్పుడు నేనేమియు నీయాజ్ఞకు లోఁబడియుండలేదు. నాయిష్టమువచ్చినప్పుడు నేనుబోయెదను.

రాజు.—(శకుంతలంజూచి మనసులో) ఈమెమీఁద నాకెట్లున్నదో యీమెకును నామీఁద నట్లేయున్నదేమో! ఏలాగుననయినను నాకోరిక కవకాశమున్నది. ఎట్లంటేని—

గీ. కలిసి మాటాడకున్న, నాపలుకులకును
వీను లొగ్గెడు నభిముఖియై నెలంత;
వెలఁది నామోముననె చూడ్కి నిలుపకున్న,
నన్యవిషయంబులకుఁ బోవ దతివదృష్టి.

(తెరలో)

ఓహో! తపస్వులారా! మీరు తపోవనమునందలి జంతువుల రక్షింప సిద్ధముగా నుండుఁడు. మృగయావిహారి యగుదుష్యంత మహారాజు సమీపమున వచ్చుచున్నాఁడఁట.

గీ. కొమ్మలకుఁగట్టి తడివల్కలములున్న
యాశ్రమమహీజములయందు, హయఖురాళి
నడరు పెనుధూళిపడెడు, సాయంతనంపు
టరుణరుచిఁ బొల్చుశలభచయంబువోలె.

రాజు.—(మనసులో) అక్కటా! సైనికులు నన్ను వెదకుచుఁ దపోవనంబులకు బాధ గలిగించుచున్నారు!

[మరల తెరలో]

ఓహో! తపస్వులారా! వృద్ధులును, స్త్రీలును, బాలురును, వ్యాకులపడ నిదిగో యేనుఁగొక్కటి సంప్రాప్తమయినది.

చ. అరదముఁ జూచి భీతి నొకహస్తి, కురంగ సమూహ ముక్కడిన్,
దరువు ప్రకాండమున్ బొడువ దంతముఖంబు బొకఁడంచు వోవఁగాఁ,
జరణములం దగుల్కొనినచారులతావళి నీడ్చుకొంచు, న
బ్బురముగఁ జొచ్చెఁబుణ్యవనమున్, వ్రతవిఘ్నమురూపుదాల్చెనాన్.

(అందఱునువిని యించుక సంభ్రాంతలయి లేచుచున్నారు.)

రాజు—(మనసులో) అయ్యో! నేను దపస్వుల కపరాధము చేసినవాఁడనయితిని! కానిమ్ము. నేఁ బోయి నివారించెదను.

సఖులు—దేవా! ఈయడవియేనుఁగు వృత్తాంతముచేతఁ గలఁగుండువడినారము. పర్ణశాలకుఁ జన ననుజ్ఞయిమ్ము.

అన—సఖి! శకుంతలా! పూజ్యురాలగు గౌతమి విచారించుచుండును. శీఘ్రముగారమ్ము, అందఱము నొకటిగాఁ గూడుకొందము.

శకుం—(నడవలేనట్లభినయించుచు) హా! హా! నడవఁ గాళ్లాడకున్నవి!

రాజు—(తొట్రుపాటుతో) మీరు యథేచ్ఛముగాఁబొండి. మే మాశ్రమపీడతొలఁగు ప్రయత్నముం గావించెదము (అందఱును లేచుచున్నారు.)

సఖులు—మీమహత్త్వమును గుర్తెఱిఁగి యుపచారము చేయమింజేసి యిప్పుడు మీయెడ నపరాధలమయితిమి; క్షమియింపుఁడు. మాచే సర్వసత్కారముం బడయని దేవరను వెండియుఁ జూడ వేడుక గలదని విన్నవించుటకు మాకు లజ్జయగుచున్నది.

రాజు—అట్లుకాదు. మీదర్శనముచేతనే మేము సత్కృతులమయితిమి.

శకుం — అనసూయా! సూదివంటి క్రొత్తదర్భపుడక నాపాదమునం గ్రుచ్చుకొన్నది. (మఱియొక యడుగుపోయి) చెలులారా! నా నారచీర కురువకవృక్షముయొక్క కొమ్మనం జిక్కుకొన్నది. దీనిం దీసికొనువఱకు నిలిచి నన్ను వెంటఁ గొనిపొండు. (అని మిషపెట్టి రాజుం జూచుచు నాలస్యముగా సఖులతో నడచుచున్నది.)

రాజు — (నిట్టూర్పు పుచ్చి) అందఱుం జనిరి! కాని నేనునుం జనియెదను. శకుంతలం బొడగాంచినది మొదలు నగరగమనమును గుఱించినయుత్సాహము తగ్గినవాఁడనైతిని. వెంటవచ్చినవారిం గలిసికొని తపోవనమునకు సమీపమున విడియించెదను. శకుంతలావ్యాపారమునుండి నాడెందమును మరలింపఁజాలకున్నాఁడను —

గీ. నడుచుచున్నది ముందుకు నాశరీర;
మాత్మ పరుగువాఱెడు వెన్క కవశమగుచు,
మంచిగాలికి నెదురుగఁ గొంచుఁబోవు
ధ్వజమునకుఁ గట్టు పట్టువస్త్రంబువోలె.

(అందఱు నిష్క్రమించిరి.)

శ్రీ

అభిజ్ఞాన

# శాకుంతలనాటకము.

## ద్వితీయాంకము.

ప్రదేశము—ఆశ్రమారణ్యము.

[అప్పుడు విదూషకుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

విదూ—(నిట్టూర్పు విడిచి) హా! దైవమా! మృగయాశీలుఁడగు నీరాజు చెలిమిచేత మోసపోతినిగదా! ఇదిగో మృగము, ఇదిగో వరాహము, అదిగో శార్దూలము, అని మిట్టమధ్యాహ్నమున మండు వేసవికాలమగుటచేఁ బలుచని నీడలుగల యరణ్యమార్గముల నొక యడవినుండి యొకయడవికిఁ ద్రిప్పటయగుచున్నది. ఆకులు పడిచెడి పోయిన వెచ్చనికొండయేళ్లనీళ్లు త్రాగ నబ్బుచున్నవి. వేళతప్పి కఱకుట్లమాంసము భోజనమునకు సంభవ మగుచున్నది. గుఱ్ఱముల యొక్కయు నేనుఁగులయొక్కయు ధ్వనులచేత రాత్రియైనను మంచి నిద్ర పట్టలేదు. తెల్లవాఱుజామున బానిసెకొడుకులు పిట్టవేఁట కాండ్రు చెవులు బద్దలుగా నఱచు వనగమన కోలాహలముచే మెలఁకువవచ్చినది. ఇప్పటికిని పీడపోలేదు. ఆమీఁద స్ఫోటకముమీఁద వ్రణమైనది. నిన్న మేము వెనుకపడియుండ, లేడివెంబడి నాశ్రమపదమును బ్రవేశించిన యీమహానుభావునకు నాదురదృష్టముచేత శకుంతల యను తాపసకన్య యొక్కతె కానఁబడినది. అప్పటినుండియు నగర గమన మనుకథయేనిఁ దలపెట్టఁడు. దీనినే యత్యంతము చింతించుచున్న నాకన్నులనె ప్రభాత మైనది. ఏమిగతి? సమయకృత్యములం దీఱ్చి కొని, వేషముం దాల్చియున్న నామిత్రునిం గాంచెదను. (అని వెళ్లి చూచి) ఇదిగో చేతులయందు విండ్లుదాల్చి, యడవి పువ్వులదండలు

వేసికొని కిరాతకాంతలు తన్నుఁజుట్టుకొనియుండఁ జెలికాఁ డీలాగుననే వచ్చుచున్నాఁడు. రానిమ్ము. అంగభంగమునఁ గదలలేనివానివలె నుండెను. ఈవిధమున నయినను గొంత విశ్రమము పొందెదను. (అని దండకాష్ఠము నానుకొని నిలుచుచున్నాఁడు.)

[అంత మున్ను చెప్పినపరివారముతో రాజు ప్రవేశించుచున్నాఁడు.]

రాజు—(మనసులో)

గీ. కనఁగఁ బ్రియురాలు సులభగాఁ గానిపించ,
దామె భావముఁగని మది యాసపడెదు ;
నింక మరుపూన్కి తుదముట్ట దిప్పుడయిన,
నుభయులకుఁ గోర్కు లానంద మొసఁగుచుండె.

(చిఱునవ్వునవ్వి) ఇట్లు కాముకుఁడు తనయభిప్రాయమున కనుగుణముగా నిష్టురాంద్రయొక్క చిత్తవృత్తులను భావించుకొని పరిహాసపాత్రుఁడగును.

ఉ. నిద్దపుఁజూడ్కి నొండుకడ నేత్రము ద్రిప్పుటయున్, నితంబముల్
పెద్దవియౌట మందగతి లీలనుబోవుట, బోటులాపి పో
వద్దనుచో ననూయమెయి వారలఁబల్కుట, కాముకుండు తా
నద్దిర ! సర్వమాత్మ విషయంబుగనే కొనుచుండు నాత్మలోన్.

విదూ—(ఆలాగుననేయుండి) ఓవయస్యా ! నాకరచరణంబులు గదలవు. వాఙ్మాత్రముచేతనే యాశీర్వదించెద. విజయీభవ !

రాజు—(చిఱునవ్వుతో) నీకీయంగవైకల్య మెందువలనఁ గలిగినది ?

విదూ—ఇదియేమి ? స్వయముగానే కన్నుగలియఁబెట్టి కన్నీళ్లేలఁ బొడమెనని యడిగెదవు !

రాజు—నాకేమియుం దెలియకున్నదే.

విదూ—ఓవయస్యా ! ఆప్రబ్బమాను కుబ్జలీలను విడంబించుచున్నది. అది స్వప్రభావముచేతనా ? నదీవేగముచేతనా ?

రాజు—నదీవేగమే యందునకుఁ గారణము.

విదూ—ఆప్రకారముగా నాకును నీవే!

రాజు—ఏప్రకారముగా?

విదూ—ఈవిధముగా నీవు రాజకార్యములను విడిచిపెట్టి, యిటువంటి వ్యాకులప్రదేశములయం దాటవికవృత్తి నుండఁదగితివి. నేనును నిశ్చయముగాఁ బ్రతిదినమును క్రూరమృగములను దోలుటచే కీళ్లు సడల నాయవయవములు నాయధీనములు గాకయున్నవి. కాఁబట్టి నాయందను గ్రహించి యొక్కదినమయినను నన్ను విశ్రమము పొందుటకు వదలి వేయుము.

రాజు—(మనసులో) వయస్యుఁడును నిట్లనుచున్నాఁడు; నాకును కణ్వతనయం దలంచి డెందంబు వేఁటయందు విముఖమగుచున్నది.

గీ. ఎపుడుఁ బ్రియురాలితోఁ గూడ నిచటనుండి
సొగసుఁజూపులఁ గరపినమృగచయంబు
పయిని బాణంబుఁబూనిచి వంచఁజాల
నెక్కుపెట్టిన యీవింటి నింక నేను.

విదూ—(రాజు మొగమువంకఁజూచి) దేవా! ఏమో మనసున నుంచుకొని యాలోచించుచున్నావు. నాపలుకు లరణ్యరోదనమాయెను.

రాజు—(చిఱునవ్వునవ్వి) మఱియేమున్నది? మిత్రునిమాట దాఁటరాదని చింతించుచుంటిని.

విదూ—దీర్ఘాయుష్మంతుఁడవుగమ్ము. (అని చనఁబోవుచున్నాఁడు.)

రాజు—మిత్రుఁడా! నిలువుము. నేనింకను నీతో మాటాడవలసియేయున్నది.

విదూ.—దేవా! ఆనతిమ్ము.

రాజు.—అలపు తీర్చుకొన్నపిమ్మట నీవు నా కొక్క యనాయాసకార్యంబునం దోడుపడవలయును.

విదూ.—కుడుములు తినుటయందా యేమి?

రాజు.—చెప్పెదనుండుము.

విదూ.—ఊరకున్నాను.

రాజు.—ఓరీ! ఎవఁడురా? అక్కడ.

దౌవారికుఁడు.—(ప్రవేశించి) దేవా! ఆజ్ఞయిండు.

రాజు.—రైవతకా! సేనాపతిం బిలువుము.

దౌవా.—ఆలాగుననే. (అని నిష్క్రమించి సేనాపతితోడం గూడఁ బ్రవేశించి) ఇదె యాజ్ఞాపించువేడ్కతో భర్త యీవంకనే చూడ్కి నిగిడించి యున్నాఁడు. దేవర సందర్శించు కొమ్ము.

సేనాపతి.—(రాజుపైఁ జూడ్కివోలయించి) వేఁట దోషయుక్తముగాఁ గానఁబడునది యయ్యును, స్వామియెడఁ గేవలము మేలుచేయునదియేయైనది. ఎట్లంటేని,

చ. పొరిపొరి మౌర్వి లాగుటను బూర్వశరీరము గట్టిపాఱి, భా
స్కరకిరణాళి కెంతయును సైఁచుచుఁ జెమ్మట లేశమైనఁ దం
బౌరయక, చిక్కియుఁ దృఢతఁ బొందుటఁ బల్చనిమేన, విక్రమ
స్థిరుఁడయి యీతఁ డొప్పెడును జెల్వగ శైలచరద్విపంబనన్.

(దగ్గఱకువచ్చి) స్వామీ! జయము వుఁగాక! ఈయరణ్యమందుఁ గ్రూరసత్వముల సంచారముల నరికట్టినారము. ఇఁక నిచ్చటనుండ నేల?

రాజు.—సేనాపతీ! మాధవ్యుఁడు వేఁటను దూషించుటచేత నాకు దానిమీఁది యుత్సాహము పోయినది.

సేనా.—(రహస్యముగా) వయస్యా! విదూషకా! నీపట్టును వదలకుండుము. నేను స్వామిచిత్తవృత్తి ననుసరించి ప్రవర్తించెదను.

(ప్రకాశముగా) ఈమూర్ఖునిం బ్రేలుకోనిండు. ఇక్కడ దేవరయే నిదర్శనముగా నున్నారు.

సీ. కడుపులోఁ గ్రొవ్వెల్లఁ గరఁగి యత్యంతంబు
నుదరంబుపలుచనై యొప్పెసంగు,
వ్యాయామమునఁజేసి కాయంబు చులుకగా
నెత్తుటకర్హమై యేపుమీఱు,
జంతుసంతానహృదంతరభయకోప
ముల వికారములును దెలియనగును,
శరము చలించు లక్ష్యమునందుఁ దాఁకిన
ధన్వికిఁ గరము సంతసముగలుగు,
వ్యసనమంచును వేఁటను బలుకుచుందు
రది యసత్యంబు కేవల మరసిచూడ,
వేఁటయే కానిపనియేని, వేఱుదేనఁ
బుట్టు నిట్టివినోదంబు పుడమిమీఁద ?

విదూ—(కోపముతో) రాజుగారెప్పుడు తెలివిగలిగియే యున్నారు. నీవే వనచరుఁడవయి యడవడవిఁ దిరుగుచుఁ గడకు ముక్కుకండలు కబళింపఁగోరు నొకముదిమెలుంగునోటఁ బడియెదవు.

రాజు—భద్ర! సేనాపతీ! పలుపలుకు లేల? మనమాశ్రమసమీపమున నున్నవారము కాఁబట్టినీమాటల కేము సమ్మతింపనేరము. ఇప్పుడు—

మ. మునుఁగంజెల్లు నిపానవారి మహిషంబుల్ కొమ్ములాడించుచుఙ్,
పెనునీడన్వసియించి లేళ్ళు నెమరుల్వేయం దగు న్గుంపులై,
పనిగాఁ బందులు ముస్తలెత్తఁజను విశ్వాసంబునన్ గుంటలన్,
ధనువిప్పట్టున విశ్రమింపఁగనగుఙ్ జ్యాబంధము న్బాయుచున్.

సేనా—ప్రభువువారికి రుచించునట్లు కానిండు.

రాజు—అట్లయిన మున్ను పోయియున్న వలవేఁటకాండ్రఁగ్రమ్మఱింపుము. మనసైనికులం దపోవనంబునువిడిచి దూరంబుగఁ బోవునట్లు దిట్టము చేయవలయును. చూడు—

గీ. శాంతిపరు లౌతపోధనచంద్రులందు
దహనశీల మహాతేజంబు దాఁగియుండు;
తాఁకఁ దగియుండు సూర్యకాంతంబులట్ల,
వెలికిఁ దార్తురు పరతేజమడర దాని.

సేనా—స్వామి యానతిచ్చినట్ల.

విదూ—నీయుత్సాహవార్తలుచాలించి, తొత్తుకొడుకా! పో.

(సేనాపతి నిష్క్రమించెను.)

రాజు—(పరివారముఁగాంచి) మీరు వేఁటవేషంబులఁ దీయుండి. రైవతకా! నీవును నాయాజ్ఞ నడిపింపుము.

పరిజనము—దేవర యాజ్ఞాపించినట్ల. (అని నిష్క్రమించిరి.)

విదూ—నీవిప్పుడీఁగనైన లేకుండఁ జేసితివి. ఇఁక దట్టము లగు తీవజొంపములతోడఁగూడిన యీచెట్టునీడను గూరుచుందుము. నేనును సుఖాసీనుండనయ్యెద.

రాజు—ముందు నడువుము.

విదూ—రమ్ము నీవునురమ్ము. (ఇద్దఱునునడిచికూర్చున్నారు.)

రాజు—మాధవ్యా! నీవు కన్నులుగలఫలంబుఁ బొందలేదు. ఏలయన—నీవు దర్శనీయమగు పదార్థముం జూడకపోతివి.

విదూ—అదేమి? నీవు నాయెదురనే యున్నావే.

రాజు—ఎల్లవారుం దమవారిని మనోహరమయినవారినిగానే చూచుకొందురు. నేనన్ననో యీయాశ్రమమున కలంకారభూత యగునాశకుంతలంగూర్చి చెప్పుచున్నాను.

విదూ—(తనలో) కానీ! నేనీయనకు సందీయకుండెదను. (బిగ్గ

రగా) ఓమిత్రుఁడా! ఇప్పుడు తాపసకన్యను సహితము కామించుచున్నట్టు కనఁబడుచున్నావే?

రాజు—సఖా! పరిహార్యవస్తువుమీఁదికిఁ బౌరవుల మనస్సు పోదు.

విదూ—అట్లయిన నిది యేమి?

రాజు—

గీ. అప్సరస్స్త్రీకిజన్మించి యామెచేత
విడువఁబడి మౌనికిలభించె వెలఁది యీమె
చెట్టునను జాతి జిల్లేడుచెట్టుమీఁదఁ
బడిననవమాలికాప్రసవంబుపగిది.

విదూ—(నవ్వి) ఓమిత్రుఁడా! ముద్దఖర్జూరంబు రుచియింపనివానికిఁ జింతపండుమీఁద బుద్ధిపోయినట్లు, స్త్రీరత్నములఁ బాటింపని నీ కీ కోరిక పుట్టినది.

రాజు—ఆమెం జూచినవాఁడవు కావుగావున నీవిట్లు పలుకుచున్నావు.

విదూ—నీకును వింతఁబుట్టించుటం జేసి యామె సుందరియే కావచ్చును.

రాజు—వయస్యా! పెక్కులేల?

ఉ. చిత్తరువందువ్రాసి తగజీవముపోసి విధాత తాను లో
కోత్తరరూపబృందముల నుల్లమునం దలపోసి చేసెనో
యుత్తరుణీలలామనన నీడొడఁగూడక చెన్నుమీఱెడుఁ
దత్తనురామణీయకము ధాతసమర్థతయుం దలంపఁగన్.

విదూ—అట్లయినచో, ఇఁకఁ జక్కనిస్త్రీలకెల్లను పరాభవమే యగును.

రాజు—నామనసున కట్లే తోఁచుచున్నది.

ఉ. వాసనచూడనట్టి ప్రసవంబు, నఖంబులఁ ద్రుంపనట్టినూ
త్నాసమపల్లవంబుఁ, బరుతానని క్రొవ్విరితేనె, సూచి వి
న్యాసములేనిరత్నము, మహాతతపుణ్యఫలంబుఁ బోలు నా
భాసురగాత్రి సోయగ మెవండు భుజింప విరించి వ్రాసెనో !

విదూ.—అట్లయిన, గారనూనెచేఁ జిక్కనైన యొకయరణ్య వాసి యయిన తపస్వియొక్క చేతిలోఁ బడకమునుపే నీవామెను శీఘ్రముగా దక్కించుకొనుము.

రాజు.—పరాధీనురాలుగదా యామె? ఇప్పు డామెజనకులును దగ్గఱలేరు.

విదూ.—మఱి నీయం దామె కెట్టియనురాగముగలదు ?

రాజు.—తపస్వికన్యలు స్వభావముచేతఁ బ్రగల్భురాండ్రుకారు గదా ? అయినను—

గీ. ఏ నభిముఖుండఁగాఁ జూపు నిగిడ్చి త్రిప్పె,
నన్యకారణమున నవ్వినట్లు నవ్వెఁ,
గావున మరుండు శీలంబుకలిమి నడఁగి
స్పష్టమును గూఢమును గాక పరఁగియుండె.

విదూ.—ఏమి ? అట్లుగాక చూచినంతమాత్రమున నీతొడమీఁద వచ్చి కూర్చుండునా ?

రాజు.—సఖులతోఁగూడి వెళ్లునప్పుడు వినయవతియయ్యును మిక్కిలి నాయెడ భావమును గనఁబఱిచినది. అట్లేకాదా ?

గీ. చరణమునఁ గ్రుచ్చుకొనెఁ గుశాంకురమఁటంచుఁ
గొన్నియడుగులె నడచి యాకొమ్మ నిలిచె ;
తరువుశాఖల వస్త్రంబు తగులకున్నఁ
దీసికొనుదానివలె వెన్కఁదిరిగి చూచె.

విదూ.—ఇట్లు నీకు బత్తెంబు లభించునేని, యిఁక నీవీతపోవన మునే యుద్యానవనమునుగాఁ జేసికొందువని తలంచెదను.

రాజు—మిత్రుఁడా! ఇక్కడితపస్వులు కొందఱు నన్నానవాలు పట్టిరి. మన మొకసారి యేమిషచేత మరల నీయాశ్రమమును బ్రవేశింతమో యాలోచనచెప్పుము.

విదూ—మఱియొక యాలోచనయెందుకు? నీవురాజవుకావా?

రాజు—అయిననేమి?

విదూ—నీవారధాన్యములో నాఱవభాగము మాకు రావలెనని వెళ్లుదము.

రాజు—ఓయిమూర్ఖుఁడా! వీరలను పరిపాలించినందునకయి, రత్నరాసులనయినను విడిచిపెట్టి చేకొనందగిన మఱియొకభాగధేయము లభించుచున్నది. చూడుము—

గీ. ప్రజలవలన భూమిపతులకు లభియించు
ఫలము క్షయము చెందఁగలది యగును;
తాపసేంద్రు లిచ్చుతపములయాఱవ
భాగ మక్షయముగఁ బరఁగు మాకు.

(నేపథ్యమునందు) ఆహా! మేము కృతార్థులమయితిమి.

రాజు—(చెవియిచ్చి) ఓహోహో! ఇది ధీరప్రశాంతమగు స్వరము. తపస్వులు కాఁబోలును!

(దౌవారికుఁడు ప్రవేశించుచున్నాఁడు.)

దౌవా—దేవా! జయమగుఁగాక! ఇద్దఱుఋషికుమారులు వెలుపల నిలిచియున్నారు.

రాజు—అట్లయిన, వారి నాలస్యముచేయక లోపలికిం దోడ్కొనిరమ్ము.

దౌ—తీసికొనివచ్చెదను. (అని వెళ్లి ఋషికుమారులతోఁ బ్రవేశించుచున్నాఁడు.) ఇటు. ఇటు పూజ్యులారా! (ఇద్దఱును రాజువంకఁ జూచుచున్నారు.)

ప్రథ—ఆహా! ఈయనమూర్తి తేజోవంతమయ్యును విశ్వసనీయముగా నున్నది! ఋషులకంటె నతిభిన్నుఁడుకాని రాజనం దిట్లుండుట యుక్తమే. ఎట్లన్న—

చ. అరయఁగ సర్వభోగ్యమగు నాశ్రమమందితఁడుండు, నిత్యమున్
వరపరిపాలనంబునఁ దపఃఫల మార్జనపాలుగాంచు, నం
బరతలమంటు ఋష్యభిధ పావనరాజపదానుపూర్వమై
సరసతమిూఁదఁ బాడుపటుచారణగీతములందు మాటికిన్.

ద్వితీ—గౌతమా! ఈపార్థివుఁడు దేవేంద్రసఖుఁడయిన దుష్యంతుఁడా?

ప్రథ—మఱియేమి?

ద్వితీ—అట్లగుట చేతనేకదా?

చ. పురపరిఘాతిదీర్ఘభుజముల్ గల యీతఁడు శ్యామలాబ్ధి యా
వరణముగాఁగఁ గల్గుమహిభారము నొక్కఁడె పూనుట బ్రమే?
సురయువతుల్ సురాహితులకు క్షోభలుపుట్టినచో జయార్థమీ
వరధనధిజ్యకార్ముకము వాసవవజ్రముఁ గోరుచుండఁగన్.

ఇద్ద—(సమీపమునకువెళ్లి) రాజా! నీకు జయమగుఁగాక!

రాజు—(పీఠమునుండిలేచి) మీకు నమస్కరించుచున్నాను.

ఇద్ద—మీకు మేలగుఁగాక! (అని ఫలములు కానుకయిచ్చుచున్నారు.)

రాజు—(నమస్కారపూర్వకముగా స్వీకరించి) మీయాజ్ఞకయి వేచియున్నాను.

ఇద్ద—మీరిక్కడనుండుటయాశ్రమవాసులెఱిఁగి మిమ్మొక్కటి ప్రార్థించుచున్నారు.

రాజు—వారేమని యాజ్ఞాపించుచున్నారు?

ఇద్ద—పూజ్యులైన కణ్వమహర్షులు దగ్గఱలేనందున, రాక్షసులు యజ్ఞమునకు విఘ్నముచేయుదురు. కాఁబట్టికొన్ని రాత్రులు

మీరు సారధిద్వితీయులరై యాయుధపాణులై యుండి యీయాశ్రమ మును సనాధమునుగాఁ జేయువలయునని.

రాజు—నాకది యనుగ్రహమేకదా ?

విదూ—(రహస్యముగా) ఇప్పడీప్రార్థన యనుకూలమయినదే.

రాజు—రైవతకా ! ధనుర్బాణసహితముగా రథమ్మును గొని రమ్మని సారధితో నాపలుకులుగాఁ జెప్పుము.

దౌవా—దేవా ! జయమగుఁగాక ! దేవరయాజ్ఞాపించునట్ల చేసెద. (అని నిష్క్రమించుచున్నాఁడు.)

ఇద్ద—(హర్షముతో)

గీ. వినుము పూర్వులమార్గంబు ననుసరించు
నీకు నియ్యది యుక్తంబు నిక్కువముగ ;
నవని నాపన్నరక్షణయాగమందు
దీక్షితులు గారె పౌరవుల్ ? ధీవిశాల !

రాజు—మీరు ముందుగా నడువుండి. నేనును మీవెనుకనే వచ్చెదను.

ఇద్ద—రాజా ! నీకు విజయమగుఁగాక ! (అని నిష్క్రమించిరి.)

రాజు—మాఢవ్యా! నీకుశకుంతలాదర్శనకుతూహలముగలదా ?

విదూ—ప్రథమమున వెల్లువగాఁ బాఱుచుండెనుగాని, యిప్పు డీరాక్షసవృత్తాంతముచేత నొక్కబిందువయినను మిగులదయ్యెను.

రాజు—నాసమీపమున నుండువుగాని భయపడకు.

విదూ—ఎవ్వఁడునువచ్చి విఘ్నముచేయనిమొడల, నేను నీరథ మునకుఁ జక్రరక్షకుఁడ నయ్యెదను.

(దౌవారికుఁడు ప్రవేశించుచున్నాఁడు.)

దౌవా—స్వామీ ! జయమగుఁగాక ! రథము సిద్ధముగానుండి దేవరవారు విజయం చేయుటను గోరుచున్నది. మఱియు రాజధాని

నుండి యమ్మగారియాజ్ఞను. బట్టుకొని కరభకుఁడు వచ్చియున్నాఁడు.

రాజు—(ఆదరముతో) ఏమి ? అమ్మగారు పంపినారా ?

దౌవా—అవును.

రాజు—అట్లయినఁ దీసికొనిరా.

దౌవా—ఆలాగే. (అని నిష్క్రమించి కరభకునితోడఁ బ్రవేశించి)— అదిగో రాజుగారు. సన్నిధికిం బొమ్ము.

కర—(దగ్గరకువెళ్లి) స్వామీ ! శుభమగుఁగాక ! "నేఁటికి నాలవదినమునందు పారణమానివేసె యుపవాసము చేయఁబోవుచున్నానుగాన, ఆదినమున దీర్ఘాయుష్మంతుఁడవగునీవు దగ్గర నుండవలయు" నని యమ్మగారు తమకాజ్ఞయిచ్చియున్నారు.

రాజు—ఇక్కడఁదపస్వికార్యము; అక్కడగురుజనాజ్ఞ. రెండును దాఁటఁగూడనివే. ఇప్పుడేమి చేయుదును ?

విదూ—త్రిశంకునివలె నంతరాళమున నిలువుము.

రాజు—నీపరిహాసము చాలింపుము ; నిజముగా నాకేమియుం దోఁచకున్నది.

ఉ. రెండును రెండుచోట్ల నొనరింపఁగఁ దగ్గవియౌటఁ గృత్యముల్,
రెండువిధంబుల న్మదిచరించుచునున్నది నాకువిమ్యోడన్ ;
గొండనువచ్చికొట్టుకొని ఘూర్ణిలి వెన్కకుఁ బాఱునట్టియు
ద్దండనదీప్రవాహామువిధంబున నే నిపుడేమిసేయుదుఁ ?

(ఆలోచించి) సఖా ! అమ్మగారు నిన్నును గుమారునిగానే పరిగ్రహించి యున్నారు. కాఁబట్టి నీవిక్కడనుండి కదలి, తపస్వికార్యముయొక్క ప్రాముఖ్యమును నివేదించి, యమ్మగారికిం బుత్రకృత్యమును నిర్వహింపనర్హుఁడవు.

విదూ—నేను రాక్షసులకు భయపడితినని గణించెదవునుమీ.

రాజు—(చిఱునవ్వుతో) మహాబ్రాహ్మణుఁడవు. నీకుభయము గలదని యెట్లుసంభావింపవచ్చును ?

విదూ—అట్లయిన, రాజుగారితమ్ముఁ డేప్రకారముగా వెళ్లఁ దగునో నేనాప్రకారముగా వెళ్లెదను.

రాజు—తపోవనమునకు బాధకలుగకుండుటకయి నా వెంట వచ్చినవారి నందఱిని నీతోడం బంపెదను.

విదూ—అట్లయిన, నేనిప్పుడు యువరాజనయితిని.

రాజు—(మనసులో) ఈబ్రహ్మచారి చపలుఁడు. అంతఃపురములో నొకవేళ నాకోరిక తెలుపునేమో ! కానిమ్మాప్రకారముగాఁ జెప్పెదను. (అని విదూషకుని చేయిపట్టుకొని ప్రకాశముగా) మిత్రుఁడా ! మహర్షులయెడఁ గలగౌరవముచేతనె నేనాశ్రమమునకు వెళ్లుచున్నానుగాని నిజముగాఁ దాపసకన్య యగుశకుంతలయందు నా కభిలాష లేదుసుమా.

గీ. కనఁగ మనమేడ ? యజ్ఞాతకామయగుచు
సరిగ మృగశాబములతోడఁ బెరిఁగినట్టి
ముగుద యిదియేడ ? పరిహాసమునకు నేను
బలుకుమాటలు నిజమని తలఁపవలదు.

విదూ—ఆలాగే.

రాజు—వయస్యా ! నీవు నీకార్యమునం బ్రవర్తిల్లుము. నేనును దపోవనరక్షణార్థ మక్కడకు వెళ్లెదను.

(అందఱు నిష్క్రమించుచున్నారు.)

---

శ్రీ

అభిజ్ఞాన

# శాకుంతలనాటకము.

## తృతీయాంకము.

రంగము—తాపసాశ్రమము.

(దర్భలు చేతఁబట్టుకొని కణ్వశిష్యుఁడు ప్రవేశించుచున్నాఁడు.)

శిష్యు—(ఆలోచించి విస్మయముతో) ఆహా! దుష్యంతమహారాజు మహానుభావుఁడుగదా! పూజ్యుఁడైన యాతఁడాశ్రమపదమును బ్రవేశించిన మాత్రముననే మాకర్మానుష్ఠానములు నిరపాయముగాఁ జెల్లినవి.

గీ. భయదహుంకారమోయనఁ బరఁగువింటి
నారిశబ్దముచేతనె దూరమునను
విఘ్నములఁ బారదోలుచు వెలయునతఁడు,
బాణసంధానకథ యేల వలయునింక?

వేదికమీఁదఁ బఱచుటకయి యీదర్భలను ఋత్విక్కులనిమిత్తము నేనుదీసికొనిపోవలెను. (కొంచెమునడచిచూచి, ఆకాశమునందు) ప్రియంవదా! ఈయుశీరానులేపనమును మృణాళములతోఁ గూడిన పద్మపత్రములను నీవెవరినిమిత్తము కొనిపోవుచున్నావు? ఎండఁబఱుట చేత శకుంతల మిక్కిలి యస్వస్థయైయున్నదా? ఆమె శరీరసంతాపనివారణార్థమా! అట్లయిన శీఘ్రముగా చికిత్సచేయుము. ఆమె కులపతి యగు కణ్వునిరెండవప్రాణముగదా! నేనును వితానయాగముయొక్క శాంతిజలము నామెకొఱకు గౌతమిచేతి కిచ్చెదను. (అని నిష్క్రమించుచున్నాఁడు.) ఇది విష్కంభము.

(తరువాత మన్మథావస్థనటించుచు రాజు ప్రవేశించుచున్నాఁడు.)

రాజు—(నిట్టూర్పుపుచ్చి యాలోచించుచు)

గీ. ఎఱుఁగుఁ దపః ప్రభావ; మాయిందువదన
కడుఁబరాధీనురాలని యెడఁదనాకుఁ
దెలియు; నట్లయ్యు మనసు నాలలనమీఁది
నుండి మఱలించుకొనఁజాల కున్నవాఁడ.

(మదనబాధనిరూపించి) పూజ్యుఁడైన యోపుష్పాస్త్రుఁడా! నీవును జంద్రుఁడును విశ్వసనీయులుగాఁ గనఁబడుచు, కాముకజనులను మోసపుచ్చుచున్నారు. ఎట్లన—

ఉ. భూతలమందు నీదయినపుష్ప శరత్వము, నీరజారిదౌ
శీతకరత్వముం, మదన! చెడ్డ యసత్యములయ్యె మాయెడన్;
శీతకరుండు నిప్పులను జిమ్మఁగఁజొచ్చె హిమాంశుపాళిచే;
నీతఱి వజ్రసారముల నీవునొనర్చెదు పూవుటమ్ములన్.

ఓభగవానుఁడా! కామదేవా! నీకునాయెడఁ గనికరములేదా? (మదనబాధ నిరూపించి) పుష్పాయుధుఁడవైన నీకీతీక్ష్ణత్వ మెట్లుకలిగినది? ఆ! తెలిసినది.

గీ. వనధిలోపల బాడబవహ్నిఁబోలె
హరునికోపాగ్ని నీలోన నడఁగి యుండు;
నట్లు గాకున్న, బూడిదవైననీవు
వెచ్చ నగుటెట్లు మముబోటివిరహులకును?

అట్లుకాదు.

క. మరుఁడు సదా నాహృదయముఁ
గరమును బాధించుచున్నఁ, గామినికొరకే
శరము లడరించుఁ గావునఁ
బరమాప్తుఁడతండు నాకుఁ బరికింపంగన్.

భగవానుఁడవైన కందర్పుఁడా ! ఈ ప్రకారముగా నుపాలంభింపఁబడుచున్నను నీవు నన్నుఁగూర్చి పరితాపము కలుగకున్నది !

గీ. ఎపుడు సంకల్పశతముల నీవనంగ!
వడిగ నాచేతఁ బోషింపఁబడితి కానఁ
బూవి చాప మాకర్ణాంతముగనులాగి
బాణమోక్షంబు నాపైనె వలయుఁజేయ.

(ఖేదముతో కొంచెము నడచి) యజ్ఞకర్మ పరిసమాప్తినొంది నందున సదస్యులచే వీడుకొల్పఁబడిన నేను విరహపీడ నొందిన యీ డెందము నెట్లు వినోదింపఁజేయుదును ? (నిట్టూర్పువిడిచి) ఇప్పుడు ప్రియురాలిదర్శనమునకంటె నాకు శరణ్యమన్యమేదియులేదు. కాఁబట్టి యామెనే వెదకెదను. (సూర్యునివంకఁజూచి) ఈయుగ్రమైనయెండ వేళను లతావలయసంపన్నములైన మాలినీతీరములయందు శకుంతల ప్రాయికముగా చెలికత్తెలతోడ విహరింపఁబోవుచుండును. అక్కడకే వెళ్లెదను. (వెళ్లిచూచి) ఈబాలపాదపపఙ్క్తులనుబట్టి యాకోమ లాంగి యిప్పుడే వెళ్ళినదని యూహించెదను. ఎట్లన—

గీ. అవిగో ! నాయింతిచేతఁ గోయంగఁబడిన
పూల బంధనకోశముల్ మొగుడ వింక ;
చాలఁ గిసలయచ్ఛేదముల్ పాలుగారు
చిచటఁ గన్పట్టుచున్నవి మృదువుగాను.

(స్పర్శసుఖము నిరూపించి) ఆహా ! ఈ ప్రదేశము మహత్తర మయినగాలిచే మనోహరముగా నున్నది!

గీ. తోయజాతసువాసనతోడఁ గూడి
మాలినీతరంగజలకణాళిఁ దాల్చి
యనిల మిచట గాఢాలింగనార్హమయ్యెఁ
గామతప్త మదీయాంగకముల కిపుడు.

(నడచిచూచి) నిజముగా శకుంతల ప్రబ్బచెట్లచేఁ జుట్టఁబడిన యీలతామండపమునందు సన్నిహితురాలయి యున్నది. అట్లేకదా—

గీ. ఇదిగో ద్వారముకడఁ దెల్లయిసుకలోన
జఘనభారంబునను వెన్కఁ జాలలోఁతు
గాను ముందు ప్రక్కను నెత్తుగాను నున్న
క్రొత్తయడుగుజాడలు కనుంగొనఁగనయ్యె.

కాఁబట్టి చెట్లచాటుననుండి చూచెదను. (వెళ్లి, ఆప్రకారముగా చేసి సంతోషముతో) ఆహా! ఇప్పుడు నేత్రసాఫల్యము కలిగినది! నామనోరథప్రియతమురాలయిన యీమె కుసుమాస్తరణశిలాపట్టము నధిశయనించి సఖులచే సేవింపఁబడుచున్నది. కానిమ్ము. వీరియేకాంతపుమాటలను వినియెదను. (అని చూచుచు నిలుచున్నాఁడు.)

(అప్పుడుయథోక్తవ్యాపారయగుశకుంతలసఖులతోఁ ప్రవేశించుచున్నది.)

సఖులు—(విసరుచు సస్నేహముగా) సఖీ! శకుంతలా! నీకీ తామరాకులగాలి హాయిగానున్నదా?

శకుం—చెలులారా! ఏలవిసరెదరు?

సఖు—(విషాదమునునటించి యొకరినొకరు చూచుచున్నారు.)

రాజు—పూజ్యురాలయిన శకుంతల యెంతయు నస్వస్థచిత్తురాలుగాఁ గనఁబడుచున్నది. (ఆలోచనతో) అది యాతపదోషమో! మదనదోషమో! ఈరెంటిచేతనునని నాకుఁదోఁచుచున్నది. సందేహ మెందుకు?

చ. స్తనములయం దుశీరమును జాఱినయట్టిమృణాళహారమున్
బొనర లతాంగిమేను కడుఁబొల్పరియుండియు శోభ చెందెడుఁ;
దనరు నిదాఘమన్మథులతాఁకునఁ దాపముతుల్యమౌచు; నై
నను నిటుసోయగం బిడుగుణం బల గ్రీష్మమునందు లేదెటన్.

ప్రియం—(రహస్యముగా) అనసూయా! ఆరాజేంద్రుని యొక్క ప్రథమదర్శనము మొదలుకొని శకుంతల గాఢానురాగము

చేత వెతనొందుచున్నది. అతనినిమిత్తమునవే యీమెకీతాపము కలుగుచున్నదా యేమి ?

అన.—సఖీ ! నాకును మనసునం దీశంకయే కలుగుచున్నది. కానీ, ఇప్పుడీమెనడిగెదను. (ప్రకాశముగా) చెలియా ! నిన్నొక్కటి యడుగవలసియున్నది. నీకు సంతాప మధికముగా నున్నదిగదా ?

రాజు.—ఇప్పుడు చెప్పకతీరదు.

గీ. చంద్రకిరణంబులనుబోలె స్వచ్ఛమైన
యీమెనుమృణాళహారంబు లిపుడుకరము
నవిగొ నలుపెక్కి దుస్సహమైనయట్టి
గ్రీష్మమును దెల్పుచున్నవి కేవలమును.

శకుం.—(పూలపాన్పునుండి సగములేచి) సఖీ ! ఏమి తెలియఁగోరెదవు ?

అన.—సఖీ ! శకుంతలా ! కామవిషయమైన వృత్తాంతములకు నీకు మే మరమరలేని వారముగదా ? పురాణేతిహాసములయందు విరహుల విషయమయి విన్నయవస్థ యిప్పుడు నీయందు నాకుఁ గనఁబడుచున్నది. నీకీయాయాస మెందువలనఁ గలిగినదో చెప్పు. వికారకారణము యథార్థముగాఁ దెలియక ప్రతిక్రియ కారంభింప రాదుకదా ?

రాజు.—నాకుఁబుట్టినయూహయే యనసూయకును గలిగినది.

శకుం.—(తనలో) నాకాయాసము బలముగానున్నది. అయినను వీరికి వేగిరము తెలుపుటకు శక్తురాలను గాకున్నాను.

ప్రియం.— సఖీ ! ఈమె చెప్పినది బాగుగనున్నది. నీవ్యాధినేల యుపేక్షచేసెదవు ? నీవునానాఁటికి చిక్కుచున్నావు. లావణ్యసహితమయిన ఛాయయొక్కటియే నిన్ను విడువకున్నది.

రాజు.—ప్రియంవద సత్యమేపలికినది. అవును.

చ. మొగమునఁ జెక్కులెండెఁ; గుచములకఠినత్వము తూలెఁబొమ్ము౽నన్;
వగచెడిసోలె నెన్నడుము; వంగెనుమూఁపులు; మేనుపాండురం

బగుచుఁదనర్చె; నియ్యువతి యాంశులుశోషిలి గాలిసోఁకకే
తగిమెడుమాధవీలతవిధంబున, దర్పకతాపబాధచే
నగపడె శోచనీయయు బృహత్ప్రియదర్శన యాచు నెంతయున్.

శకుం—(లజ్జతో) సఖీ! మీకుఁ జెప్పక మఱియెవ్వరికిఁ జెప్పుదును? మఱియేల చెప్పవందురేని, ఇప్పుడుచెప్పిన మి మ్మొయాసపెట్టినదాన నగుదును.

సఖు—అందుచేతనే నిన్నింత నిర్బంధపెట్టుచున్నాము. దుఃఖమును చెలులు పంచుకొన్నప్పుడుగదా వేదన సహ్యముగానుండును?

రాజు—

చ. సమసుఖదుఃఖలై పరఁగుసారసనేత్రలు తన్ను వేఁడుటన్
సుముఖత హృద్గతార్తికథ సుందరి తెల్పక మానదింక; నే
త్రములటువిప్పి యాశమెయిఁ దత్సతి పల్మఱు నన్నుఁజూచినన్,
హిమకరసన్నిభాస్య యిపుడేమనునో విన భీతిపుట్టెడున్.

శకుం—(లజ్జతో) ఈతపోవనరక్షకుఁడయి వచ్చినరాజేంద్రుఁ డెప్పుడు నాదృష్టి పథమునఁబడెనో—(అని సగముచెప్పి లజ్జ నటించుచున్నది.)

సఖు—ప్రియసఖీ! చెప్పు చెప్పు.

శకుం—అప్పటినుండియు నాతనియందలి యభిలాష చేత నే నిటువంటియవస్థ పాలైనదానను.

రాజు—(హర్షముతో) చిరకాలమునకు వినఁదగినమాట వింటిని.

గీ. జంతువితతికి గ్రీష్మావసానమునను
జలధరశ్యామమగు దివసంబుఁబోలె,
నించువిలుకాఁడె నా తాపహేతువయ్యె
నతఁడు తాపనివారకుఁ డయ్యె నిపుడు.

శకుం___మీాకిది యనుమతమయ్యేనేని, ఆరాజేంద్రుఁడు నా యెడ దయచూచుమార్గము చూడుఁడు. లేకున్న నిఁక నాకు నీళ్లు విడువుఁడు.

రాజు___ఇది యాలోచించి చెప్పినమాటకాదు. కాముకుల కెప్పుడును వివేకముండదుగదా?

ప్రియం___(రహస్యముగా) అనసూయా! దీనికి కామ మతిదూరము వెళ్లినది. ఇఁకఁ గాలహరణమున కోర్వఁ జాలదు. ఈమెమనసునం దగిలినవాఁడు పూరువంశభూషణుఁడు. కాఁబట్టి యీామెయభిలాష కొనియాడఁదగినదే.

అన___(రహస్యముగా) చక్కఁగాఁ జెప్పినావు.

ప్రియం___సఖీ! మేలు! నీకుఁ దగినకోరిక కోరినావు! మహానది రత్నాకరమును విడిచి మఱియెక్కడ చేరును?

అన___ఎలమావితప్ప చిగిర్చిన మాధవీలతకుఁ దగినవృక్షము మఱియేదియున్నది.

రాజు___విశాఖ చంద్రకళ ననుసరించునేని, అందు చిత్రమేమున్నది?

అన___మనచెలియొక్క మనోరథమును శీఘ్రముగాను గూఢముగాను సమకూర్చుట కిపుడేమియుపాయము?

ప్రియం___శీఘ్రముగా చేయవచ్చునుగాని గూఢముగా చేయుటమాత్ర మాలోచనీయము.

అన___ఏల?

ప్రియం___ఓసీ! ఆరాజేంద్రుఁ డీమెయందు ప్రేమాస్పదములైన చూపులచే నభిలాషను గనఁబఱుచుచు నిన్నాళ్లును నిద్రలేకపోవుటచేతఁ గృశించినట్లు కనఁబడుచున్నాఁడు.

రాజు___(తన్నుఁ జూచుకొని) నిజముగా నేనట్టివాఁడనే యయినాఁడను. అవునుగదా?

చ. ఉరవగులోని తాపమున నుష్ణములై ప్రతిరాత్రియున్ భుజో
పరిఁ గనుక్రేవలం దొరుఁగుబాష్పములర్మ మణికాంతిమాయుబం
గరుకడియంబు జ్వాలతికకాయుల నించుకనిల్చి జాఱఁగా
మరి మనికట్టునుండి పలుమాఱును బైకెగఁద్రోయనయ్యెడున్.

ప్రియం—(ఆలోచించి) చెలీ! శకుంతల నాతని కొకమదనలేఖ వ్రాయనిమ్మి? దానిని పూవులలోఁ బెట్టి దేవతాప్రసాద మనుమిషచేత నాతనిచేతిలో నుంచెదను.

అన—అనాయాసకర మయినయీయుపాయము నాకెంతో యనుకూలముగా నున్నది. శకుంతల యేమనునో!

శకుం—మీయాజ్ఞ కన్యవిధముగాఁ జేయఁగలుగుదునా?

ప్రియం—అట్లయిన మృదుపదములతో నొకపద్యమును రచించుట కాలోచింపుము.

శకుం—చెలియా! ఆలోచించెదనుగాని, అతఁ డనాదరింపఁడే మోయని నాహృదయము కంపమొందుచున్నది.

రాజు—ఓసిపిఱికిదానా!

ఉ. ఎవ్వఁడు నిన్ననాదరణ మింక నొనర్చునొయంచు నెంచెదో,
జవ్వని! యాతఁడిప్డు సరస న్నినుఁగోరుచు నున్నవాఁడిటన్;
క్రొవ్వున నెవ్వఁడైన సిరిఁగోరిన వచ్చును రాకపోవుఁ; దా
నెవ్వని లక్ష్మి వేఁడు నతఁ డీకొనకుండునె యెన్నఁడేనియున్?

ప్రియం—ఓసీ! నీసౌందర్యము నవమానించుకొనుచున్నావు. శరీరతాపమును జల్లపఱిచెడు శరత్కాలపు వెన్నెల నెవ్వఁడు బట్టచాటుపెట్టుకొని వారింపఁజూచును?

శకుం—(చిఱునవ్వుతో) ఇప్పుడు మీయాజ్ఞకు బద్ధురాల నయ్యెదను. (అని కూరుచుండి యాలోచించుచున్నది.)

రాజు—ఇది మంచిసమయము. కన్నులఱెప్పవేయక యిప్పుడు ప్రియురాలిని జూచెదను. అదిగో,

గీ. పద్యము రచించుచున్నయాపద్మనయన
బొమలు పైకెత్తి చింతించు ముద్దుమొగము
పులకితము లైనయట్టి కపోలములను
దెలుపుచున్నది నామీఁదఁ గలుగువలపు.

శకుం—సఖీ! నేనొకగీతము నాలోచించితిని. వ్రాయుటకుఁ దగిన సాధనములు దాపున నేవియు లేవు.

ప్రియం—ఇదిగో చిలుకపొట్టవలె మృదువుగా నున్నయీ తామరాకుమీఁద గోళ్లతో నక్షరములను వ్రాయుము.

శకుం—(చెప్పినప్రకారముగాచేసి) చెలులారా! దీనియర్థము చక్కఁగా పొసఁగియున్నదో లేదో వినుండి.

సఖు—అవహితలమయి యున్నాము.

శకుం—(చదువుచున్నది.)

గీ. నీదుహృదయంబు లేశంబు నే నెఱుంగ;
కాయజుఁడు నిర్దయుండయి రేయుఁబగలు
నకట! నీపొందుకోరునాయంగకముల
నొకటఁ దపియింపఁజేయుచు నున్నవాఁడు.

రాజు—(చటుక్కున చెంతఁజేరి)

గీ. ఉవిద! మరుఁడు నిన్ దపియించుచున్నవాఁడు;
కాని, సరిగ నన్ దహియింపఁగానె చొచ్చె;
దివస మల్లశశాంకు బాధించునంత
తీక్ష్ణముగఁ గుముద్వతిని బాధించునెట్లు?

సఖులు—(చూచి హర్షముతో లేచి) అతిశీఘ్రలబ్ధమనోరథుఁడ వైననీకు స్వాగతము.

శకుం — (లేషఁబోవుచున్నది.)

రాజు — ఆయాస మక్కరలేదు.

గీ. విరులశయ్యను బొరలియు, వేగముగను
వాడుబిసఖండములతావితోడఁ దగియు,
ప్రభలపరితాపభరమునఁ గ్రాఁగునీదు
తనుతరాంగము లుపచారమునకుఁ దగవు.

అన — దేవరవా రిక్కడ శిలాతలమున దయచేయవలెను.

రాజు — (కూరుచున్నాఁడు.)

శకుం — (లజ్జకలదియై యున్నది.)

ప్రియం — మీాయిరువురకుం గలయన్యోన్యానురాగము ప్రత్యక్షమే. అయినను సఖీస్నేహము నన్నుఁ జెప్పినదానినే మరలఁ జెప్పునట్లు పురికొల్పుచున్నది.

రాజు — కళ్యాణీ! దాఁచవలదు. చెప్పనిష్టము గలదానిని జెప్పకుండుట పరితాపమును పుట్టించును.

ప్రియం — రాజు తనదేశములోని యాపన్నులయినవారి దుఃఖోపశమనము చేయవలయును. ఇది మీాధర్మముకదా!

రాజు — అంతకంటె నుత్కృష్టధర్మములేదు.

ప్రియం — అట్లయిన మా ప్రియసఖి నిన్నుగురించి కామదేవునిచే నిటువంటియవస్థ పొందింపఁబడినది. కాఁబట్టి యనుగ్రహించి దీని బ్రతుకు నిలుపఁదగును.

రాజు — ఓశుభాంగీ! ఈ ప్రార్థన మాయిరువురకును సామాన్యము. సర్వవిధముల నాకిది యనుగ్రహము.

శకుం — (ప్రియంవదనుజూచి) చెలీ! అంతఃపురవధూవిరహముచేత సంతాపించుచున్న రాజశ్రేష్ఠుని నీవేలనిర్బంధించెదవు?

రాజు—

గీ. నాదుహృదయస్థురాలవై నాతి! నీవు
నను ననన్యపరాయణు నన్యగతిని
దలఁచితేనియు, స్మరబాణతతులఁ గొట్టఁ
బడియు నీవాక్యహతిఁ గొట్టఁబడుదు మరల.

అన—మిత్రుఁడా! రాజులుబహుకాంతాప్రియులని వినుచుందుము. కాఁబట్టి మాప్రియసఖిని బంధుజనులకు దుఃఖము కలుగకుండునట్లుగా నాదరింపుము.

రాజు—కళ్యాణీ! పెక్కుమాటలేల?

క. బహుకాంత లయిన మత్కుల
మహాప్రతిష్ఠాకరములు మఱిరెండె యగున్—
రహిని సముద్రరశనయగు
మహియును, మీనెచ్చెలియగు మహిళామణియున్.

సఖు—మేము సంతుష్టిపొందినారము.

ప్రియం—(దృష్టిసారించి) అనసూయా! ఇదిగో! ఈవంక దృష్టినిగిడించుచు వేడుకతో లేడిపిల్ల తల్లి నేలాగున వెదకుచున్నదో చూడు. దానిని తల్లితోఁగూర్తమురమ్మా. (అని యిద్దరును వెళ్ళఁ బోవుచున్నారు.)

శకుం—సఖులారా! నేనసహాయురాల నగుదును. మీలో నొకరు నాయొద్దనుండు.

సఖు—భూమికంతకు రక్షకుఁడయినవాఁడే నీచెంతసహాయుఁ డుగానున్నాఁడు.

(అని వెళ్లుచున్నారు.)

శకుం—హా! సఖు లెట్లు వెడలిపోయిరి!

రాజు——నీకు సంభ్రమెందుకు? ఈసేవకజనుఁడు నీసమీపము ననే యున్నవాఁడు.

ఉ. చల్లని వైశ్రమం బడఁపఁ జాలిన తామరపాకు వీవనల్
మెల్లనఁ గొంచు వీచుదునొ మిక్కిలి శీతలమైనవాయువుల్?
సల్లలితారుణాబ్జసదృశంబగు నీచరణద్వయంబు నో
పల్లవపాణి! నాతొడలపై నిడి హాయిగఁ బట్టువాఁడనో?

శకుం——మాననీయులైన వారియెడ నపరాధము చేయఁజాలను.

(అని లేచి వెళ్లఁబోవుచున్నది.)

రాజు——సుందరీ! ఇప్పు డెండ చల్లారలేదు. నీశరీరస్థితియు నీ లాగుననున్నది.

క. నలినీదళకల్పితమై
వెలయుకుచావరణమున్న విరిపానువు ని
మ్ముల విడిచి యెండలో నెట
కలఘుక్లిశాంగములతోడ నరిగెద వబలా?

(అని బలవంతముగా నామెను మరలుచుచున్నాఁడు.)

శకుం——పౌరవా! సౌశీల్యమును గాపాడుము. మన్మథపీడితురాలనైనను నేను స్వతంత్రురాలను గాను.

రాజు——బేలా! గురుజనులవలనిభయము విడువు. ధర్మవేత్తయుఁ బూజ్యుఁడునగు కులపతి యిందునకయి నీయందుఁ దప్పుపట్టఁడు. ఇంతియకాదు.

గీ. పడఁతి! రాజర్షి కన్యలు పలువురిలను
వలచి గాంధర్వవిధిచేత వలయువారిఁ
బరిణయంబయి తముఁగన్నవారిచేతఁ
బొగడఁబడిరని వినలేదె పూర్వమందు?

శకుం—ఆర్యా ! ఇప్పుడు నన్ను విడువుము. మరల సఖీజనులఁ గని యనుమతంబు వడసి వచ్చెద.

రాజు—అలాగుననే విడిచెదను.

శకుం—ఎప్పుడు ?

రాజు—

గీ. లలన ! యపరిక్షతముఁ గోమలంబు నైన
క్రొత్తపూఁదేనె భృంగంబు గ్రోలినట్లు
నీయనుగ్రహమునఁజేసి నేనొకింత
తవిలి నీయధరసుధను ద్రావుపిదప.

(అని యీామె ముఖము నెత్తఁబోవుచున్నాఁడు.)

శకుం—(నాట్యముచే మోము త్రిప్పుకొనుచున్నది.)

(తెరమఱుఁగున)

ఓచక్రవాకకాంతా ! నీసహచరుని వీడ్కొనుము. రాత్రి సమీపించుచున్నది.

శకుం—(ఆలకించి తొట్రుపాటుతో) ఓపౌరవా ! సందేహము లేదు. నాదేహస్థితిని దెలిసికొనుటకయి పూజ్యురాలయిన గౌతమి యిచ్చటికి వచ్చుచున్నది. ఆకొమ్మలచాటున దాఁగియుండుము.

రాజు—అలాగుననే. (అని దాఁగుకొనుచున్నాఁడు.)

[అంత చేత పాత్రమునుబట్టుకొని గౌతమియు సఖులును ప్రవేశించుచున్నారు.]

సఖు—అమ్మా ! గౌతమీా ! ఈలాగు. ఈలాగు.

గౌత—(శకుంతలవద్దకువచ్చి) బిడ్డా ! తాఁక నొందిననీదేహము చులుకగా నున్నదా ?

శకుం—అమ్మా ! తాఁక నాకిప్పుడు విశేషముగానున్నది.

గౌత — మంత్రించిన యీాదర్భోదకముచేత నీశరీరము స్వస్థపడును. (అని శకుంతల శిరస్సుమీాఁదచల్లి) ఓబిడ్డా! ప్రొద్దువాలుచున్నది. పర్ణశాలకు వెళ్లుదము రమ్ము. (అనిలేచుచున్నారు.)

శకుం — (మనసులో) హృదయమా! మొదటనే యనాయాసముగా సంప్రాప్తమయిన మనోరథమునందును పిఱికితనమును విడువవైతివి. ఇప్పుడుమించెనని పశ్చాత్తాపపడుచున్న నీకు సంతాపమెట్లుపోవును? (మఱియొక యడుగు నడచి ప్రకాశముగా) సంతాపమును బోఁగొట్టెడి యోాతీవెగుంపా! మరలివచ్చి నిన్ననుభవించుటకు సెలవువేఁడెదను.

(అని దుఃఖముతో చెలులతోఁ గూడ నిష్క్రమించినది.)

రాజు — (పూర్వస్థానమునకువచ్చి నిట్టూర్పువిడిచి) ఆహా! అభీప్సితకార్యసిద్ధికి విఘ్నములెన్నియైనను దటస్థించునుగదా!

గీ. మాటి కధరంబు వ్రేళ్లతో మాటికొనుచు
నడ్డగింపుమాటలను విహ్వలతఁజూపి
మూఁపువంకఁ ద్రిప్పినకల్కిముద్దుమోము
లేవనెత్తియు ముద్దిడలేకపోతి!

నేనిప్పు డెక్కడకుఁబోవుదును? ప్రియురా లనుభవించి విడిచిన లతావలయములుఁగల యిక్కడనే ముహూర్తమాత్ర ముండెదను.

(అంతటనుజూచి)

మ. ఇది యాకన్నియ మున్ బరున్నశిలపైనింపొందుపూశయ్య; యి
య్యది గోటన్నళినీదళంబుపయి వ్రాయంగన్నసల్లేఖ; య
ల్లదిహస్తంబుననుండి జాఱినబిసాలంకార; మీాక్షించియున్
గదలంజాలను శూన్యవేతసలతాగారంబునంనుండియున్.

[తెరముఱుఁగును]

ఓరాజా!

శా. సాయంకాలమునందుఁ జేయఁదగుభాస్వద్యజ్ఞకర్మోత్కరం
బాయారీతుల సాగుచుండఁగను సంధ్యామేఘచిత్రంబులై
యాయగ్నిప్రభనొప్పు వేదికడ నత్యంతోగ్రరాత్రించర
చ్ఛాయల్ పెక్కు బహుప్రకారముల సంచారంబుగావించెడున్.

రాజు—ఇదె ఇదె వచ్చుచున్నాఁడను.

(అందఱు నిష్క్రమించిరి.)

ఇది తృతీయాంకము.

శ్రీ

అభిజ్ఞాన

# శాకుంతలనాటకము.

## చతుర్థాంకము.

రంగము—ఋషివనము.

(అప్పుడు పూలుకోయుట నభినయించుచు అనసూయయు, ప్రియంవదయు ప్రవేశించుచున్నారు.)

అన—ఓసీ! ప్రియంవదా! మనశకుంతల గాంధర్వవివాహ విధిచేత తగినభర్తను బరిణయమయినదని నామనస్సునకు సంతోషముగానే యున్నదికాని యిది యొక్కటి యాలోచింపవలయును.

ప్రియం—ఏది?

అన—ఇప్పుడారాజేంద్రుఁడు యజ్ఞము పరిసమాప్తినొందించి ఋషులచేత వీడుకొల్పఁబడినవాఁడయి తనపురమును బ్రవేశించి యంతఃపురము చూచినతరువాత నిక్కడి వృత్తాంతమును తలపెట్టునో తలపెట్టఁడో!

ప్రియం—ఆవిషయమున దిగులొందకుము. అటువంటిరూపవిశేషము గుణాభావముగానుండదు. ఇఁక నేమంటివేని, ఇప్పుడీవృత్తాంతమును విని కణ్వమహాముని యేమిసెలవిచ్చునో తెలియదు.

అన—ఆయన యభిమత మెట్లుండునో నే నెఱుఁగుదును.

ప్రియం—ఎట్లు?

అన—మొదటినుండియు గుణవంతునకుఁ గన్య నీయవలయు ననియే యాయనసంకల్పము. అదిదైవమే సమకూర్చినప్పుడు వారనాయాసముగాఁ గృతార్థులగుదురు.

ప్రియం.—(పూలబుట్టను చూచి) చెలియా! ఈకోసినపూవులు దేవతాపూజకు చాలునుగదా?

అన.—మఱియు మనము ప్రియసఖియైన శకుంతలయొక్క సౌభాగ్యదేవతకుఁగూడ పూజచేయవలెను.

ప్రియం.—అవును. (అని మరల పూలుకోయుచున్నారు.)

(తెరమఱుఁగున)

ఓహో! ఇదిగో నేను వచ్చినాఁడను.

అన.—(ఆలకించి) సఖీ! అతిథిమాటలాగున నున్నది.

ప్రియం.—శకుంతల పర్ణశాలయొద్దనేయున్నది. (ఆలోచించి) కాని నేఁడామెమనసు మాత్రము మఱియొకచోట నున్నది.

అన.—అట్లయిన, పూవులింతేచాలును. వెళ్లుదమురమ్ము.

(అని యిద్దఱును నడిచిరి.)

(మరల తెరమఱుఁగున)

ఓసీ! అతిథిని బరాభవించితివి!

గీ. ఎవనినో తదేకచింతతో నెంచుకొనుచు,
నెదుటనున్నతపోధను నెఱుఁగవు నను;
మగుడఁ దెల్పిన నతఁడు నిన్ మఱచుఁగాక
మత్తుఁ డెద వెన్క పనిమాట మఱచునట్లు.

ప్రియం.—అయ్యో! అప్రియమే సంభవించినది! పరధ్యానముచేత శకుంతల పూజార్హులైనయెవ్వరియెడలనో యపరాధము చేసినది. (ముందువంకఁజూచి) అదిగో ముక్కునసే కోపముండుదుర్వాసమహర్షి. అతఁడీప్రకారముగా శపించి దుర్వారకోపముతో మహావేగముగాఁ బోవుచున్నాఁడు. అగ్ని లేక దహించుటకు మఱియెవ్వఁడు శక్తుఁడగును?

అన__ప్రియంవదా! నీవుపోయి పాదములమీఁదఁబడి యా తని మరలింపుము. ఇంతలో నే నర్ఘ్యోదకమును గొనివచ్చెదను.

ప్రియం__అలాగే. (అని నిష్క్రమించుచున్నది.)

అన__(ఒకయడుగునడచి తొట్రుపాటుతో) అయ్యో! తొం దరపడి నడుచుటచేత పుష్పపాత్రజాతి నాచేతిలోనుండి పడిపోయి నది! (అని పూవులను పోగుచేయుచున్నది.)

ప్రియం__(మరలవచ్చి) సఖీ! స్వభావకుటిలుఁడయిన యతఁ డెవ్వరిప్రార్థన నంగీకరించును? అయినను, అతని నెట్లో కొంతసద యునిగాఁ జేసివచ్చితిని.

అన__(చిఱునవ్వుతో) అతనియెడ నదియు గొప్పయే. చెప్పు.

ప్రియం__ఎంతప్రార్థించినను మరలకున్నప్పుడు నే నిట్లు విన్న వించితిని__"దేవా! ఇది ప్రథమ మగుట విచారించి మీతపఃప్రభావ మెఱుఁగని యీబిడ్డయెడఁ గలయీయొక్కయపరాధమును క్షమింపఁ దగును."

అన__తరువాత. తరువాత.

ప్రియం__తరువాత నతఁడు__"నావచన మన్యథాకాఁగూడ దు. అయినను, ఆనవాలుగానిచ్చిపోయినయాభరణమును జూపఁగానే శాపవిముక్తియగును."__ అని పలికి తనంత నంతర్హితుఁడయ్యెను.

అన__ఇప్పు డూఱడిలి యుండవచ్చును. ఆరాజేంద్రుఁడు తాను వెళ్లునప్పుడు స్మరణార్థ మగునని తనపేరుచెక్కినయుంగరమును స్వయముగానే శకుంతలచేతికిఁ బెట్టినవాఁడు. కాఁబట్టి తగినయుపాయ ము శకుంతలచేతిలోనే యున్నది. మనమిఁక దేవకార్యమును నిర్వర్తిం తము రమ్ము. (అని నడుచుచున్నారు.)

ప్రియం__(చూచి) అనసూయా! ముఖమెడమచేతిపై నుంచు కొని చిత్తరువుబొమ్మవలె మనప్రియసఖి యెట్లున్నదో చూడు. మగని

మీఁది చింతచేతఁ దన్నుఁదానే యెఱుఁగకున్నది. ఇఁక నతిథివిషయమునఁ జెప్పనేల ?

అన—ప్రియంవదా! ఈవృత్తాంతము మనయిద్దఱినోటనే యుండవలయునుజుమీ. స్వభావమృదులయైన ప్రియసఖిని రక్షింపవలయునుగదా ?

ప్రియం—నవమాలికను వేఁడినీళ్లతో నెవ్వఁడుతడుపును ?

(అని యిద్దఱును నిష్క్రమించిరి.)

ఇది విష్కంభము.

---

రంగము—ఋష్యాశ్రమప్రాంతము.

[అప్పుడు నిద్రనుండిలేచి కణ్వశిష్యుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

శిష్య—ప్రవాసమునుండి వచ్చినపూజ్యుఁడయిన కణ్వమహర్షి నన్ను వేళచూచి రమ్మని పంపెను. బయలవెళ్లి రాత్రి యెంత యవశిష్టమున్నదో చూచెదను. (అని కొంచెమునడచిచూచి) అయ్యో! తెల్లవాఱిపోయెను! అట్లేకదా ?

చ. ఒకదెస నస్తశైలమున నోషధినాథుఁడు పోవుచున్న వాఁ
డొకదెస భాస్కరుం డుదయమొందెద ననూరుపురస్సరంబుగా ;
నొక సమయంబునందె వ్యసనోదయముల్ గనె రెండు తేజముల్,
ప్రకటసుఖంబు దుఃఖమును బ్రాణులకిట్లని తెల్పుకై వడిన్.

మఱియును,

గీ. సోముఁ డంతర్హితుఁడు గాఁగ శోభ యెడలి
చూడనగు నల్ల కుముదిని సొబగుతూలి ;
వనితలకు వల్లభవియోగజనితమైన
దుఃఖములెకావె యత్యంత దుస్సహములు ?

అన—(ప్రవేశించి తెరమాటున) ఈవిధముగా విషయసుఖమెఱుఁగనిఋషులకును దెలిసియున్నప్పుడు, రాజు శకుంతలయెడఁ జేసినది గొప్పయన్యాయమే.

శిష్యు—ఇప్పుడు హోమవేళ యయినదని గురువులకు నివేదించెదను. (అని వెళ్లుచున్నాఁడు.)

అన—నాకిది తెలిసినను నే నేమిచేయఁగలను? నా కేపని చేయుటకును కాళ్లును జేతులు నాడకున్నవి. సత్యసంధుఁడు కాని యాతనియెడఁ దగులునట్లుచేసి మన చెలికత్తెను శూన్యహృదయను గాఁజేసెనుగనుక మన్మథుఁడిఁకఁ గృతార్థుఁడౌనుగాక! (ఆలోచించి) ఒకవేళ దుర్వాసునిశాపమే యతనికీమఱపును గలిగించుచున్నదేమో! అట్లుగాకున్న, ఆరాజేంద్రుఁ డటువంటిబాసలు చేసి యింతకాలము లేఖనైన నేల వ్రాయకుండును? కాఁబట్టి యీయుంగరము గుఱుతుగా నాతనికంపవలెను. ఎప్పుడును దుఃఖములపాలయ్యెడి యీతాపసజనము నెవ్వఁడు మన్నించును? ప్రవాసమునుండివచ్చిన తండ్రియైన కణ్వునకు శకుంతల దుష్యంతునిఁ బరిణయమై గర్భవతియైనసంగతిని నివేదించుట కుద్యుక్తురాల నయినను, నాసఖియెడఁ దప్పుపట్టు నేమో యని విన్నవింపఁ జాలకున్నాను. ఈవిధముగా మించినదానికి మన మేమి చేయఁగలము?

ప్రియం—(ప్రవేశించి హర్షముతో) సఖీ! శకుంతలయొక్క ప్రయాణోత్సవమును నడుపుటకయి త్వరగారమ్మా.

అన—సఖీ! అదియెట్లు?

ప్రియం—విను. నేనింతకమునుపు సుఖముగా నిద్రపట్టినదేమో యడుగుటకు శకుంతలయొద్దకు వెళ్లితిని.

అన—తరువాత. తరువాత.

ప్రియం—అప్పుడు సిగ్గుచేతఁ దలవంచుకొనియున్న యామెను

గాఁగిలించుకొని కణ్వుఁడే స్వయముగా నిట్లుశ్లాఘించెను. "కన్నులఁ బొగ క్రమ్ముకొనియున్నను భాగ్యవశము చేత సోమయాజిచేతియాహుతి యగ్నిహోత్రములోనే పడినది. బిడ్డా! మంచిశిష్యునకిచ్చినవిద్య వలెనే నీవును నాకు సంతోషహేతువవైతివి. ఇప్పుడే ఋషులను దోడిచ్చి నిన్ను నీభర్తసన్నిధికిఁ బంపెదను."

అన—తండ్రియైన కాశ్యపునకీవృత్తాంత మెవ్వరుచెప్పిరి?

ప్రియం—అగ్నిహోత్రగృహమునఁ బ్రవేశించినప్పు డాతనికి ఛందోబద్ధమయిన యొకయశరీరవాక్కు చెప్పినది.

అన—(విస్మయముతో) అదియేదో చెప్పు.

ప్రియం—(దేవభాషతో)

గీ. దహనమును జమ్మికొమ్మలోఁ దాల్చినట్లు,
భూతలసమృద్ధికొఱకు నీపుత్రికయును
దనకడుపున దుష్యంతదత్త తేజ
మును ధరించియున్నదినమ్ము, భూసురేంద్ర!

అన—(ప్రియంవదను కౌఁగిలించుకొని) సఖీ! నాకు సంతోషముగా నున్నది. బహుసంతోషముగా నున్నది. కాని యిప్పుడే శకుంతల యత్తింటికిఁ బంపఁబడుచున్నదనుటచే నాసంతోషము కొంత చింతతోఁ గూడినదైనది.

ప్రియం—సఖీ! మనచింత కేమి? ఆమెను వినోదింపఁజేయుదము. అందువలన మనశకుంతల సుఖపడనీ.

అన—చెలీ! అట్లయిన, నే నీమామిడికొమ్మం దగిలించిన కొబ్బరియాకులబుట్టలోఁ జిరకాలమునుండి యామెనిమిత్తమే దాఁచియుంచిన పొగడపూలదండను నీవు పట్టుకొనిరమ్ము. నేనింతలో నామెకు గోరోజనముతోను, తీర్థమృత్తికతోను, జెఱుకుచిగుళ్లతోను మంగళార్థమయి మైపూఁతను జేసెదను.

ప్రియం—అలాగే చేయుము. (అనసూయ వెళ్లఁగా, ప్రియంవద పూలదండను గైకొనుచున్నది.)

[తెరచాటున]

గౌతమీ ! శార్ఙ్గరవశారద్వతులను శకుంతలను దీసికొనిపోవుటకై నియమింపుము.

ప్రియం—అనసూయా ! వేగిరముర మ్మా. ఇదిగో హాస్తినాపురమునకు వెళ్లెడుఋషులు సందడించుచున్నారు.

అన—(ప్రవేశించి చేయిపట్టుకొని) సఖీ ! పోదముర మ్మా. (అని నడుచుచున్నారు.)

ప్రియం—(చూచి) ఇదిగో సూర్యోదయవేళకే తలయంటుకొని, నీవారాక్షతములను జేతఁబట్టుకొని యాశీర్వదించెడి ఋషిభార్యలచే శ్లాఘింపఁబడుచు, శకుంతల యిక్కడనే యున్నది. ఈమెయొద్దకు వెళ్లుదము. (అని సమీపమునకు వెళ్లుచున్నారు.)

[అప్పుడు పయిని చెప్పిన పరివారముతో శకుంతల ప్రవేశించుచున్నది.]

మొదటిఋషిపత్ని—(శకుంతలతో) బిడ్డా ! భర్తయొక్క బహుమానసూచకముగా "పట్టపుదేవి" నామమును పొందుమా.

రెండవది—బిడ్డా ! వీరమాతవుగ మ్మా.

మూడవది—చిన్నదానా ! మగనిమన్ననను బొందుము.

(అని దీవించి గౌతమితప్ప తక్కినవారు నిష్క్రమించిరి.)

సఖులు—(దగ్గరగా వెళ్లి) సఖీ ! మంగళస్నానము చేసితివా ?

శకుం—నా సఖులారా ! రండి. ఇక్కడఁ గూర్చుండుఁడు.

సఖు—(మంగళపాత్రమును బుచ్చుకొని కూరుచుండి) సఖీ ! సరిగా నుండుము. మేము నీకు మంగళప్రదమయిన యలంకారమును జేసెదము.

శకుం.—ఇది నాకు మిక్కిలి యాదరణీయము. ఇఁకనాకు సఖుల చేతియలంకారము దుర్లభముగదా ? (అని కన్నీరు విడుచుచున్నది.)

సఖు.—సఖీ ! ఇట్లు శుభసమయమునం దేడుచుట నీకుఁ దగదు. (అని కన్నీరుతుడుచుచు నలంకరించుచున్నారు.)

ప్రియం.—అయ్యో ! ఆభరణార్హమయిన నీరూపమున కాశ్రమమున లభించెడి యీయలంకారములు వికారములుగానున్నవి.

ఋషికుమారులు.—(కానుకలు పట్టుకొని ప్రవేశించి) ఇవిగో నగలు. ఈమెకలంకరింపవలయును. (అందఱును చూచి యాశ్చర్యపడుచున్నారు.)

గౌత.—వత్సా ! హారీతా ! ఇవియెక్కడివి ?

ప్రథముఁడు.—గురువులయిన కణ్వుని ప్రభావమువలనఁ గలిగినవి.

గౌత.—ఏమి ? ఆయన మనసంకల్పమువలనఁ గలిగినవా ?

ద్వితీయుఁడు.—కాదు వినుము. శకుంతలనిమిత్తమయి వనస్పతులనుండి పుష్పములు తెండని పూజ్యుఁడైనకణ్వమహర్షి మాకాజ్ఞ యిచ్చెను. అందువలన నిప్పుడు—

చ. తరువొకటిచ్చెఁ జంద్రవిశదంబగు మేలిమిపట్టువస్త్రమున్,
జరణ మలంకరింప నిడెఁ జక్కనిలత్తుక నొక్కవృక్ష, మా
భరణము లిచ్చెఁ గొన్ని, మణిబంధముదాఁకను బైకినెత్తి త
త్తరులచిగుళ్లనవ్వవనదైవతపాణి పయోరుహంబులన్.

ప్రియం.—(శకుంతలను జూచి) చెలియా ! ఈవనదేవతాప్రసాదము నీవు భర్తృగృహమునం దనుభవింపఁదగిన రాజ్యలక్ష్మికి సూచకముగా నున్నది.

శకుం.—(లజ్జ నభినయించుచున్నది.)

ప్రథముఁడు.—గౌతమా ! రమ్ము రమ్ము. స్నానముచేసివచ్చిన కణ్వమహర్షికి వనస్పతులసేవను నివేదింతము.

ద్వితీయుఁడు—అలాగుననే. (అని యిద్దఱును నిష్క్రమించుచున్నారు.)

ప్రియం—సఖీ ! మేమెప్పుడును భూషణముల నుపయోగించి నవారముకాము. అయినను చిత్తరువును వ్రాయనేర్చి యుండుటచేత నీయంగముల కాభరణముల నలంకరించుచున్నాము.

శకుం—మీనేర్పు నేనెఱుఁగుదును. (అప్పు డిద్దరును నగలు పెట్టుచున్నారు.)

(అప్పుడు స్నానముచేసివచ్చి కణ్వుఁడు ప్రవేశించుచున్నాఁడు.)

కణ్వ—

ఉ. కొండలమంద డెందము శకుంతల తానిపుడేగునం చయో !
క్రందుగ బాష్పరోధమున కంఠమునుం జెడె; దృష్టి మాంద్యముం
బొందె; నొకింత పెంచిన తపోధనులే యిటుకుంద, నెంతగాఁ
గుందుదురో తమంతఁగనుకూఁతులఁ బాయుగృహస్థు లక్కటా !

(అని తిరుగుచున్నాఁడు.)

సఖు—సఖీ ! శకుంతలా ! నీకిప్పు డలంకార మయినది. ఇఁక నీ పీ వెలిపట్టుచీరను గట్టుకొమ్ము.

శకుం—(లేచి కట్టుకొనుచున్నది.)

గౌత—బిడ్డా ! ఇదిగో నీతండ్రి యానందరసము వెల్లిగొలుపు కన్నులతోఁ గౌఁగిలించుకొనువానివలె వచ్చుచున్నాఁడు. ఇప్పుడు గౌరవరంబు నడుపుము.

శకుం—(సిగ్గుతో) అయ్యా ! నమస్కరించుచున్నాను.

కణ్వుఁడు—కుమారీ !

క. అల శర్మిష్ఠ యయాతికి
వలెఁ బ్రేమాస్పదవుగమ్ము వరునకు నీవున్;

జెలువరో! యయాతి పూరుని
పొలుపున, సామ్రాజ్యమేలు పుత్రునిఁగనుమా.

గౌత—దేవా! ఆశీర్వచనములు కావు. ఈ రెండును బిడ్డకువరములే.

కణ్వ—కుమారీ! ఇక్కడ నిప్పుడే హోమముచేసిన యీ యగ్నిహోత్రునకుం బ్రదక్షిణంబు చేయుము.

శకుం—(అట్లుచేయుచున్నది.)

కణ్వ—(ఋక్ఛందస్సుచేత నాశీర్వదించుచున్నాఁడు.)

గీ. వేదియంతట సమిధలు వెలుఁగుచుండఁ,
బ్రక్కలను దర్భనిచయంబు పఱుపఁబడుచు,
హవ్యగంధంబునఁ గలుషమడఁచునట్టి
సిద్ధయాగాగ్ని నిను శుద్ధఁ జేయుఁగాత!

ఇప్పుడు బయలుదేరుము. (దృష్టినిగిడించి) ఏరీ యాశార్ఙ్గరవ శారద్వతులు?

శిష్యులు—(ప్రవేశించి) దేవా! ఇదిగోవచ్చినారము.

కణ్వ—శార్ఙ్గరవా! నీచెల్లెలికి దారిచూపుము.

శార్ఙ్గ—అమ్మా! ఈలాగు. ఈలాగు. (అని యందఱును నడుచుచున్నారు.)

కణ్వ—సన్నిహితములయియున్న యోతపోవనవృక్షములారా!

చ. ఎవతె జలంబు మీకిడక యెన్నఁడుఁద్రాగదు తానుముందుగా
నెవరితె ప్రేమచేఁ జిదుమ దీప్సితభూషణమయ్యు మీచిగు
ళ్లెవతెకు మీరుతొల్త ననలెత్తుట పండువుగాఁగనుండు నా
ప్రవిమలగాత్రి యేగుఁ బతిపజ్జకు నంద అనుజ్ఞ యీయరే.

(కోకిలకూఁతవిని)

గీ. ఈవిధంబునఁ బికమృదురావమునను
బ్రతివచనమిచ్చెఁగావున, వననివాస

బంధువర్గములయియున్న వసుమతీరు
హారబులు శకుంతల ప్రయాణ మనుమతించె.
(ఆకాశమునందు.)

గీ. ఎడనెడను దమ్మికొలఁకుల నింపుమీఱి,
తరులనీడలచే నెండతగులకుండి,
యంబుజపరాగమున మెత్తనగుచు, సతికిఁ
బథము శుభమిచ్చు ననుకూలవాయువులను.

(అందఱును విస్మయముతో నాలకించుచున్నారు.)

గౌత—బిడ్డా! బంధువులయెడ స్నేహముగల యీవనదేవతలు వెళ్లుటకు నీకనుజ్ఞ యిచ్చినవి. యీదేవతలకు మ్రొక్కుము.

శకుం—(నమస్కారపూర్వకముగా నడచి రహస్యముగా) సఖీ! ప్రియంవదా! భర్తనుదర్శించుటకయి వేడ్కగలిగియున్నను, ఆశ్రమమును విడువవలె ననుదుఃఖముచేత నాపాదములు ముందుకు సాగకున్నవి.

ప్రియం—తపోవనమును విడువలేక సంచలించుచున్నది. నీవొక్కతెవేకావు. నీచేత విడువఁబడనున్న యీతపోవనముయొక్కయవస్థనుజూడు.

గీ. మృగతతులు దర్భకబళంబు మ్రింగకుండె;
నెమిలిగుంపులు తమవర్తనములు మానె;
పండుటాకులరాల్చుచు భవ్యలతలు
బాష్పకణములు విడిచెడుపగిది నుండె.

శకుం—(స్మరణకు దెచ్చుకొని) తండ్రీ! నాసహోదరియగు మాధవీలతనిప్పుడు సెలవడిగివచ్చెదను.

కణ్వ—బిడ్డా! నీకు దానియెడఁ గల సోదరీస్నేహము నేనెఱుగుదును. అది యిదిగో దక్షిణమున నున్నది.

శకుం.—(లతనుజేరి కౌఁగిలించుకొని) లతాసహోదరీ ! నీవు క్రొమ్మావితోఁగూడియున్నను, ఇచ్చట నీశాఖాభుజంబులచేత నన్నాలింగనము చేసికొమ్ము. ఇది మొదలుకొని నేను నీకు దూరస్థురాల నగుదును—ఓతండ్రీ ! దీనిని నాకుమాఱుగాఁజూచుకొమ్ము.

కణ్వ.—శకుంతలా !

గీ. తొలుత నీనిమిత్తము నేను దలఁచినట్లు
పుణ్యమున నీకుఁ దగుభర్తఁ బొందితీవు ;
మావిఁజేపట్టె నెలమి నీమాధవియును ;
గాన మీకయి యిఁకఁ జింత మానియుందు.

ఇఁక దారిని నడువుము.

శకుం.—ఇదిగో నాలతాపుత్రికయైన, వనజ్యోత్స్నతోఁగూడఁ జెప్పివచ్చెదను. (లతనుడాసి ముద్దుపెట్టుకొని) ఓబిడ్డా ! ఇన్నాళ్లు పెంచి నిన్ను దిగవిడిచి పోవుచున్నాననివాడిపోకు. మాతండ్రిగారు నిన్ను నామాఱుగాఁ జూచుకొందురు. నన్నుఁబంపుము. (చెలికత్తెలతో) చెలులారా ! దీనిని మీయిద్దఱికి నప్పగించెదను.

సఖు.—మాయిద్దఱినెవ్వరికొప్పగించిపోయెదవు ? (అని కన్నీరు విడుచుచున్నారు.)

కణ్వ.—అనసూయా ! ఏడువవలదు. మీరేకదా శకుంతలకు ధైర్యము చెప్పవలసినవారు ! (అందఱును నడచుచున్నారు.)

శకుం.—నాయనా ! ఇదిగో పర్ణశాలసమీపమునఁదిరుగుచుఁ గడుపుతోనుండుటచేత మెల్లఁగా నడుచుచున్నయీలేడి యెప్పుడు సుఖప్రసవ మగునో యప్పుడే యాశుభవార్తం దెలుపుటకయి యెవ్వరినైనం బంపుము.

కణ్వ.—నేనిది మఱచిపోను.

శకుం—(గమనప్రతిబంధమునటించి) ఎవరిది ? నాచీర పట్టుకొనినిలుపుచున్నారు ! (అని వెనుకకు తిరుగుచున్నది.)

కణ్వ—బిడ్డా !

గీ. కటకుకుశ గ్రుచ్చుకొని నోరు గాయమైనఁ,
బూయుచును గారనూనెను, బుండుమాన్పి,
ప్రేమచేఁ జామలనుమేపి, బిడ్డవలెను
బెంచుటను దాఁటఁబోయు దీపిల్లలేడి.

శకుం—బిడ్డా ! సహవాసులఁ బరిత్యజించి యేగెడునన్నేల వెంబడించెదవు ? పుట్టినతోడనే తల్లిచే విడువఁబడియుఁ బెరిఁగితివి. ఇప్పుడును నాచే విడువఁబడిననిన్ను మానాయనగారే విచారింతురు. ఇఁక వెనుకకు మరలుము. (అని యేడ్చుచు నడుచుచున్నది.)

కణ్వ—బిడ్డా ! కన్నులుతుడుచుకొని తిన్నఁగా దారిచూచి నడువుము.

గీ. తెప్పలెత్తినకన్నులఁ గప్పి, దృష్టి
జాడ్య మిడుబాష్పముల నిల్పుస్థైర్యమునను ;
దారిచూడక నడువఁ, బదద్వయంబు
జాఱు నీహెచ్చుతగ్గుసరణియందు.

శార్ఙ—దేవా ! బంధుజను లుదక ప్రదేశమువరకే కూడ రాఁదగినవారనిశాస్త్రము. ఇదిగో సరస్తీరము. ఇక్కడమాతోఁ జెప్పవలయుదానినిజెప్పి మీరు వెనుక మరలఁ దగును.

కణ్వ—అట్లయిన మనమీపాలచెట్టు నీడను నిలుతము.

(అందఱును నడచి నిలుచున్నారు.)

కణ్వ—(తనలో) పూజ్యుఁడయిన దుష్యంతునకు మేమిప్పుడేమని సందేశముపంపిన యుక్తముగా నుండును ? (అని యాలోచించుచున్నాఁడు.)

శకుం—(రహస్యముగా) సఖీ! చూడు. తామరాకుచాటున దాఁగిన ప్రియవల్లభునిగానక యాతురయై చక్రవాకాంగన కూయుచున్నది. ఇందుచే ముందుకార్యము దుష్కరమనుకొనియెదను.

అన—సఖీ! ఇట్లుతలంపకుము.

గీ. ధవునిఁబాసియు నిది విషాదంబుచేతఁ
గరము దీర్ఘమౌరాత్రిని గడపుచుండు;
విరహదుఃఖ మత్యంతదుర్భరమెయైన,
నోర్వఁజేయు నాశాబంధ మొనర దాని.

కణ్వ—శార్ఙ్గరవా! మీరు శకుంతలను ముందుంచుకొని రాజుతో నావచనములుగా నిట్లనవలయును.

శార్ఙ—దేవర యానతీయవలయును.

కణ్వ—ఉ. మమ్ములసత్తపోధనుల, మాన్యభవత్కులమున్, స్వబంధులన్
సమ్మతివేఁడ కీమె యెటొ సల్పినప్రీపయికూర్మి, నెంచి మా
కొమ్మనునేలుకొమ్మ సరికొమ్మలతో సమగౌరవంబునన్;
బిమ్మటిదెల్ల భాగ్యమగుఁ; బేర్కొనరాదది యింతిబంధువుల్.

కణ్వ—బాలా! నీకునుమేమిప్పుడు బుద్ధులు చెప్పవలయును. మేమువనవాసులమయ్యును లౌకికజ్ఞానము కలవారమేసుమీ.

శార్ఙ—ధీమంతులకుఁ దెలియనివిషయ మేదియుండును?

కణ్వ—పుత్రీ! నీవిక్కడనుండి పతిగృహమును ప్రవేశించి—

చ. గురులకు సేవఁజేయు మనుఁగుంగతిఁజూడుము నీసపత్నులన్
వరుఁడలుకన్వహించినను భర్తృవిరుద్ధవుగాకు మీసునన్;
పరిజనులందుఁజూపుము కృపం గడుఁ; బొందకు భాగ్యగర్వమున్;
తిరిగిన నిట్లు, కాంతురు సతీత్వము కాంతలు; నింద్యలొందుచోన్.

గౌతమి యిదియేవిధముగా నెంచునో!

గౌత—వధూజనుల కుపదేశింపవలసినదింతే. బిడ్డా! ఇదియంతయు మనమున నాటించుకొమ్ము.

కణ్వ—బిడ్డా! నన్నును నీసఖిజనమును కౌఁగిలించికొమ్ము.

శకుం—అయ్యా! ఏమి! ప్రియంవదయు ననసూయయుఁ గూడ నిక్కడనుండియే మరలెదరా?

కణ్వ—బిడ్డా! వీరు నొకరికియ్యఁదగినవారే కాఁబట్టి వీరు నీతోఁ గూడ రాఁగూడదు. నీతోఁ గూడ గౌతమివచ్చును.

శకుం—(తండ్రిని కౌఁగిలించుకొని) మలయపర్వతమునుండి పెల్లగింపఁబడిన చందనలతవలెనే యిప్పుడు తండ్రియుత్సంగమును విడిచి యన్యదేశమునందు నేనెట్లు ప్రాణములు నిలుపఁగలను?

(అని యేడ్చుచున్నది.)

కణ్వ—బిడ్డా! ఏమి యిట్లుభయపడుచున్నావు?

చ. గరిమ మహాకులీనుఁడగు కాంతునిపట్టపుదేవి వౌచు. దు
ర్భరఘనకార్యవైభవము పైఁబడియుండి ప్రతిక్షణంబు, భా
స్కరు నలపూర్వదిక్కువలెఁ గాంచి పవిత్రునిఁ బుత్రు వేగ, మ
ద్విరహాభవాతిదుఃఖమును బిడ్డ గణింపవు నీవు లేశమున్.

శకుం—(తండ్రిపాదములకు మ్రొక్కుచున్నది.)

కణ్వ—వాంఛితార్థసిద్ధి యగుఁగాక!

శకుం—(సఖులవంక తిరిగి) చెలులారా! మీరిద్దరును నన్నొక్కసారి కౌఁగిలించుకొనుఁడు.

సఖు—(అట్లుచేసి) చెలీ! ఆరాజొకవేళ నిన్ను గురుతుపట్టలేక పోయినపక్షమున, నీవప్పు డతని కాతని పేరుచెక్కిన యీయుంగరమును గనఁబఱుపుము.

శకుం—మీయీసందేహముచేత నాదేహము కలవరమొందుచున్నది.

సఖు—చెలీ ! భయపడకు. అతిస్నేహ మెప్పుడును గీడును శంకించుచుండును.

శార్ఙ—అమ్మా ! ఎండఎక్కుచున్నది. నీవు త్వరపడవలెను.

శకుం—(ఆశ్రమమువంకకు తిరిగి నిలుచుండి) నాయనా ! నేను తిరిగి యెప్పుడీతపోవనమును జూతునోకదా ?

కణ్వు—బిడ్డా వినుము.

గీ. సకలమహికిని జిరముగ సవతివగుచు,
నవని నప్రతిరథుని దౌష్యంతి నిలిపి,
పట్టికిఁ గుటుంబభరమిచ్చి భర్తఁగూడి,
శాంతవై చొత్తు విప్రరాశ్రమము మరల.

గౌత—బిడ్డా ! ప్రయాణవేళమించిపోవుచున్నది. తండ్రి నిఁక వెనుకకుఁబంపుము. (కణ్వునిజూచి) ఈమె యెంతతడవైనను మరలమరల మీతోనీలాగునఁ జెప్పుచునేయుండును. మీరు వెనుక మరలవలెను.

కణ్వు—మాతపోనుష్ఠానమునకు భంగము కలుగుచున్నది. కాఁబట్టి యిఁక మరలఁగోరెదను.

శకుం—(మరల తండ్రి నాలింగనము చేసికొని) నాయనా ! తపశ్చరణముచేతఁ జిక్కిపోయినయీదేహమును నానిమిత్తమయి మిక్కిలి కృశింపనీకుము.

కణ్వు—(నిట్టూర్పువిడిచి)

గీ. పర్ణశాలకు వాకిట బలికిఁగాను
దల్లి ! నీవిడ్డనివ్వరిధాన్య మడరి
కలయమొలచినమొలకలుగనఁగ, నాకు
వితతశోకోపశమన మేగతినిగలుగు ?

పదువు. నీకు మార్గమున మేలగుఁగాక !

(అని శకుంతలయు సహచరులును నిష్క్రమించిరి.)

సఖు—(శకుంతలపోయినవంక తడవుచూచి) కటకటా! శకుంతల వనవీథిలోఁ గనుచాటయినది.

కణ్వ—(నిట్టూర్పువిడిచి) అనసూయా! మీచెలికత్తె దాఁటిపోయినది. దుఃఖమడఁచుకొని మీరిటు నాతోఁగూడ రండు.

సఖు—తండ్రీ! శకుంతలలేని యీతపోవనము పాడుపడినట్లున్నది. మేమెట్లుచొత్తుము?

కణ్వ—స్నేహవృత్తిచేత మీకాలాగునఁ గనఁబడుచున్నది. (విచారముతోనడచి) ఆహా! ఓబిడ్డలారా! శకుంతలను మగనియింటికిఁ బంపివేసి యిప్పుడు స్వస్థతను బొందినాఁడను.

గీ. కన్యయెపుడుఁ బరునిసొత్తె కాన, దాని
నిప్పుడు ప్రతిగ్రహీతకు నప్పగించి,
దాపుడుధనంబు స్వామికిఁదార్చినట్టు
లెంతొ నిర్మలమయ్యె నాయంతరాత్మ.
(అని యందఱును నిష్క్రమించుచున్నారు.)

ఇది చతుర్థాంకము.

శ్రీ

అభిజ్ఞాన

# శాకుంతలనాటకము.

## పంచమాంకము.

రంగము—రాజమందిరము.

[అప్పుడు సింహాసనాసీనుఁడయి రాజును, విదూషకుఁడును ప్రవేశించుచున్నారు]

విదూ—(చెవియిచ్చి) ఓమిత్రుఁడా! సంగీతశాలలోపల లక్ష్య ముంచుము. మృదుమధురమయిన తేటపాటలో స్వరసమ్మేళనము విన వచ్చుచున్నది. దేవియైన హంసపదిక వర్ణములు నేర్చుకొనుచున్నదని తలఁచెదను.

రాజు—మాధవ్యా! ఊరకుండు. నేను వినియెదను.

(తెరమఱుఁగున పాడఁబడుచున్నది.)

ద్విపద. క్రొత్తపూఁదేనియఁ గ్రోలంగనీవు
చిత్తంబుననుగోరి స్వేచ్ఛగానపుడు
క్రొమ్మావివిరిదేనెఁ గోర్కితీరంగ
నమ్మాడ్కిహాయిగా ననుభవించియును,
నిపుడీవు మధుపమా! యింతలోనిచట
నపురూపమైన యీయంబుజవసతి
మరగి సుఖించెడుమాత్రన యెట్లు
మఱవఁగల్గితి తొంటిమావిమంజరిని?

రాజు—అహాహా! ఈపాట రాగప్రవాహిని యగుచున్నది!

విదూ—ఈపాటలోని యక్షరార్థము తమకుఁ బూర్ణముగాఁ దెలిసినదా యేమి ?

రాజు—(చిఱునవ్వునవ్వి) ఈమె యొకప్పుడు నాచేతఁ బ్రేమింపఁబడినది. అందుచేత వసుమతీదేవివిషయమయి యీమె నన్ను నిందించుచున్న దనుకొనియెదను. మిత్రుఁడా! మాధవ్యా! నన్నునిపుణముగా నెత్తిపొడిచితివని హంసపదికతో నామాటలుగాఁ జెప్పుము.

విదూ—దేవరయాజ్ఞయిచ్చినట్లు చేసెదను. (లేచి) మిత్రుఁడా! అప్సరసచేతిలోఁ బడిన విరాగునివలెనే యీమె యితరులచేఁ జుట్టుపట్టించి కొట్టించెడు నాకిఁక ముక్తియుండదు!

రాజు—పోయి నాగరికవృత్తితో నామెకుఁ దెలుపుము.

విదూ—ఏమిసంగతి ? (అని నిష్క్రమించెను.)

రాజు—(తనలో) అదియేమోకాని గీతార్థమునువిని ప్రియజనవియోగములేకయు నేనేమియుఁ దోఁచనివాఁడనుగా నున్నాఁడను. అట్లుకాదు—

గీ. మున్నెఱుఁగకయు మదినంటుపూర్వజన్మ
భవ్యసఖ్యముల్ స్మరణకు వచ్చుఁగాన
జనుఁడు సుఖితుఁడయ్యు సురూపచయముఁగనియు
సుస్వరంబుల వినియు నుత్సుకతఁగాంచు.

(అని యాకులపాటుతో నుండుచున్నాఁడు.)

[అప్పుడు కంచుకి ప్రవేశించుచున్నాఁడు.]

కంచు—ఆహా! నేనిటువంటియవస్థను బొందినాఁడనుగదా ?

గీ. అవహితుఁడనై కులాచారమనుచు నేను
దాల్చు నీవేత్రయష్టి, యంతఃపురములఁ
గాలమధికంబు చెల్లినకతన నిపుడు
నడువలేని నాకవలంబనమున కయ్యె.

ఓయీ! రాజునకు ధర్మకార్యము మిక్కిలి యనతిక్రమణీయము. అట్లయినను, ఇప్పుడేధర్మాసనమునుండి లేచినయీయనకు మరల శ్రమకలిగించు కణ్వశిష్యులరాకను దెలుపుటకు మనసుగొలుపకున్నది. అట్లుకాదు. ఈలోకతంత్రాధికారమున కెన్నఁడును విశ్రాంతి లేదు. ఎట్లన—

గీ. అర్కుఁడొక్కమొగినె యశ్వంబులనుగట్టు;
రేయిఁబగలుఁదిరుగు వాయుదేవుఁ;
డవనిభరముఁదాల్చు ననయంబు శేషుఁడు;
ధరణిపాలురకును ధర్మమిదియ.

ఇఁకఁ గణ్వునినియోగము నడపెదను. (అని నడచి చూచి) ఈరాజు—

గీ. నడపి గజయూధముల, నెండఁబడుచుఁబగలు
శీతలస్థలి గజరాజుచేరునట్లు,
ప్రజలఁ దనకన్నబిడ్డలవలెను నడపి
స్వస్థచిత్తుఁడై నిర్జనస్థలముఁజేరె.

(సమీపించి) దేవా! జయమగుఁగాక! జయమగుఁగాక! ఇదిగో వీరె హిమవత్పర్వతప్రాంతవనవాసులయిన తపస్వులు. కణ్వసందేశముఁగొని స్త్రీలతోఁగూడ వచ్చియున్నారు. విని దేవర యిచ్చవచ్చినట్లు చేయఁదగును.

రాజు—(ఆదరముతో) ఏమీ? కణ్వసందేశము తెచ్చినవారా?

కంచు—మఱియేమి?

రాజు—ఆశ్రమవాసులయిన వీరలను శ్రౌతవిధిచేత సత్కరించి స్వయముగానే తాను వారినెదుర్కొని తీసికొనిరావలయునని పురోహితుఁడయిన సోమరాతునితోనామాటలుగా విన్నవింపుము. నేనును దపస్విదర్శనమునకుఁ దగినచోటనుండి వారికయి ప్రతీక్షించుచుండెదను.

కంచు.—దేవర యాజ్ఞాపించినట్లు చేసెద. (అని నిష్క్రమించుచున్నాఁడు.)

రాజు—(లేచి) వేత్రవతీ! అగ్నిహోత్రశాలకు దారిచూపుము.

ప్రతీహారిణి—దేవా! ఇటు. ఇటు.

రాజు—(నడచి, అధికారదుఃఖమునుకనఁబఱచి) జనులందఱును గోరినవస్తువులనుబొంది సుఖులగుచున్నారు. రాజులకో కార్యసాఫల్య మయినను దుఃఖమే.

గీ. అగపడఁగనీదు చింత రాజ్యప్రతిష్ఠ;
రాజ్యపాలనమెంతయు శ్రమకరంబు;
దండమును జేతఁదాల్చుఛత్రంబువోలె,
రాజ్యమె శ్రమంబునిచ్చుచు శ్రమమునడఁచు.

వైతాళికులు—(తెరలో) దేవా! విజయమగుఁగాక!

ప్రథముఁడు—గీ. స్వసుఖమును జూడ కలసెదు జగముకొఱకుఁ;
ప్రతిదినంబును నీకు వ్యాపారమిదియె;
చెట్టు తీక్ష్ణాతపముఁదాల్చి శిరసుచేతఁ,
దనదునీడచే నాశ్రితతాప మడఁచు.

ద్వితీయుఁడు—గీ. మరలిచెడు శిక్షచేసి దుర్మార్గచరులఁ;
గలహము లడంతు, వారసి కాతుపీవు;
బంధులెంతటి యైశ్వర్యవంతు లున్న,
బంధుకృత్యంబు నెఱపెదు ప్రజలకీవె.

రాజు—చింతాక్రాంతమనస్కుల మయియున్నను మేమీవచనములచేత నభినవసత్త్వసంపన్నుల మయితిమి! (అనినడుచుచున్నాఁడు.)

ప్రతీహారి—క్రొత్తగాఁదుడుచుటచేతఁ బ్రకాశించుచు సమీపమున హోమధేనువున్నయగ్నిహోత్రగృహముయొక్క వెలుపటిగుమ్మమిదె దేవర యెక్కవలయును.

రాజు—(ఎక్కి పరిజనునిమూఁపుమీఁద చేయూఁతచేసి నిలు

చుండి) వేత్రవతీ! ఏమియుద్దేశించి పూజ్యుఁడయిన కణ్వమహర్షి నాయొద్దకు ఋషులనుబంపియుండును?

చ. పరమతపోనిరూఢమునివర్యతపస్సులు విఘ్నమొందెనో!
యరయక యెవ్వరైన ఖలు లాశ్రమజంతుల కెగ్గుచేసిరో!
విరుల మదీయదోషమున వృక్షలతావళు లియ్యమానెనో!
యరయఁగలేక సంశయము నాకులపాటు మనంబుచెందెడున్.

ప్రతీ—తమ సుచరిత్రచేత సంతుష్టులయినఋషులు దేవరవారిని గొనియాడుటకయి వచ్చినారని నేనూహించెదను.

[అప్పుడు గౌతమీసహితయైన శకుంతలను ముందిడికొని మునులును వారిముందు కంచుకియు పురోహితుఁడును ప్రవేశించుచున్నారు.]

కంచు—ఆర్యులారా! ఇటు. ఇటు.

శార్ఙ్గ—శారద్వతా!

చ. ఇలనుమెలంగుభాగ్యనిధి యీనృపుఁ, డేమియు మేరమీఱి కే
కులమున నెంతహీనుఁడును గుత్సితమార్గము పట్టఁ డొక్కఁడున్;
దలఁచెద నట్టులయ్యు, విజనస్థలి మున్ను సతంబునుంటచేఁ,
బలుజనులున్న యీగృహము వహ్నిపరీతగృహంబునట్లెదన్.

శార—పురప్రవేశముచేత నీవిట్లగుట యుక్తమే. నేనును—

ఉ. స్నాతుఁడు కల్మషాంగుఁ గనుచందమునన్, బటుమత్తవర్తనున్
బూతచరిత్రుఁ డెంచుగతి, భూరివినిద్రితు మేలుకొన్నవాఁ
డాతతబుద్ధిలోఁ దలఁచునట్లుగ, స్వేచ్ఛమెలంగువాఁడు శా
రాతలబద్ధునట్లుఁగఁ దలంచెద నీయిహసౌఖ్యచిత్తులన్.

శకుం—(నిమిత్తమునుసూచించి) అయ్యో! ఏమోకాని నాకుడికన్నదరుచున్నది.

గౌత—బిడ్డా! నీకీయశుభము తొలంగునుగాక! నీభర్తకులదేవతలు నీకుశుభములిత్తురుగాక! (అని నడచుచున్నది.)

పురో—(రాజునుజూపి) ఓతపస్వులారా ! ఇదిగోవర్ణాశ్రమపరిపాలనచేయు మహారాజింతకుమునుపే సింహాసనముదిగి మీానిమిత్తము నిరీక్షించుచున్నాఁడు. ఆయనను సందర్శింపుఁడు.

శార్ఙ్గ—ఓమహాబ్రాహ్మణా! ఇదియెంతయుఁ గొనియాడఁదగినదే. మేమీావిషయమున మధ్యస్థులము.

గీ. తరులు ఫలసమృద్ధిని నమ్రతనువహించు;
మేఘములు నవోదకముల మిగులవంగు;
సత్పురుషు లుద్ధతులుగారు సంపదలను;
పటుపరోపకారులకు స్వభావ మిదియె.

ప్రతీ—దేవా ! ఋషులు ప్రసన్నముఖవర్ణులయి కనఁబడుచున్నారు. అందుచేత వారువచ్చినకార్యము విశ్వాసయుక్తమయినదని నేననుకొనియెదను.

రాజు—(శకుంతలనుజూచి)

గీ. పయిని మేలిముసుంగును వైచికొనుచు,
మేనిచెలువంబు స్ఫుటముగాఁ గానఁబడక,
పండుటాకులలోఁ బల్లవంబుపగిది,
ఋషులనడుమనుండినయీామె యెవతియొకొ ?

ప్రతీ—కుతూహలముగలదయి నాయూహతిన్నఁగా వ్యాపింపకున్నది. అయిననీమెరూపము చూడఁదగినదిగాఁ గానఁబడుచున్నది.

రాజు—అవుఁగాక ! పరకళత్రమును దేఱిచూడరాదు.

శకుం—(చేయిఱొమ్మునఁజేర్చుకొని తనలో) హృదయమా ! ఏమియిట్లు వడఁకుచున్నావు ? భర్తగారిభావము తెలిసికొని నించుక ధైర్యము వహింపుము.

పురో—(ముందుకువచ్చి) ఇదిగో తపస్వులు విధ్యుక్తముగా నర్చింపఁబడినవారు. ఏదోవీరియుపాధ్యాయులు పంపిన సమాచారము కలదఁట ! దేవా ! వినఁదగును.

రాజు—సావధానచిత్తుఁడనయి యున్నాను.

ఋషులు—(చేతులెత్తి) రాజా ! నీకు జయమగుఁగాక !

రాజు—మీకందఱకును నమస్కరించుచున్నాను.

ఋషులు—ఇష్టార్థసిద్ధి యగుఁగాక !

రాజు—మీతపస్సులు నిర్విఘ్నముగా సాగుచున్నవా ?

ఋషు—గీ. సాధుసంరక్షణము నీవు సలుపుచుండ,
సత్క్రియలకెట్లు విఘ్నముల్ సంభవించు ?
బిట్టుగ సహస్రకిరణుండు వెలుఁగుచుండఁ,
బుడమి నంధకారం బెట్లు పుట్టనేర్చు ?

రాజు—నారాజశబ్ద మిప్పుడుగదా సార్థకమాయినది ! పూజ్యుఁడయిన యాకణ్వమహాముని లోకానుగ్రహముకొఱకుఁ కుశలియై యున్నాఁడా ?

ఋషు—తపస్సిద్ధి గలవారికిఁ గుశలము స్వాధీనమే. ఆయన కుశలప్రశ్నపూర్వకముగా మీకిట్లు చెప్పుమనియె.

రాజు—ఆయన యేమని యాజ్ఞాపించినారు ?

శార్ఙ్గ—"అన్యోన్యసంకేతముచేత నీవుమాపుత్రికను వివాహమాడుటమీయెడఁగల ప్రీతిచేత నేనంగీకరించినాఁడను. ఎందుచేతనన—

గీ. యోగ్యతములలో నగ్రగణ్యుండ వీవు;
భువి శకుంతల రూపొందుపుణ్యరాసి;
తుల్యగుణయుక్తులగు దంపతులను గూర్చి,
బ్రహ్మ చిరకాలమునకును బాసెనింద.

కాఁబట్టిగర్భిణియైన యీమెను సహధర్మాచరణమునకు స్వీకరింపవలయును" అని

గౌత—అయ్యా ! నాకును గొంతచెప్పనిచ్ఛగలదు. కానినావచనమున కవకాశములేదు. ఎందుచేతనన—

గీ. గురుజనులయిష్ట మీయుమకోరదయ్యె;
నాప్తబంధుల మీరును నడుగరైతి;
రిట్లు మీలోన మీరాొనరించుకొన్న
పనికి నొండొరులకు నేమి పలుకవలయు !

శకుం—(తనలో) భర్త యేమిపలుకునో !

రాజు—ఇవి యేటిమాటలు ?

శకుం—(తనలో) ఈవాగ్విజృంభణము నాకగ్నిహోత్రము గానున్నది !

శార్ఙ్గ—ఏమిమీతాత్పర్యము ? మీరులోక వ్యవహారమున మిక్కిలిప్రవీణులుగదా ?

గీ. పుట్టినింటనె పతిగలపొలఁతి యున్న
జనులు శంకింతు రన్యథా సాధ్వినైనఁ;
గావునను దదప్రియనైనఁ, గాంతనెపుడు
బంధుజను లుంచఁ దలఁతురు భర్తకడనె.

రాజు—ఏమి ? మీమానిని పూర్వము నాచేత వివాహమాడఁబడినదా ?

శకుం—(విషాదముతో మనసులో) హృదయమా ! నీకిప్పుడు బెడదసంభవించినది !

శార్ఙ్గ—ఏమి ? చేసినపనియెడ ద్వేషమును ధర్మమును తప్పుటయు రాజునకుఁదగునా ?

రాజు—ఎందుచేత మీరీ యసత్యకల్పనగలప్రశ్న వేయుచున్నారు ?

శార్ఙ్గ—ఈవికారములు తఱుచుగా నైశ్వర్యమత్తులకుఁ బుట్టెడివే.

రాజు—(తనలో) నన్ను వీరు మిక్కిలి తిరస్కరించుచున్నారు.

గౌత—బిడ్డా! నీవు క్షణమాత్రము సిగ్గుపడకుము. ఇప్పుడు నీ మేలిముసుఁగును దీసెదను. అందువలన నీభర్త నిన్నానవాలుపట్టును.

(అని యట్లుచేయుచున్నది.)

రాజు—(శకుంతలనుజూచి తనలో)

చ. ఎదురను గానిపించు నిదె యీయసమానసురూప మార! నే
నిది మొదలం గ్రహించితినొ యే గ్రహింపనొ నిశ్చయింపలే
నెద; హిమపూర్ణకుందమున కేగి ప్రభాతమునందుఁ గాంచుతు
మ్మెదకరణిం ద్యజింపను దమిన్ గ్రహియింపను జాల నిత్తఱిన్.

ప్రతీ—ఆహా! రాజుధర్మదృష్టి! అనాయాసముగా లభించిన యిటువంటిరూపమునుజూచి మఱియెవ్వఁ డాలోచించును?

శార్ఙ్గ—రాజా! ఏమి యూరకున్నావు?

రాజు—ఓతపోధనా! ఎంతయాలోచించినను నేనీమెను బరిగ్రహించుట స్మరణకురాలేదు. అట్లుండఁగా స్పష్టముగాఁ గనబడుచున్న గర్భచిహ్నములుగలయీమెను నేనెట్లు భార్యనుగా నంగీకరింపుదును?

శకుం—(తనలో) ఈయనకు వివాహవిషయముననే సందేహము కలిగినది. ఇఁక దూరముపోయిన నాయాశయెందుకు?

శార్ఙ్గ—ఇదినీకుఁదగదు.

గీ. దొంగిలినసొత్తు దండ్యుఁడౌదొంగకడకె
మరలఁ బంచినకరణి, నమ్మాని నీవు
కైకొనినయాత్మతనయను గౌరవమున
నీకడకుఁ బంపుట నతండె నింద్యుఁడీపుడు.

శార—శార్ఙ్గరవా! నీవిప్పుడూరకుండుము. ఓశకుంతలా! మేము చెప్పఁదగినది మేము చెప్పితిమి. అందునకితఁ డీవిధమునఁబలుకుచున్నాఁడు. ఈయనకు నమ్మకము పుట్టునట్టు ప్రత్యుత్తరము నీవుచెప్పుము.

శకుం.—(తనలో) అటువంటి యనురాగమున కిట్టిగతి పట్టినప్పుడు నేనుదలఁపించిన ప్రయోజనమేమి ? ఇఁక నన్నుఁగురించి నేను దుఃఖపడ వలసినదే. నిశ్చయము. (ప్రకాశముగా) ప్రాణేశ్వరా ! (అని సగము చెప్పి) ఇప్పుడు వివాహమునందే సంశయము గలిగినదిగనుక, ఇట్లుపిలు వఁదగదు. ఓపౌరవా ! నాఁడా ప్రకారముగాఁ దపోవనమునందు స్వభావముచేత బేలహృదయముగల నన్ను నీవెన్నో బాసలు చేసి మోసపుచ్చియిప్పుడీవిధమయినమాటలచేతనన్ను నిరాకరించుట నీకుఁదగునా ?

రాజు—(చెవులుమూసికొని) పాపము శమించునుగాక !

గీ. వసుధఁ గూలంకషనదీప్రవాహ మచ్ఛ
జలమును దటస్థతరువును గలఁచునట్లు,
మామకకులప్రశక్తినిమాప, నన్నుఁ
బాతకునిఁజేయనుం బాటుపడిదవేల ?

శకుం—మంచిది ! తమరు నిజముగాఁ బరభార్య ననుశంకచేతనే యిట్లయితిరేని, ఈయానవాలుచేతఁ దమసందేహనివారణము చేసెదను.

రాజు—ఇదియుత్తమపక్షము.

శకుం—(ఉంగరపువ్రేలుతడవి) నా వ్రేలియుంగరములేదు. (అని విషాదముతో గౌతమిని జూచుచున్నది.)

గౌత—శక్రావతారములో శచీతీర్థోదకమునకు నీవు మ్రొక్కినప్పుడు నీయుంగరము జాఱిపోయినది కాఁబోలును !

రాజు—(చిఱునవ్వునవ్వి) ఇందుచేతనే స్త్రీలు సమయోచిత బుద్ధి కలవారనిచెప్పుదురు.

శకుం—ఇందులో విధి యిప్పుడు తనసామర్థ్యమును జూపెను. మీకు మఱియొకటిచెప్పెదను.

రాజు—ఇప్పుడు చెప్పెడుదాని విసవలయును.

శకుం___ఒకనాఁడు నవమాలికామంటపమునందుఁ దామరాకు దొప్పలోని నీరు తమచేతిలోఁ బోసికొంటిరి.

రాజు___వినుచున్నాఁడను. అనంతరము.

శకుం___ఇంతలో నా పెంపుడుబిడ్డయైన దీర్ఘాపాంగ మనులేడి పిల్ల సమీపమునకువచ్చెను. మీరు కనికరముగలవారయి నీవే ముందుగా నీరుత్రాగుమని దానిని నీరు చూపి పిలిచితిరి. పరిచయము లేక పోవుటచేత నది మీచేతిసమీపమునకు రాదయ్యెను. పిమ్మట నీరు నేను చేతఁబట్టుకోఁగానే యది స్నేహముచేత దగ్గఱకు వచ్చెను. అప్పుడు నన్ను మీరీవిధముగా మేలమాడితిరి___అందఱును బంధువుల యెడ విశ్వాసముంతురు; మీరిరువురును నరణ్యసంభవులు.

రాజు___స్వకార్యనిర్వహణనిపుణలయినస్త్రీలు మొదలయిన తేనె లొలుకుకల్లమాటలతో భోగపరాయణుల నాకర్షింతురు.

గౌత___ఓమహాభాగా! ఇట్లుతలంపఁదగదు. తపోవనమునందుఁ బెరిఁగినయీమె కపటమెఱిఁగినదికాదు.

రాజు___ఓవృద్ధతపస్విని!

చ. అరయఁగ మానవేతరములై తగుజంతువులందు స్త్రీలలోఁ
గరము నిసర్గపాటవము గన్పడఁ, జెప్పఁగ నేల ప్రాజ్ఞలౌ
తరుణులమాట? తాఁ బరభృతప్రకరం బితరద్విజాళి నం
బరమున కేగుదాఁకఁ బెనుపంగనొనర్పదె కన్నబిడ్డలన్?

శకుం___(రోషముతో) కుత్సితుఁడా! నీహృదయానుమానము చేత నితరుల నట్లే చూచుచున్నావు. పైకి ధర్మకవచమును దొడిగి గడ్డికప్పియున్న నూతివలె నున్నవిన్నెవ్వరు పోలఁగలరు?

రాజు___(తనలో) నాకు మనస్సునందు సందేహముపుట్టించుచు, కపటములేనియట్లే యీమెకోపము కనఁబడుచున్నది. అట్లేకదా?

చ. స్మరణకు రాక క్రూరముగ స్వాంతములోపలఁ దాపమొందుచున్
గరము రహస్యపుం బ్రణయగాథ యెఱుంగఁగ లేని నాపయిన్
దరుణి యపారకోపమునఁ దద్దయు నేత్రము లెఱ్ఱఁజేసి వం
కరలగుకన్బొమల్ విఱుచుఁ గా స్మరచాపవిఖండనక్రియన్.

(ప్రకాశముగా) ఓకళ్యాణీ! దుష్యంతునినడత యందరకుం దెలిసినదే. అయినను నేనిది తెలియఁజాలకున్నాను.

శకుం—మేలు! పూరువంశజుఁడను నమ్మకముచేత నాలుక తేనెయు హృదయము విషమునైనవానిచేతఁబడి నేనిక్కడ స్వచ్ఛందసంచారిణినిగాఁ జేయఁబడితిని. (అని చీరచెఱఁగుతో ముఖముకప్పుకొని యేడ్చుచున్నది.)

శార్ఙ్గ—ఈలాగున స్వతంత్రించి బుద్ధిలేనిపని చేసినందుకుఁ దాపమనుభవింప వలసినదే.

గీ. ఏకతమ బాంధవము నల్పునెడను దాను
బదిగఁ బరికించి మఱిచేయ వలయునెపుడు;
హృదయ మెఱుఁగక పరులతోఁ బదరిచేయు
సౌహృదమె విరోధమగు నీచందమునను.

రాజు—అయ్యో! ఏమి మీరునునీమెమాటలనేనమ్మి నాయందేదోషారోపణము చేసి నన్నునిందించుచున్నారు?

శార్ఙ్గ—(అసూయతో) నావ్యత్యస్తవాక్యమును దమరుచిత్తగింపవలయును.

గీ. అప్రమాణంబెయగు జన్మమాదిగాఁగ
సతముఁ గౌటిల్యమెఱుఁగని జనముమాట;
అన్యవంచనమే విద్యయట్లునేర్చు
వారెపో సత్యవాదులు వసుధమీఁద.

రాజు—ఓసత్యవాదీ! మీరుచెప్పినప్రకారమే నేనొప్పుకొనియెదను. ఈమెను వంచించుటవలన మాకేమిలాభము?

శార్ఙ్గ—పాపము.

రాజు—ఓయీ ! పౌరవులు పాపమును గోరుదురనుట నమ్మఁదగినది కాదు.

శార్ఙ్గ—శారద్వతా ! మనకు మాఱుత్తరముతో నేమి ప్రయోజనము ? మనము గురుసందేశమును నిర్వర్తించితిమి. ఇఁక వెడలిపోవుదము. (రాజుతో)

క. ఈవెలఁదుక నీభార్యయె
యీవేలిన నేలుకొమ్ము, యేలకయున్నన్
బోవిడువు, మాండ్రయెడఁ బతు
లే విను సర్వాధికారు లిల నన్నిటికిన్.

గౌత—ముందునడువుఁడు. (అని యందఱును బయలుదేఱుచున్నారు.)

శకుం—ఈకుత్సితునిచేత మోసపోతిని. ఇఁక నాగతియెట్లు ? దుఃఖములోమునిఁగి యున్ననన్ను మీరును విడిచి పెట్టెదరా ? (అని వెంటఁబడుచున్నది.)

గౌత—(నిలిచి) వత్సా ! శార్ఙ్గరవా ! పాపము శకుంతల దైన్యముతో విలపించుచు మనవెంట వచ్చుచున్నది. భర్తచేఁ గ్రూరముగా వదలిపెట్టఁబడి బిడ్డ యేమిచేయఁగలదు ?

శార్ఙ్గ—(రోషముతో వెనుకతిరిగి) ఓసి దుర్మార్గురాలా ! ఏమి ? స్వాతంత్ర్యము నవలంభించుచున్నావు !

శకుం—(భయముచేత వడఁకుచున్నది.)

శార్ఙ్గ—శకుంతలా !

గీ. అవనిపతి యన్నయట్ల నీ వగుదువేని,
కులము చెడిననీ వేల నీకూర్మిపితకు ?

నీచరిత శుద్ధమంచును నీవెఱింగి
తేని, పతియింట దాస్యంబె హితము నీకు.

నిలువు. మేము వెళ్లెదము.

రాజు—ఓతపస్వీ! ఈమె నేలదూషించెదవు?

క. కుముదంబులకే శశియును
గమలంబులకే రవియు వికాశమొసంగుఁ;
స్వమన మటు జితేంద్రియులకు
విముఖం బగుఁ బరవధువులబిగికౌఁగిలికిఁ.

శార్ఙ్గ—అన్యసంగముచేతఁ బూర్వవృత్తాంతమును మఱచి పోయియున్నప్పు డధర్మభీరుత్వ మెట్లుకలుగును?

రాజు—(పురోహితునితో) ఇందులో గురుత్వలఘుత్వములు మిమ్మే యడుగుచున్నాను.

గీ. ఏను మూఢుఁడనైతినో, యీమె కల్ల
లాడెనో, యనిసంశయ మయినయిప్పు
డే స్వభార్య విడుచు వాఁడనే యగుదునో?
యన్యసతి నంటుపాతకి నగుదునొక్కొ?

పురోహితుఁడు—(ఆలోచించి) ఇప్పుడిట్లుచేయవచ్చును.

రాజు—తమరాజ్ఞ యియ్యవలెను.

పురో—ఈమె ప్రసవమగువఱకును నాయింట నుండవచ్చును. అట్లేల చెప్పెదవంటిరేని, మీరు చక్రవర్తియగు పుత్రునిఁగందురని యీవఱకే పెద్దలు చెప్పియున్నారుగదా? మునిదౌహిత్రుఁ డాలక్షణములు గలవాఁడయినపక్షమున, సంతోషపూర్వకముగా నీమెను దమరంతఃపురమునకు రప్పించుకొనుఁడు. మఱియొకలాగయ్యేనేని యీమెను దండ్రికడకుఁ బంపుట యుండనేయున్నది.

రాజు—గురువుగారి యిష్టానుసారము చేయుఁడు.

పురో—బిడ్డా! నా వెంటరమ్ము.

శకుం___ఓభూదేవీ! నీలోనికి నాకు దారియిమ్ము. (అని యేడ్చుచు పురోహితునితోడను తపస్వులతోడను నడుచుచున్నది.)

రాజు___(శాపముచేత జ్ఞప్తిలేనివాఁడయి శకుంతలసంగతియే యాలోచించుచున్నాఁడు.)

(తెరమఱుఁగున) ఆశ్చర్యము! ఆశ్చర్యము!

రాజు___(ఆలకించి) అది యేమయియుండునో!

పురో___(ప్రవేశించి విస్మయముతో) దేవా! అద్భుతము పుట్టినదిగదా?

రాజు___అది యేమి?

పురో___దేవా! కణ్వశిష్యులు మరలఁగానే___

గీ. తనయదృష్టంబు నిందించుకొనుచు బాల
బాహువు లెగనెత్తి యేడ్వ నుపక్రమించె;

రాజు___తరువాత నేమిసంభవించినది?

పురో___అప్సరస్తీర్థమున మింటి కామెఁ గొనుచు
నెగసె వెసఁ గాంతిరాశియా యింతి యొకతె.

(అందఱు నాశ్చర్యపడుచున్నారు.)

రాజు___భూదేవా! ఆమెను మనము మున్నేవిడిచిపెట్టితిమి. వ్యర్థమయినవిచారముతో మీరేల వెదకెదరు? విశ్రాంతిఁబొందుఁడు.

పురో___(చూచి) విజయమగుఁగాక! (అనినిష్క్రమించుచున్నాఁడు)

రాజు___వేత్రవతీ! నామనస్సు వ్యాకులముగానున్నది. పడక గదికి మార్గము చూపుము.

ప్రతి___దేవా! ఈలాగు. ఈలాగు. (అని బయలుదేఱుచున్నది)

రాజు___గీ. పరిరాకరించినతాపసేంద్రసుతను
దారనుగ నెంతమాత్రంబుఁ దలఁప నేను;
డెంద మట్లయ్యు సంతాప మొందు చిపుడు
ప్రత్యయముపుట్ట బోధించుపగిది నుండె.

(అని యందఱును నిష్క్రమించుచున్నారు.)

శ్రీ

అభిజ్ఞాన

# శాకుంతలనాటకము.

పంచమషష్ఠాంకమధ్యమునందు ప్రవేశకము.

రంగము—రాజమందిరద్వారము.

(అప్పుడు పురితలవరియగు శ్యాలకుఁడు పెడరెక్కలుకట్టిన యొక పురుషుని తీసికొని రక్షకభటులతోఁ బ్రవేశించుచున్నాఁడు.)

రక్ష—(వానినిగొట్టి) ఓరిదొంగా! రత్నముందాపునప్పుడు పేరుచెక్కినరాజుగారి యీయుంగరము నీకెక్కడనుండివచ్చినది? చెప్పు.

పురు—(భయము నటించుచు) అయ్యలారా! దయచేయుఁడు. నే నిటువంటిపని చేయువాఁడనుగాను.

ప్రథముఁడు—ఓరీ! నీవు సద్బ్రాహ్మణుఁడవని విచారించి పరిగ్రహింపుమని రాజుగారు నీ కీదాన మిచ్చినారురా?

పురు—ఇప్పుడు నేఁ జెప్పునదివినుఁడు. నేను శక్రావతారతీర్థసమీపవాసినైన జెస్తను.

ద్వితీయుఁడు—ఓరిదొంగా! మేము నీజాతియడిగినామురా?

శ్యాలకుఁడు—ఈచోరునినంతయు వరుసగాఁ జెప్పనిండు. వీనిని మధ్య నడ్డపెట్టవలదు.

రక్ష—ఆయన యాజ్ఞాపించినప్రకారము చెప్పు.

పురు—నేను వల, గాలము మొదలయిన చేఁపలనుబట్టుసాధనములచేతఁ గుటుంబభరణము చేసికొనుచున్నాను.

శ్యాల—(నవ్వి) ఇప్పుడు నీజీవనము బహు పరిశుద్ధమయినది.

పురు—దేవా! తమరిట్లు సెలవియ్యరాదు.

గీ. గర్హితమె యైనను, స్వజాతికర్మ మెపుడు
వదలఁగూడదుగాదె యెవ్వారలకును;

శ్రోత్రియుండైన వ్యాపారణకర్మచేత
దారుణుండైన, మృదువెయగా దయనుబూని.

శ్యాల—తరువాత. తరువాత.

పురు—ఒకనాఁడు నేనొకమెట్టచేఁపను గోసితిని. అప్పుడు దానికడుపులో రత్నప్రభాభాసుర మయిన యీయుంగరము కనఁబడినది. తరువాత నేను దీని నమ్మఁజూపుచు మీచేతఁ బట్టుపడితిని. మీరు నన్నుఁ జంపినను సరే, విడిచినను సరే. ఇది వచ్చినవిధమింతే.

శ్యాల—జానుకా! పొలసుకంపును వికారరూపమునుగల వీఁడు నిస్సంశయముగాఁ జేఁపలవాఁడే. వీని కీయుంగరమువచ్చుటయే విచారింపవలయును. మనము రాజగృహమునకుఁ బోవుదము.

రక్షు—మంచిది—ఓరిదొంగా! రారా. (అని యందఱు నడుచుచున్నారు.)

శ్యాల—సూచకా! వీనిని బురద్వారమున నప్రమత్తులరయి కాచియుండుఁడు. ఇప్పుడీయుంగరము వచ్చినవిధము రాజునకు నివేదించి యాతనియాజ్ఞ పొందివచ్చెదను.

రక్షు—అయ్యా! ప్రభువువారియనుగ్రహసంపాదనమునకయి పొమ్ము.

(శ్యాలకుఁడు నిష్క్రమించుచున్నాఁడు.)

ప్రథముఁడు—జానుకా! శ్యాలకుఁ డాలస్యము చేయుచున్నాఁడు!

ద్వితీ—రాజులవద్ద సమయముకనిపెట్టి యనుసరింపవలయును గదా?

ప్రథ—జానుకా! వధ్యుఁడయినవీనికిఁ బూలుచుట్టుటకు నా చేతులు తొందరపడుచున్నవి. (అని వానిని జూపుచున్నాఁడు.)

పురు—స్వామీ ! నన్ను కారణముగాఁ జంపుట మీకుఁదగదు.

ద్వితీ—(చూచి) అదిగో మాస్వామి పత్రిక చేతఁబట్టుకొని రాజుగారియాజ్ఞనుబొంది యిటు మొగంబయి కనఁబడుచున్నాఁడు. ఓరీ ! నీవిఁక గ్రద్దలకు బలియగుదువు. లేదా కుక్కల నోరనైనను బడెదవు.

శ్యాల—(ప్రవేశించి) సూచకా ! ఈపల్లెవానిని విడిచి పెట్టుము. వీని కీయుంగరము వచ్చినసంగతి సరిగానున్నది.

సూచ—దేవర యాజ్ఞాపించినట్లు చేసెదను.

ద్వితీ—వీఁడు యమమందిరముఁ జొచ్చి మరలవచ్చినాఁడు.

(అని వానికట్లు విప్పుచున్నాఁడు.)

పురు—(శ్యాలకునకు మ్రొక్కి) స్వామీ ! ఇఁక నాకు జీవన మెట్లు ?

శ్యాల—ఇదిగో రాజుగారు నీ కుంగరము, వెలనుగూడ బహుమానము దయచేసిరి. (అని వానికి ధనమిచ్చుచున్నాఁడు.)

పురు—(నమస్కారపూర్వకముగా పుచ్చుకొని) రాజుగారు నన్ను రక్షించినారు.

సూచ—ఒక్కరక్షించుటయే కాదు నిన్నుఁ గొఱఁతనుండి దింపి యేనుఁగుమూఁపుమీఁది కెక్కించినారు.

జాను—అయ్యా ! ఉంగరమునందు రాజుగారికి మిక్కిలి మక్కువ కలిగియుండునని యీబహుమానమే చెప్పుచున్నది.

శ్యాల—అమూల్యమయిన యారత్నమునందు రాజుగారికిఁ బ్రీతిగలదని యిందునుబట్టి నేననుకోను. దానిని జూచుటచేత వారి కిష్టజను లెవ్వరో తలఁపునకువచ్చిరి. వారు స్వభావగంభీరులయినను ముహూర్తకాలము కన్నుల నీరు పెట్టుకొనిరి.

సూచ—శ్యాలకునకు రాజుగారిసేవ దొరకినదిగదా ?

జాను—ఓయీ! ఈచేఁపలదానిమగనిలాభము నిమిత్తమని చెప్పు. (అనివానివంక నసూయతో చూచుచున్నాఁడు.)

పురు—అయ్యలారా! ఇందులో సగము మీకు సుహృద్భావము వెలగా నిచ్చెదను.

సూచ—ఈమాత్రము తగును.

శ్యాల—జాలరీ! ఇప్పుడు నీవు గొప్పప్రియమిత్రుఁడ వైతివి. మద్యముసాక్షిగా మనము ప్రథమమైత్రి చేసికోవలెను. కాఁబట్టి కల్లంగడికే పోదము.

పురు—అలాగే. (అని యందఱును నిష్క్రమించిరి.)

---

## షష్ఠాంకము.

### రంగము—ప్రమదావనము.

(అప్పు డాకాశయానముచేత సానుమతి యనునప్సరస ప్రవేశించుచున్నది.)

సాను—సాధుజనులు స్నానముచేయునంతవరకు నప్సరస్తీర్థ సన్నిధానమునందు నేను జేయఁదగినపనిని నిర్వర్తించితినిగనుక, ఇప్పు డారాజర్షియొక్క వృత్తాంతమును గనుఁగొనెదను. మేనకచుట్టరికము చేత శకుంతల యిప్పుడు నాకు దేహసదృశయైనది. పుత్రికకొఱ కామె నన్నిక్కడకుఁ బంచినదిగదా? (అంతటనుజూచి) ఇదియేమో కాని వసంతోత్సవసమయ మయినను, ఈరాజగృహమునం దేమియు నుత్సవమారంభింపనట్లు కనఁబడుచున్నది! నాకు ధ్యానముచేతనే సమస్తమును దెలిసికొను శక్తి కలదు. అయినను నా చెలియొక్కమాట మన్నింపవలయును. కాఁబట్టి యీయుద్యానపాలకురాండ్రకిద్దఱికిని దిరస్కరిణీవిద్యచేతఁ గనఁబడక వీరిప్రక్కనే యుండి చూచెదను. (అని దిగినట్టభినయించి నిలిచెను.)

[అప్పుడు మామిడిచిగురుచూచుచు నొకచేటికయు, దానివెనుక మఱియొకచేటికయుఁ బ్రవేశించుచున్నారు.]

మొద—గీ. హర్ష మిచ్చుచుఁ బికముల, కలవసంత
మాసమునకును బ్రాణసమాన మగుచు,
తుమ్మెదలపాదములకు భంగమ్మకూర్చు
చూతము ఋతుమంగళముగఁ జూతు నేను.

రెండవది—ఓపరభృతికా! నీవొంటిగా నేమియాలోచించు చున్నావు?

మొద—ఓమధురికా! మావిమొగ్గనుజూచి పరభృతిక యున్మత్తయగుచున్నది.

రెండ—(సంతోషముతో త్వరితముగావచ్చి) ఏమీ! వసంతకాలమువచ్చినదా!

మొద—మధురికా! నీకిప్పు డిది మదవిభ్రమముగల పాటలకుఁ గాలము.

రెండ—సఖీ! నన్నుఁ బట్టుకొమ్ము. నేనిప్పుడు కొనకాళ్ళమీఁదనిలిచి మన్మథపూజకొరకు మామిడిచిగుళ్లు కోసెదను.

మొద—పూజాఫలములో నాకును సగమిత్తువేని పట్టుకొని యెదను.

రెండ—నేననకపోయినను నీకదిసిద్ధించును. మనకు శరీరములు వేరైనను బ్రాణ మొక్కటియేకదా! (అని సఖినిపట్టుకొని నిలిచి మామిడిచిగురు గోయుచున్నది.) ఓసీ! వికసింపకపోయినను మామిడిమొగ్గ తొడిమ త్రుంచుటచేత సువాసన కొట్టుచున్నది. (కపోతహస్తముపట్టి)

గీ. ఓరసాలప్రవాళంబు! యొనరనిన్ను
ధనువు చేతనుదాల్చు కామునకు నిత్తుఁ;

గావునను బాంధయువతిలక్ష్యంబ వగుచుఁ
బంచశరునకు నాఱవబాణ మగుము.

(అని మామిడిచిగురును జిమ్ముచున్నది.)

కంచుకి—(తెరచాటునుండి ప్రవేశించి కోపముతో) మీరు దేహము తెలియకున్నారు! ప్రభువువారు వసంతోత్సవము వలదని నిషేధించియుండఁగా మీరేల మావి మొగ్గలను గోయనారంభించినారు? కోయవలదు.

ఇద్దఱు—(భయపడి) అయ్యా! క్షమింపుము. మే మిది యెఱుఁగము.

కంచు—మీరు వినలేదా యేమి? ఈవసంతమునఁ బూచు వృక్షములును వాని నాశ్రయించియున్నపక్షులును గూడ రాజుగారి యాజ్ఞకుఁ గట్టుపడినవి. ఎట్లన—

చ. చిరముగఁ బైకి వెల్వడియుఁ జిమ్మదుపుప్పొడి మావిమొగ్గయుఁ;
గురువకముఁ దగ న్నిలిచెఁ గోరకరీతినె సిద్ధమయ్యునున్;
బురుషపికంబు మ్రింగె రుతముఁ గళమందునె శీతమేగియుఁ;
మరుఁ డుడిపెఁ శరంబు నసుమఁ వెఱఁదూణమునుండితీయుచుఁ.

సాను—సందేహములేదు. రాజేంద్రుఁడు మహాప్రభావ సంపన్నుఁడు.

మొద—అయ్యా! కొన్ని దినముల క్రిందట రాజుగారిబావ మఱఁదియగు మిత్రావసువు మమ్ము రాజుగారి చరణసన్నిధానము నుండి ప్రమదవనపరిపాలనకర్మ మిచ్చి పంపివేయుటచే నాఁటనుండి మేమిక్కడనుండినందున మాకీవృత్తాంతము తెలియలేదు.

కంచు—కానిండు. మీరిఁక నీప్రకారముగా నడవఁగూడదు.

ఇద్ద—అయ్యా! మాకు వినవేడుకగానున్నది. రాజుగారు వసంతోత్సవము నెందుచేత మాన్పినారో మేము వినఁదగినయెడలఁ జెప్పుఁడు.

సాను—మనుష్యు లుత్సవప్రియులు గదా? దీనికేదో గొప్ప కారణ ముండవలయు.

కంచు—ఇది వెల్లడియైనవిషయము మీరుఁ జెప్పకపోనేల? రాజుగారికి శకుంతలను విడనాడుటవలనఁ గలిగిన లోకాపవాదము మీచెవిని బడలేదా యేమి!

ఇద్ద—ఉంగరమును చూచినంతపర్యంతము శ్యాలకునివలన విన్నాము.

కంచు—అందుచేఁ జెప్పఁదగినది కొంచెమేయున్నది. ఎప్పుడు తమయుంగరమును జూచుటవలన రాజుగారు "పూజ్యురా లయిన శకుంతలను మేము రహస్యమున వివాహమాడినది సత్యమే. అజ్ఞానమువలన విడిచిపెట్టితి" మని తలఁచిరో, యప్పుడు మొదలుకొని రాజుగారు పశ్చాత్తాపమును బొందుచున్నారు. ఎట్లన—

ఉ. ఒల్లఁడు రమ్యవస్తుతతియుం, గొలువియ్యఁడు మంత్రికోటికిన్
దొల్లిటియట్ల ప్రత్యహము, దొర్లుచుఁ బాన్పున నిద్రలేక వ
ర్తిల్లును రాత్రు, లంతిపురిఁ దిమ్మరుకొమ్మలపేరు మార్చి రం
జిల్లునదర్హ వాక్యములు చెప్పి కడున్ వెఱఁగొందు లజ్జచేన్.

సాను—నాకు మనః ప్రియముగా నున్నది.

కంచు—అందుచేత మనస్సు వికలమయి రాజుగారు వేడుక మానిపించినారు.

ఇద్ద—సరి! సరి!

(తెరలో) మీరు రండి రండి.

కంచు—(ఆలకించి) కాంతలారా! రాజిక్కడనే యున్నాఁడు. మీరు మీపనియందుండుఁడు.

ఇద్ద—అలాగే. (అని వెళ్లుచున్నారు.)

(అంతట పశ్చాత్తాపమునకు తగినవేషముతో రాజును, విదూషకుఁడును, ప్రతీహారియు ప్రవేశించుచున్నారు.)

కంచు—(రాజునిజూచి) ఓహోహో! కొన్నిరూపములు సర్వావస్థలయందును రమణీయముగానే యుండును! ఈవిధముగాఁ జింతాకులుఁడయి యున్నను రాజు, ప్రియదర్శనుఁడుగా నున్నాఁడు! అవును.

సీ. మతివిశేషంబుగ మండనసముదాయ
మేమియుఁదాల్పక, యెడమచేతఁ
జెలువంబుమీఱ ముంజేతికిఁ బంగారు
కడియంబుమాత్ర మొక్కటి ధరించి
శ్వాసాతిశయమునఁ జాలంగశోషిల్లి
యరుణిమదూలినయధర మొప్ప,
సరిలేనిచింతల జాగరణంబులఁ
గడునెఱ్ఱనై నట్టికనులు గలిగి,
చిక్కియుండియు నౌర! యీక్షితివరుండు
తనదుమహనీయతేజోవితానమునను
సానఁబట్టినరత్నంబు చందమునను
దనకృశత్వంబు తోఁపక తనరు నిపుడు.

సాను—(రాజును జూచి) నిరాకరించుటచేత నవమానింపఁబడియు శకుంతల యీతనినిమిత్తమయి కృశించుచుండుట యుక్తముగానేయున్నది.

రాజు—(ఆలోచించుచు మెల్లఁగానడచి)

గీ. మిగుల హరిణాక్షిచే మున్ను మేలుకొలుపఁ
బడియు, నిద్రించుచుండె నీపాడుమనసు;
ఘనదురంతపశ్చాత్తాప మనుభవించు
కొఱకుమేల్కొనియున్నది కోరియిపుడు.

సాను—మాళకుంతలభాగ్యములు నిటువంటివేసుమా !

విదూ—(చేయడ్డము పెట్టుకొని) ఇతఁడు మరల శకుంత లావ్యాధిచేతఁ బీడింపఁబడుచున్నాఁడు. ఇది యెట్లు కుదురుపాటునకు రాఁగలదో నాకుఁ దెలియకున్నది.

కంచు—(దగ్గరకువెళ్లి) దేవా ! జయమగుఁగాక ! జయమగుఁ గాక ! ఓమహారాజా ! ప్రమదవనభూములను బరిశీలించినాఁడను. దేవరవారు యథేష్టముగా వినోదస్థలములయందు విహరింపవచ్చును.

రాజు—వేత్రవతీ ! తడవుగ మేలుకొనియుండుటచేత మేమిప్పుడు ధర్మాసనము నధిష్ఠించుటకు శక్తులము గాకున్నాము. అతఁడు విచారించిన పౌరకార్యములను బత్రికలయందు వ్రాసిపంపుమనిమంత్రియైన పిశునునితో నావచనములుగాఁ జెప్పుము.

ప్రతీహారి—దేవర యాజ్ఞాపించినట్లు చేసెదను.

(అని నిష్క్రమించెను.)

రాజు—వాతాయనా ! నీవును నీపనియందుఁ జక్కఁగా వర్తిల్లుము.

కంచు—దేవరయాజ్ఞ ప్రకారము చేసెదను. (అని నిష్క్రమించెను.)

విదూ—మీరిప్పుడీఁగయు నిచ్చట లేకుండఁ జేసితిరి. ఇఁక నెండలేక చల్లనై యుండుటచే మనోహరమయి యున్నయీయుద్యానవనభూమియందు మీరు హాయిగాఁ గ్రీడింపవచ్చును.

రాజు—మిత్రుఁడా ! సందు దొరికినప్పుడాపదలు చెంతనే యుండు నన్నవాక్య మసత్యముకాదు.

గీ. ఋషికుమారికాప్రణయంబు స్మృతికిఁ దగుల
నీనితమము నాహృదయంబు నివుడువిడిచెఁ
గావున, మరుండు ప్రహరింపఁగాఁ దలంచి
వింటను రసాలశర మెక్కువెట్టె సఖుఁడ !

విదూ___మీరు కొంచె మూరకుండుఁడు. నేనీదండకాష్ఠముతో మన్మథబాణమును నాశనముచేసెదను. (అని దండకాష్ఠముచే త్తి మామిడిచిగురును పడఁగొట్టఁబోఘచున్నాఁడు.)

రాజు___(చిఱునవ్వుతో) మేలు ! నీబ్రహ్మతేజస్సు కనఁబడినది ! సఖా ! ఎక్కడఁగూరుచుండి ప్రియురాలిని గొంచెము పోలియున్న తీఁగెలయందు దృష్టిపఱుపుదును ?

విదూ___"మాధవీమంటపమునం దీవేళఁ గడపెదను. అందుఁ జిత్రఫలకమున స్వహస్తముతో లిఖించిన పూజ్యురాలయినశకుంతల రూపమును నాకుఁ దెమ్ము" అని యిక్కడ నున్నచతురిక యనుపరిచారికను మీరు పంపలేదా ?

రాజు___నాహృదయమునకు వేడుక గలిగెడుచోటటువంటిదే. కాఁబట్టి నీవే త్రోవచూపుము.

విదూ___దేవా ! ఇటు. ఇటు. (అని యిద్దఱునునడచుచున్నారు.)

సాను___(వారివెంటనే వెళ్లుచున్నది.)

విదూ___ఇదిగో మణిశిలాఫలకముతోఁగూడిన మాధవీలతామండపము. పూలుమొదలయిన కానుకలచే మనోహరమయి స్వాగతముచేసి మనలకయి యెదురుచూచుచున్నట్లున్నది. కాఁబట్టి యందు బ్రవేశించి కూరుచుందము. (అని యిద్దఱును బ్రవేశించి కూరుచున్నారు.)

సాను___ఇప్పు డీతీవెచాటుననుండి సఖియొక్కచిత్రరూపమును జూచి, తరువాత భర్తయొక్కబహువిధములైన యనురాగవిశేషములను నేనామెకు నివేదించెదను. (అని యట్లుచేసి నిలుచున్నది.)

రాజు___మిత్రుఁడా ! ఇప్పుడు శకుంతలప్రథమవృత్తాంతమంతయు స్మరణకువచ్చినది. ఇది నీకు మునుపే చెప్పితిని. ఆమెను బంపివేసినప్పుడు నీవును నాయొద్ద లేకపోతివి. అంతకుముందును నీవొకప్పుడును నాతో నామెపేరునైనను ముచ్చటింపకపోతివి. నావలెనే నీవుకూడ మఱచిపోయినావా ?

విదూ—నేను మఱచిపోలేదు. అయినను నీవంతయుఁ జెప్పి కడపట నదిపరిహాసోక్తికాని నిజముకాదంటివి. మంటిముద్దవంటిబుద్ధి కలవాఁడనగుటచే నేనట్లేగ్రహించితిని. ఇంతకునుగావలసినదికాకమానదు.

సాను—ఇది నిజమే.

రాజు—(ధ్యానించి) మిత్త్రుఁడా! నన్ను రక్షింపుము.

విదూ—ఓయీ! ఏమిది? ఈవిధముగానగుట నీకుఁ దగదుకదా! గొప్పవారెప్పుడును మనసున శోకమునకుఁ జోటియ్యరు. పెనుగాలికిసహితము పర్వతములుచలింపవు.

రాజు—మిత్త్రుఁడా! నిరాకరణదుఃఖవివశయైన ప్రియురాలియప్పటియవస్థదలఁచుకొని నేను మిక్కిలి దిక్కుమాలినవాఁడ నైనాఁడను.

ఉ. ఏను నిరాకరింప నపుడే స్వజనంబులవెంటఁబోవఁ బోఁ
గా, నిలుమంచు గట్టిగను గణ్వసమానుఁ డదల్ప శిష్యుఁ డా
చాన నిగిడ్చె బాష్పకలుషం బగుదృష్టిని గ్రూరనైననా
పై, నది నన్నుఁబెం విషపుబాణముకైవడి నిర్దహించెడుఁ.

సాను—ఆహాహా! స్వకార్యపరత్వ మిట్టిదే కదా? ఈతనిసంతాపముచేతనే నేను సంతోషముఁ బొందుచున్నాను.

విదూ—ఓయీ! ఆమె నాకాశచరులెవ్వరో యెత్తుకొనిపోయియుందురని నాకొక్కయూహకలదు.

రాజు—అన్యులెవ్వరు పతివ్రతను బరామర్శించుటకుత్సహింతురు? మేనకకదా యామెకుఁ దల్లియనివిన్నాను. అందుచేత నామెసహచారిణులు ప్రియురాలి నపహరించిరని నాహృదయము శంకించుచున్నది.

సాను—తెలియకపోవుట యాశ్చర్య పడఁదగినదిగాని తెలియుటకాదు.

విదూ—అట్లయిన శీఘ్రకాలములోనే నీకామెతోడిసమాగమము కలుగునుగదా?

రాజు—ఏలాగున ?

విదూ—తల్లిదండ్రులు భర్తృవియోగదుఃఖితమైనకూఁతుర్ని నుజూచి సహింపఁజాలరు.

రాజు—మిత్రుఁడా !

గీ. స్వప్నమో మాయయో మతిభ్రమమొ యద్ది;
యంతటిఫలంబె యిచ్చి పుణ్యము నశించెఁ;
దరుణి క్రమ్మఱవచ్చుట దాఁటిపోయె;
పాఱెడు మనోరథఝురంబు పారమెడలి.

విదూ—అట్లుకాదు. అవశ్యముగా రాఁదగినవస్తువుయొక్క సమాగమము తప్పకకలుగుననుట కీయుంగరమే నిదర్శనముగానున్నది.

రాజు—(ఉంగరమునుజూచి) ఇది దుర్లభస్థానమునుండి జాఱి శోచనీయముగానున్నది.

గీ. ఉంగరమ ! నీదుసుకృతంబు నొకటనాకు
వలెనె యల్పమంచూహింతు ఫలముచేత,
నరుణనఖమనోహరములౌ యామెవ్రేళ్లఁ
జేరఁగాంచియు భ్రష్టతఁజెందు కతన.

సాను—ఇది మఱియొక్కనిచేతఁ బడినయెడల నిజముగానే శోచనీయమగును.

విదూ—ఓయీ ! ఈయుంగరము నేయుద్దేశముతో నీవామెచేతిని బెట్టితివి ?

సాను—నాకును నీతని నిది యడుగుటకుఁగౌతూహలముకలదు.

రాజు—వినుము. అప్పుడు స్వపురమునకుఁ బ్రయాణ మయిన నాతోఁ బ్రియురాలు కన్నులనీరు పెట్టుకొని "ఎంతకాలమునకుఁ బ్రాణేశ్వరుఁడు నన్ను రప్పించుకొందురు ?" అని పలికెను.

విదూ—అటుతరువాత.

రాజు—తరువాత నేనీయుంగరము నామె వ్రేలికిఁ దొడుగుచు నిట్లు ప్రత్యుత్తరమిచ్చితిని.

చ. దినదిన మొక్కటొక్కటిగ దీనియం దగునాదు పేరిటన్
దనరెడి యక్షరంబులను దప్పక యెన్నుట కెన్నినాళ్లు ప
ట్టునో విను మన్ని నాళ్లకుఁ గుటుంబిణిరో! యిటనీదు చెంతకున్
జనులను బంపువాఁడను వెసన్నిను నంతిపురంబు చేర్పఁగన్.

అని, యామాటనుసహితము క్రూరస్వభావుఁడనైన నేను మోహముచేత మఱచిపోతిని.

సాను—ఈగడువు రమణీయముగానున్నది! ఇది విధిచేత వ్యత్యస్తముగాఁ జేయఁబడినది.

విధూ—ఇదియెట్లు జాలరివాఁడుతఱిగిన మొఱ్ఱచేఁప కడుపులోనికి వెళ్లినది.

రాజు—శచీతీర్థమునకు నమస్కరించుచుండినప్పుడా చెలిచేతినుండి జారి గంగాప్రవాహమునఁ బడినది.

విదూ—సరిసరి.

సాను—అందుచేతనే పాపమునకు భయపడి యారాజేంద్రునకు దీనురాలయిన శకుంతలయెడ వివాహవిషయమయి సందేహము కలిగెను. మఱియు నిటువంటి యనురాగముగలవాని కానవాలెందు నిమిత్తము కావలసివచ్చెనో!

రాజు—ఇప్పుడీయుంగరమును నిందించెదను.

విదూ—(తనలో) ఈతఁడు వెఱ్ఱిత్రోవను బడుచున్నాఁడు. (ప్రకాశముగా) ఈదండకాష్ఠమును నేనును నిందించెదను.

రాజు—ఎందుకొఱకు?

విదూ—నీ వెందుకొఱకు?

రాజు—(ఉంగరమునుజూచి)

గీ. అకట ! మృదుబంధురాంగుళియగు కరంబు
విడిచి యేటికి జలములోఁ బడితి వీవు ?
జడమ వగుటను గుణ మెంచఁజాల, వైన
బ్రియను నే నేటికిఁ దిరస్కరించినాఁడఁ ?

విదూ—(తనలో) ఆహా ! నన్నాఁకలి మ్రింగివేయుచున్నదిగదా ?

రాజు—అకారణముగా విడిచిపెట్టఁబడిన యో ప్రియులారా ! పశ్చాత్తాపసంతప్తహృదయుఁడై నయీజనుఁడు పునర్దర్శనముచేత నను గ్రహింపఁబడఁదగినవాఁడుసుమా.

(చిత్రఫలకమును చేతఁబట్టుకొని చతురిక వేగముగాఁ బ్రవేశించు చున్నది.)

చతు—దేవా ! ఇదిగో చిత్రఫలకము. (అని చిత్రరుపుపలకను జూపుచున్నది.)

విదూ—మేలు ! మిత్రుఁడా ! మేలు ! ఈస్వభావానులేఖనము రమణీయస్థితిచేత దర్శనీయముగా నున్నది. నిమ్నోన్నతప్రదేశములందు నాదృష్టిజాఱుచు లేచుచున్నట్టున్నది.

సాను—ఆహా ! ఏమి యీరాజునేర్పు ! సఖ నాముందఱ నున్నట్టె తోఁచుచున్నది.

రాజు—క. ఏయది యింపుగ నుండదొ
యాయది చిత్రమునఁ దోఁచు నతిరమ్యముగా
నే ; యటులయ్యును, సుందరి
సోయగ మిటఁ దక్కువగనె చూపట్టుఁజుమీ.

సాను—పశ్చాత్తాపమువలనఁ గలిగినయధికప్రేమమునకును గర్వరాహిత్యమునకును నీమాట తగియున్నది !

విదూ—ఓయీ ! ఇందు ముగ్గురుముద్దియలు కనఁబడుచున్నారు. అందఱును సుందరులుగానేయున్నారు. వీరిలోఁ బూజ్యురాలయిన శకుంతల యెవరో ?

సాను—ఇటువంటిరూపమునుగూర్చి దెలిసికోలేనియీతనిదృష్టి నిరర్థకముకదా ?

రాజు—ఇం దామె యెవ్వరని నీ వూహించెదవు ?

విదూ—ఇదిగో విడిపోయినముడినుండి పూలుజారెడు కొప్పుతోను జెమ్మటపట్టిన మొగముతోను మిక్కిలి చాఁచినచేతులతోను నీళ్లుపోయుటచే మృదువైన క్రొంజిగుళ్లుగల మామిడిచెట్టుయొక్క పార్శ్వమునందుఁ గొంచె మలసియున్నట్టుగా లిఖింపఁబడిన యీమె శకుంతల యనియుఁ దక్కినవారు చెలికత్తెలనియు నూహించెదను.

రాజు—నీవు నిపుణుఁడవు. నాసాత్త్వికభావచిహ్నము లిక్కడను న్నవి.

గీ. చెమటపట్టినవ్రేళ్లంటి చెడి యొకింత
మలినమయి కానఁబడెడు రేఖలకుఁబొంత ;
బాష్పకణములు చెక్కులపయినిఁ బడుచు
నిదిగో కన్పట్టెడును వర్ణ మిచట నుబికి.

చతురికా ! ఈవినోదస్థానము సగమే వ్రాసితిని. కాఁబట్టి యిప్పుడు నీవు వెళ్లి తూలికను దీసికొనిరమ్ము.

చతు—అయ్యా ! మాధవ్యా ! ఈచిత్రపుఁబలకను బట్టుకొమ్ము. నే నిప్పుడు మరల వచ్చెదను.

రాజు—ఇది నేనే పట్టుకొనెదను. (అని చెప్పినట్టుచేయఁగా, చతురిక వెళ్లెను.)

రాజు—గీ. కనులయెదుర ముగ్గ గనఁబడ్డకాంత విడిచి
వేమఱును జిత్రగత గారవించు నేను,
నడిమిదారిని జలపూర్ణనదిని వదలి
వచ్చి యెండమావులఁ గోరువాఁడనైతి.

విదూ.—(తనలో) ఈయన నిజముగా నేలదాఁటివచ్చి యెండమావులలోనే తగులుకొన్నాఁడు. (ప్రకాశముగా) మిత్రుఁడా! ఇక్కడ నింకను వ్రాయవలసినది మఱియేమున్నది?

సాను.—సందేహములేదు. నాచెలి కేయే ప్రదేశములు మనోహరములో వాని వానిని వ్రాయఁదలఁచి యున్నాఁడు.

రాజు.—మాఢవ్యా! వినుము.

చ. పులినములందు హంసయుగము ల్విహరించెడుమాలినీనదిన్,
బలుహరిణంబులున్న తదుపాంతపవిత్రహిమాద్రిపాదముల్,
వలువలు గట్టుశాఖలను వర్తిలు వృక్షముక్రింద నిట్టికొ
మ్ముల దనకన్ను గోఁకికొనుముగ్ధమృగిన్, లిఖియింపఁగోరెదన్.

విదూ.—(తనలో) ఈచిత్రఫలకము వ్రేలుగడ్డములుగల తాపసబృందములతో నింపఁదగునని నేనుభావించెదను.

రాజు.—మిత్రుఁడా! మఱియు నే నుద్దేశించిన శకుంతలాభరణమునొకదానిని నే నిందు మఱచిపోతిని.

విదూ.—అదియేది?

సాను.—వనవాసులు శరీర శౌకుమార్యమునకుఁ దగిన దేదోయయియుండును.

రాజు.—గీ. కేసరములు చెక్కులదాఁకఁ గ్రిందవ్రేలఁ
జేర్పనైతి శిరీషంబు చెలువచెవిని,
స్తనములకుమధ్య శారదచంద్రకిరణ
కోమలమృణాళసూత్రంబుఁ గూర్పనైతి.

విదూ.—ఓయీ! ఈమె యెంచు చేతనో యెఱ్ఱకలువరేకుల కాంతిచే నొప్పు హస్తాగ్రముతో మొగముమాటుకొని బెదరిబెదరి యున్నట్లున్నది. (సావధానముగా విమర్శించి చూచి) అహా! బానిసె కొడుకు పూఁదేనెలదొంగ యైన యీగండుతుమ్మెద యీమెమొగమువిూఁదికి గంతువేయుచున్నది.

రాజు——ఓయీ! నీవీదుష్టుని నివారింపుము.

విదూ——అవినీతులను శిక్షించునీవే దీనిని వారించుటకు శక్తుఁడవు.

రాజు——సరే. ఓయీ! పుష్పలతాప్రియాతిథీ! ఇక్కడవాలు చునేల శ్రమమనుభవించెదవు?

గీ. దగఁగొనియు నీకు ననురక్త యగుచు నిదిగో
పుష్పమున నిల్చి మధుకరి పూవుఁదేనె
నీవులేకుండఁగను దాను ద్రావలేక
యెదురుచూచెడు నీకొర కిప్పు డకట!

సాను——ఇప్పుడిది చక్కఁగా వారింపఁబడినది.

విదూ——ఈజాతి వారింపఁబడినను వక్రస్వభావముగలది.

రాజు——ఓయీ! ఈవిధమున నీవు నాశాసనమున నిలువకున్నావు. కాఁబట్టి యిప్పుడు వినుము.

చ. వరతరునూత్న పల్లవవిభారమణీయమునౌచు, నేను బల్
గరుణ మెయిన్ రతోత్సవములన్ మటిపాన మొనర్పనొప్పుసుం
దరియధరోష్ఠబింబమును దాఁకెదవేనియు నిన్నుఁ బట్టి, బం
భర! కమలోదరంబునను బంధన మే నొనరించెదం జుమీ.

విదూ——ఇటువంటి కఠినదండనమున కదేల భయపడకుండును? (నవ్వి తనలో) ఈతఁ డిప్పుడు వెఱ్ఱివాఁ డయిపోయినాఁడు. ఈతని సాంగత్యముచేత నేనును నిట్టివాఁడనేయైతిని. (ప్రకాశముగా) ఓయీ! ఇది చిత్తరువుగదా?

రాజు——చిత్తరువేమి?

సాను——ఇప్పుడు నేనుసహితము నిజము తెలిసికోలేకపోతిని. వ్రాఁతలోనున్నట్టుగానే భావించుకొనెడి యీతనివిషయమయి చెప్ప వలసినదేమున్నది?

రాజు——మిత్రుఁడా! ఇప్పు డీదోషైకదర్శిత్వ మెందుచేత?

గీ. తన్మయముచేసి హృదయంబుఁ దథ్యముగను
దర్శనసుఖంబు పొందుచుఁ దనరునాకు

స్మరణకు దెచ్చి, యయ్యయో ! మరల నిపుడు
చెలువ నొనరించితివి నీవు చిత్తరువుగ.

(అని బాష్పములు విడుచుచున్నాఁడు.)

సాను—ఆహా ! ఆద్యంతములులేక యీవిరహామార్గ మపూర్వ ముగానున్నది.

రాజు—మిత్త్రుఁడా ! విరామములేని యీదుఃఖము నేనెట్లనుభ వింపుదును ?

క. వనితను గలలోఁ గలసెద
ననుకొన్నను, జాగరముల నదియుం జెడియెన్;
ఘనబాష్పంబులు కాంతను
గనుఁగొనఁగా నీవు చిత్త్రగతనైనఁ గటా !

సాను—శకుంతలయొక్క యవమానదుఃఖమును నీవు సర్వవి ధములచేతను బోఁగొట్టినాఁడవు.

చతురిక—(ప్రవేశించి) దేవా ! జయమగుఁగాక ! జయమగుఁ గాక ! రంగులపెట్టెను బట్టుకొని యీవైపునకు బయలుదేఱితిని.

రాజు—తదనంతరము.

చతు—త్రోవలోఁ దరళికతో వచ్చుచున్నవసుమతీదేవి దీనిని నేనేభర్తగారికిఁ దీసుకొనిపోయి యిచ్చెదనని నాచేతిలోనుండి బలా త్కారముగా లాగుకొన్నది.

విదూ—అదృష్టవంతురాలవుగనుక నిన్ను విడిచిపెట్టినది.

చతు—కొమ్మకుఁ దగులుకొన్నదేవిగారి యుత్తరీయమును దర ళిక వదలించునంతలో నేను దప్పించుకొని వచ్చినదానను.

రాజు—మిత్త్రుఁడా ! మన్ననచేత గర్వితురాలయియున్న దేవి వచ్చినది. నీవీచిత్తరువును రక్షింపవలయును.

విదూ—నన్నని చెప్పుము. (చిత్త్రఫలకమును బట్టుకొనిలేచి) నీ వీయంతఃపుర కాలకూటమునుండి విముక్తుఁడవయినపక్షమున, మేఘ

ప్రతిచ్ఛంద మనుమేడమీఁద నుండెద నన్నుఁ గూఁక వేయుము. (అని వేగముగా నిష్క్రమించెను.)

సాను—హృదయము వేఱొకరిమీఁదఁ దగిలియున్నను, బూర్వగౌరవమును నిలిపియున్నాఁడు. కావున నితనిసౌహృదము స్థిరమయినదిగానున్నది.

ప్రతీ—(లేఖచేతఁబట్టుకొని ప్రవేశించి) దేవా! జయమగుఁగాక! జయమగుఁగాక!

రాజు—వేత్రవతీ! నీవు త్రోవలో దేవిని జూడలేదుగదా?

ప్రతీ—నాచేత లేఖనుజూచి దేవి వెనుక మరలినది.

రాజు—కార్యజ్ఞురాలుగనుక నాకార్యమునకుఁ బ్రతిబంధము కలుగనీయదు.

ప్రతీ—దేవా! "ధనసంశయము లెక్కపెట్టుటకుఁ జాలసేపు పట్టినందున నేఁడు పౌరజనకార్య మొక్కటిమాత్రమె యిప్పుడు విచారింపఁబడినది. ఈపత్రికయందు లిఖింపఁబడినయావ్యవహారమును దేవరవారు చిత్తగింతురుగాక!" అని మంత్రి విన్నవింపుచున్నాఁడు.

రాజు—పత్రిక యీలాగునఁ గనఁబఱుపుము.

ప్రతీ—(చేతి కిచ్చుచున్నది.)

రాజు—(చదివి) ఏమీ! 'సముద్రవ్యవహారియైన ధనమిత్రుఁడనువణిజుఁడు సంతానహీనుఁడును దీనుఁడునయి యోడమునిఁగి మృతినొందినాఁడు గనుక వానిసొత్తంతయు రాజునుజేరవలయు' నని మంత్రి వ్రాసియున్నాఁడు. అక్కటా! అనపత్యత కష్టముగదా! బహుధనసంపన్నుఁడగుటవలన నతనికి బహుభార్యలుండి యుండవచ్చును. అతని భార్యలలో నెవ్వతయైన గర్భిణియై యున్నదేమో విచారింపవలయును.

ప్రతీ—అతనిభార్య సాకేతశెట్టి కూఁతునకుఁ బుంశవనము జరిగినదని యిప్పుడే వినియున్నాను.

రాజు—గర్భస్థశిశువును దండ్రిధనమున కర్హుమైనదే. పోయి నీ విది మంత్రితోఁ జెప్పుము.

ప్రతీ—దేవరవారి సెలవుప్రకారము చేసెదను. (అని బయలుదేఱెను.)

రాజు—వేత్రవతీ! ఇటురమ్ము.

ప్రతీ—ఇదిగో వచ్చితిని.

రాజు—సంతతి యున్నది లేదనెడి యీవిచార మెందుకు?

గీ. ప్రజ లెవరి నెవ్వరిని ప్రాణబంధువులను
దారు పోఁగొట్టుకొందురో వారలెల్ల,
దురితమునఁ దక్క, దుష్యంతధరణివిభుఁడె
సర్వమునకంచు, నెల్లెడఁజాటవలయు.

ప్రతీ—ఈవిధమునఁ జాటింపవలసినదే. (వెడలిపోయివచ్చి మరలప్రవేశించి) కాలమునఁగురిసిన వర్షమువలె దేవరవారియాజ్ఞ నందఱును గొనియాడిరి.

రాజు—(వేఁడినిట్టూర్పువిడిచి) ప్రతీహారీ! సంతానాభావముచేత నిరాధారములై నవంశములలో మూలపురుషులయనంతరము సంపదలీవిధముననే పరులపాలగునుగదా? నాయనంతరమునను బూరువంశసంపద లకాలమున విత్తనములు చల్లిన భూమివలెనేకాఁగలవు.

ప్రతీ—అట్టియమంగళము కలుగకుండునుగాక!

రాజు—ఇసి! నేను సమాసన్నమయిన శ్రేయస్సునే యవమానించినాఁడను.

సాను—ఇతఁడు నిస్సంశయముగా మనసుచేతఁ జెలినుద్దేశించియే యీవిధముగాఁదన్ను నిందించుకొనుచున్నాఁడు.

రాజు—గీ. స్థిరతఁ దనయందు వంశప్రతిష్ట గన్న
ధర్మపత్నిని విడిచితిఁ దగవుమాలి,
కాలమునవిత్తనంబులఁ గలయఁజల్లి
మంచిఫలవేళ భూమిఁద్యజించినట్లు.

సాను—నీసంతతి యిఁక నవిచ్ఛిన్నము కాఁగలదు.

చతు—(ప్రతీహారితో నేకాంతముగా) వేత్రవతీ ! ఈవర్తకుని వృత్తాంతముచేత రాజు మిక్కిలి మతికలఁగి భయపడు చున్నాఁడు. ఈయననూరడించుటకు మేఘప్రతిచ్ఛందమునుండి పూజ్యుఁడైనమాధవ్యునిఁ దీసికొనిరమ్ము.

ప్రతీ—మంచిమాట చెప్పితివి. (అనినిష్క్రమించెను.)

రాజు—ఆహా ! దుష్యంతునిపితృదేవతలు సంశయదశనొంది యున్నారు.

ఉ. అక్కట ! నాయనంతరమునందు యథావిధిగాఁగఁ దర్పణం
బిక్కులమందు నిచ్చునతఁ డెవ్వఁ డటంచును సంతు లేమిచేఁ
బొక్కుచు నింక నేనిడువఁబోయెడు నశ్రులలోనఁ దుడ్వఁగాఁ
జిక్కిననీరు త్రాగుచురు చేడ్పడి మాపితరుల్ నిజంబుగన్.

(అని మూర్ఛపోవుచున్నాఁడు.)

చతు—(తొట్రుపాటుతో చూచి) స్వామీ ! ఊరటచెందుఁడు.

సాను—కటకటా ! ఈతఁడు దీపమును గలిగియుండియుఁ దెరమఱుఁగుగానున్న దోషముచేతఁ జీఁకటి ననుభవించుచున్నాఁడు. నేనిప్పుడే యీతనిని సుఖునిగాఁ జేసెదను. అట్లుకాదు. యజ్ఞభాగముల కొరకాశక్తులయియున్న దేవతలే శీఘ్రకాలములో నీభర్తనిన్ను ధర్మపత్నిగాఁ జేకొనునట్లు చేయఁగలరని యింద్రునితల్లియే శకుంతలనూరడించుచుండఁగా నేను విన్నాను. కాఁబట్టి యంతకాలముపఱకును గనిపెట్టుకొని యుండఁదగును. ఈయావద్వృత్తాంతము చేత నాప్రియసఖినూరడించెదను. (అని ఆకాశ మార్గమున నిష్క్రమించుచున్నది.)

తెరమఱుఁగున—రక్షింపుము రక్షింపుము.

రాజు—(తెలివితెచ్చుకొనియాలకించి) అయ్యో ! మాధవ్యుని యార్తనాదమువలెనున్నది—ఓరీ ! ఎవ రెవ రక్కడ ?

ప్రతీ—(ప్రవేశించి) దేవా ! ప్రాణసంశయము నొందియున్న నీమిత్రునిఁ గాపాడుము.

రాజు—ఆపిన్నవాని నెవఁడు బాధించుచున్నాఁడు?

ప్రతీ—కంటికగపడకుండ నేదో భూతమెత్తుకొనిపోయి యాతనిని మేఘప్రతిచ్ఛంద మనుమేడయొక్క కొట్టకొనను బెట్టినది.

రాజు—(లేచి) అట్లెన్నటికిని జరగదు. భూతములు మాగృహములనుం దిరస్కరించునా? అట్లుకాదు.

గీ. దినదినము నొక్కటఁ బ్రమాదజనితదోష
ములను నావె నేఁదిన్నఁగఁ దెలియఁజాల;
నింకఁ బ్రజలలోపల నెవ్వఁ డేవిధమున
మెలఁగునో పూర్ణముగ నెట్లు తెలియవచ్చు?

తెరయందు—ఓమిత్రుఁడా! అయ్యో! అయ్యో!

రాజు—(గతిభేదముచే నడచి) చెలికాఁడా! భయపడకు. భయపడకు.

తెరలో—అయ్యో! అయ్యో! ఎట్లుభయపడకుందును? వీఁడెవ్వఁడో నన్ను మెడవెనుకకువంచి చెఱకువలె గట్టిగా విఱుచుచున్నాఁడు.

రాజు—(చూపువిగిడించి) ధనుస్సు ధనుస్సు.

యవనిక—(విల్లుచేతఁబట్టుకొని ప్రవేశించి) దేవా! ఇదిగో హస్తత్రాణసహితముగా ధనుస్సు.

రాజు—(బాణసహితముగా విల్లువుచ్చుకొనుచున్నాఁడు.)

తెరయందు—గీ. గొంతుక్రోవి క్రొన్నెత్తురు గ్రోలఁగోరు
నేను బశువును బులియట్లు నిను వధింతు;
నార్తులభయంబు నుడుప బాణాసనంబు
పూనుదుష్యంతుఁ డిపుడు నిన్ బ్రోచుఁగాక!

రాజు—(రోషముతో) ఏమీ! నన్నే పేర్కొనుచున్నాఁడు! ఓ పీనుఁగులదిండీ! నిలువు, ఇప్పుడేనీవనియగును. (విల్లెక్కుపెట్టి) వేత్రవతీ! సోపానమార్గముచూపు.

ప్రతీ—దేవా! ఈలాగు. ఈలాగు. (అందఱును త్వరతో నడచుచున్నారు.)

రాజు—(అంతటనుజూచి) ఇక్కడ నేమియులేదే ?

తెరమఱుఁగున—అయ్యో ! రక్షింపుము. నేనిక్కడనిన్నుఁజూచుచున్నాను. నీవునన్నుఁ జూడకున్నావు. పిల్లిపట్టినయెలుకవలె బ్రతుకునందు నిరాశుఁడనై యున్నాను.

రాజు—ఓరీ ! తిరస్కరణీవిద్యచేత గర్వితుఁడవై యున్నావు. నాయస్త్రము నిన్నుఁజూడఁగలదు. ఇదిగో బాణమును సంధించుచున్నాఁడను.

గీ. హంస క్షీరపానముచేసి యందులోన
చేరియున్న జలంబు వర్జించునట్లు
వధ్యుఁడ వగునిన్ వధియించి బాణమిదియు
రక్షణముసేయు రక్ష్యుఁడౌ బ్రాహ్మణేంద్రు.

(అనిబాణముసంధించుచున్నాఁడు.)

[అప్పుడు విదూషకునివిడిచి మాతలి ప్రవేశించుచున్నాఁడు.]

మాత—ఉ. ఇంద్రుఁడుసీశరాళి కసురేంద్రుల లక్ష్యులఁ జేసెఁగాన రాజేంద్ర ! భవచ్ఛరాసనము నెక్కుడుమిప్పుడు వారిమీఁద నిస్తంద్రత; మిత్రవర్గముదెసం దగుఁ గాక భవత్ప్రసన్నతాసాంద్రకటాక్షపాతములు, శాతశరం బరివోయఁజెల్లునే ?

రాజు—(అస్త్రముపసంహరించి) ఓహో ! మాతలీ ! ఇంద్రసారధికి స్వాగతము.

విదూ—(ప్రవేశించి) నన్ను యజ్ఞపశువును జంపినట్టు చంపినవానినే యితఁడు స్వాగత మడిగి గౌరవించుచున్నాఁడు !

మాత—(చిఱునవ్వుతో) ఆయుష్మంతుఁడా ! నీసన్నిధికి నన్ను దేవేంద్రుఁడు పంచిన పనివినుము.

రాజు—సావధానచిత్తుఁడనయి యున్నాను.

మాత—కాలనేమిసంతతియైన దుర్జయమగు రాక్షసగణము కలదు.

రాజు—కలదు. నేనీవరకే నారదునివలన వినియున్నాను.

మాత—ఉ. నీచెలియైనయింద్రునకు నిక్కమజయ్యులు వారు; వారలన్
బీచ మడంతు వీవు రణమేదిని నంచును వాసవుండు సం
కోచము లేక నమ్మ; రవి కూల్పఁగలేనితమంబు నుర్విలో
నేచి నిశాకరుండు నశియింపఁగఁ జేయఁడె రాత్రివేళలన్.

కాఁబట్టి నీవాయుధమును ధరించి యిప్పుడే యీయింద్రరథము నెక్కి శత్రుజయమునకయి బయలుదేఱుము.

రాజు—నే నీయింద్రునిగౌరవముచేత ధన్యుఁడనయినాఁడను. మఱి మీఱుమాధవ్యుని విషయమున నట్టులచేసితిరి ?

మాత—అదియుఁ జెప్పెదను. నీవేకారణమువలననో మన స్తాపముచేత వివశుఁడవయియుండుటచూచి యవతల నీకుఁ గోపము తెప్పించుటకై యట్లుచేసితిని. ఎట్లన—

గీ. చితుకులు కదల్చుటను నగ్ని చెలఁగి మండు;
చెడుగుఁ జేయుటచేఁ బాము పడగ విప్పు;
మఱియు క్షోభంబువలననె మానవుఁడును
దనదుమహిమంబు చూపును దథ్యముగను.

రాజు—(ఏకాంతముగా) మిత్రుఁడా ! మాధవ్యా ! ఇంద్రుని యాజ్ఞ యనతిక్రమణీయముగనుక నీవేగి యీసంగతి మంత్రియైనపిశునునకుఁ జెప్పి నావాక్యముగా నిట్లనుము—

క. నీమతి యొకటియె యింతకు
క్షేమముతోఁ బ్రజలనేలఁ జెల్లును జుమ్మీ;
నామహితధను వధిజ్యం
బై మఱియొకపనికి నిదిగో వ్యాపృతమయ్యెన్.

విదూ—మీరాజ్ఞాపించినట్లు చేసెద. (అని నిష్క్రమించెను.)

మాత—ఆయుష్మంతా ! రథమెక్కుము.

రాజు—మంచిది. (రథారోహణము నభినయించుచున్నాఁడు.)

(అందఱును నిష్క్రమించుచున్నారు.)

శ్రీ

అభిజ్ఞాన

# శాకుంతలనాటకము.

## సప్తమాంకము.

(అప్పుడాకాశయానమున రథారూఢుఁ డయినరాజును మాతలియు ప్రవేశించుచున్నారు.)

రాజు—ఆజ్ఞను నిర్వహించినవాఁడ నయినను, నే నింద్రునిసత్కారవిశేషమును బట్టి నన్నునుపయుక్తునివలె భావించుకొనుచున్నాను.

మాతలి—(చిఱునవ్వుతో) ఆయుష్మంతుఁడా! మీరిరువురును సంతుష్టులు కాలేదు. ఎట్లన—

గీ. ఇంద్రుఁ డొనరించు సత్కార మెంచి నీవు
సలువునుపకృతి లఘువుగఁ దలఁచెదీవు;
వజ్రియును నీమగంటిమివలనఁ బొంగి
తనదుసత్కారమును నెంచుఁ దక్కువగను.

రాజు—మాతలీ! అట్లుకాదు. అతఁడు దేవతలసమక్షమున నర్ధాసనముఁ గూరుచుండఁ బెట్టికొని నన్నుఁ బంపునప్పుడు చేసినసత్కారము కోరికకు మించి యున్నది గదా?

గీ. ప్రార్థనము చేయ మది నెంచి పజ్జనిలుచు
నందను జయంతుఁ గని చిఱునవ్వు నవ్వి,
వజ్రి హరిచందన మలంది వక్షమందుఁ,
దానె నామెడ వైచె మందారమాల.

మాత—నీ వమరేంద్రునివలన నేదిపొంద నర్హుఁడవు కావు? చూడుము—

గీ. సౌఖ్యపరుఁడైన యింద్రునిస్వర్గమునకు
నసురకంటకోన్మూలన మయ్యె రెంట—

నిపుడు భరదీయ బాణసమృద్ధిచేతఁ,
దొల్లి నరసింహుక్రొవ్వాఁడి గోళ్లచేత.

రాజు—ఇక్కడ శతక్రతుని మహిమయేకదా స్తవనీయము ?

ఉ. భృత్యజనుల్ మహత్తరసుకృత్యములన్నిరవేర్చిరేని, యా
కృత్యము లట్లొనర్చుట యధీశులమన్ననపెంపునం జుమీ!
నిత్యము నగ్రభాగమున నిల్చి యనూరుని నట్లు సూర్యుఁడో
న్నత్యము చూపకుండిన, నణంపఁగలండె యతండు చీఁకటిన్?

మాత—ఇదిసరే. (కొంచెముదూరముపోయి) ఆయుష్మంతుఁడా ! అదిగో స్వర్గపురివెనుకనడచుచున్న నీకీర్తి సౌభాగ్యమునుజూడుము.

గీ. వేల్పుసుందరు లొక్కింత దాల్ప, మిగిలి
నట్టిరంగులఁ గల్పలతాంశుకముల
దేవతలు వీరె శ్రావ్యగీతికల నీదు
చరిత వ్రాయుచున్నా రర్థసంగతముగ.

రాజు—మాతలీ ! రాక్షసులతో యుద్ధముచేయవలె నను నాత్రముచేత గతదినమంతరిక్షమున కెక్కునప్పుడు స్వర్గమార్గమును దిన్నఁగాఁ జూడలేదు. మన మిప్పుడే వాయుపథమున నున్నాము?

మాత—గీ. ఏది గగనగంగను వహియించు, నేది
సప్తఋషిమండలంబుల సంచరించు,
వాటి యుపేంద్రవిక్రముని స్తనుస్కమేది,
యట్టిపరివహానిలమార్గ మంద్రు దీని.

రాజు—మాతలీ ! అందుచేతనేకదా యంతరింద్రియ బహిరింద్రియ సహితముగా నాయంతరాత్మప్రసన్నమగుచున్నది. (రథచక్రములఁజూచి) మనము మేఘమార్గమునకు దిగుచున్నాము.

మాత—ఎట్లు తెలిసినది ?

రాజు—

మాలిని. చాతకముల్ రథచక్రపుటాకులసందులఁ బర్విడు చుండుటచే,
నీతురంగంబులమేనఁ దటిత్తుల యెక్కుడు కాంతులు క్రమ్ముటచే,

నాతతనీరము లోఁగల మేఘచయుంబుపయిన్ జనుచుండుట తే
రే తెలుపుంజుమి తుంపురుగుంపుల నీతడియైతగు నేములతోన్.

మాత — ఓమహారాజా ! ఇంకొకక్షణమునకు మీరు మీయ
ధికారభూమియందే వర్తింపఁగలరు.

రాజు — (క్రిందుచూచి) వేగముగా దిగుచుండుటవలన మను
ష్యలోక మాశ్చర్యదర్శనమయి కనఁబడుచున్నది.

చ. అదె మహీ ప్రస్ఫుటాద్రిశిఖరావళినుండియు డిగ్గునట్ల యా;
మొదళులుతోఁపఁ జెట్టుసిగె మున్నటులాకులలో నడంగుటల్;
నదులు తోరంగె డాయుట జలంబు కనంబడనట్టిరూపమున్;
బదిగ నెవండొ భూమి నిటుప్రక్కకుఁ ద్రోసెడురీతి తోఁచెడున్.

మాత — చక్కఁగాఁజూచితివి. (సగౌరవముగాచూచి) ఆహా !
భూమియత్యంత రమణీయముగా నున్నది !

రాజు — మాతలీ ! అదియేది ? పూర్వాపరసముద్రములదాఁక
వ్యాపించి బంగారునీరుపూసినట్లు మెఱయుచు సంధ్యాకాల మేఘసమూ
హామువలెఁ బర్వతము కనఁబడుచున్నది.

మాత — రాజా ! ఇది హేమకూట మనుకింపురుషపర్వతము.
తాపసులసిద్ధిక్షేత్రమయిన దీనినిజూడుము.

గీ. బ్రహ్మపుత్త్రుఁడైన మరీచివలనఁ బుట్టి
దేవదానవులకుఁ దండ్రియై వెలుంగు
కశ్యపప్రజాపతి దాను గరము నిష్ఠ
భార్యతోఁగూడ నిందుఁ దపంబు చేయు.

రాజు — (సాదరముగా) అట్లయిన శ్రేయముల దాఁటిపోరాదు.
ఆపూజ్యునకుఁ బ్రదక్షిణము చేసి పోవఁగోరెదను.

మాత — మంచిసంకల్పము(అని దిగుటనభినయించుచున్నాఁడు.)

రాజు — (విస్మయముతో)

గీ. చక్రనేములు శబ్దంబుసలుప విందుఁ;
గ్రమ్ముకొనుచుఁ బరాగంబు కానఁబడదు;

జ్యోత్స్నాతలముఁ దాఁకకుంటచే స్యందనంబు
దిగియుఁ దోఁచుచునున్నది దిగనియట్లు.

మాత—ఇంద్రునకును దేవరవారికిని గలవిశేష మింతే.

రాజు—మాతలీ! మారీచాశ్రమ మిం దెక్కడ?

మాత—(చేతితోఁ జూపుచు)

సీ. వల్మీకమున నర్థభాగంబువఱకును
మునిఁగినదేహంబు మురువుచూపఁ
బాములకుబుసముల్ పయిఁ బర్వియున్నట్టి
వక్షస్స్థలము చాల వన్నెమీఱ,
వలయంబు లగుజీర్ణవల్లికాతతిచేతఁ
గడుపీడనొందెడుకంఠ మమర,
మూఁపులదాఁకను వ్యాపించినపులుంగు
గూళ్లతోడిజడలగుంపు తనర,
నీతపోధనసత్తముఁ డింపుమిగులు
స్థాణురీతిని గరము నిశ్చలతఁబూని
యర్కమండలమునకును నభిముఖముగ
నిలిచియున్నాఁడు చూడు మీనెలవునందు.

రాజు—దుష్కరతపశ్శాలివైననీకు నమస్కరించెదను.

మాత—(పగ్గములుపట్టిరథమునిలిపి) ఓమహారాజా! ఇదె యదితిపెంచినమందారవృక్షములుగలకాశ్యపాశ్రమమును బ్రవేశించినారము.

రాజు—స్వర్గమును మించినదీసిద్ధిస్థానము. ఇప్పు డమృతసరస్సునందు మునిఁగిన వానివలె నయినాఁడను.

మాత—(రథమునిలిపి) దేవర దిగవచ్చును.

రాజు—(దిగి) మాతలీ! నీ విప్పు డేమి చేసెదవు?

మాత—రథము నేను నియమించినచోటనే యుండును. నేనును దిగియెదను. (అలాగునచేసి) దేవా! ఇటు. (కొంచెమునడచి) పూజ్యులయినఋషులతపోవనభూములనుజూతము.

రాజు—ఓయీ! విస్మయముతోఁ జూచుచున్నాను.

చ. అమరతరుప్రశస్తవనమం దనుధారణవృత్తి గాలిచే,
సుమహితకాంచనాంబుజరజోవిలసజ్జలమందు స్నానమున్,
దమిని మణిప్రదేశములఁ ధ్యానము, నచ్చరలొద్ద సంయమం,
బమరఁదపఃఫలం బితరులందు నెడఁ దప మొప్పు వీరికిన్.

మాత—మహాత్ములకోరిక పయిపయిని బాఱుచుండునుగదా! (కొంచెమునడచి యాకాశమునఁజూచి) ఓయీ వృద్ధశాకల్యా! పూజ్యుఁడయిన మారీచమహర్షి యేమి చేయుచున్నాఁడు! దాక్షాయణి తన్నుఁ బతివ్రతాధర్మము లడుగ మహర్షి పత్నీసహితయైనయామెకుఁ జెప్పుచున్నాఁ డనుచున్నావా?

రాజు—(ఆలకించి) ఓయీ! అట్లయిన మనము మునులసమయము కొఱకుఁ బ్రతీక్షింపవలయును.

మాత—(రాజునుజూచి) నేను వచ్చినదాఁక మీరీయశోకవృక్షము మొదటఁ గూరుచుండవలయును. నే నింతలో నింద్రజనకునితో విన్నవించుటకు సమయము కనిపెట్టెదను.

రాజు—మీరుఁదోఁచినట్లుచేయుఁడు. (అనినిలుచుచున్నాఁడు.)

మాత—ఓరాజా! నేనుబోయివచ్చెదను. (అనినిష్క్రమించెను.)

రాజు—(శుభనిమిత్తము సూచించి)

గీ. కోరను మనోరథం బేను గొంచెమేని,
వ్యర్థముగ నోభుజంబ! నీ వదరె దేల?
మును నిరాకరించిన మేలె పూనియిపుడు
దుఃఖముగ మాఱుచున్నది దుస్సహముగ.

తెరలో—మాను. దుండగముమాను. ఆహా! ఎట్టు తనస్వభావమును గనఁబఱుచుచున్నాఁడు.

రాజు—(ఆలకించి) ఇది దుష్టత్వమునకుఁ జోటుకాదు; ఇందు నిషేధింపఁబడువాఁడెవ్వఁడయియుండును? (శబ్దమువచ్చిన దిక్కుచూచి చిఱునవ్వుతో) ఓహో! ఇద్దఱు తాపసస్త్రీలు వెంటరాఁగా నిందున్న యీయబాల సత్త్వుఁడగుబాలుఁడెవఁడో!

గీ. తల్లిచనులపాలు సగంబుత్రాఁగి కుడుచు
చున్నసింహపుఁబిల్లను హుమ్మటంచుఁ
గేసరములు గట్టిగఁబట్టి క్రీడకొఱకు
నొకట బలవంతముగ నీడ్చుచున్నవాఁడు.

(పయినజెప్పినరీతి పనిచేయుబాలుఁడును తాపసపత్నులును ప్ర॥)

బాలు—ఓసింగమా! అవులింపుము. నీదంతములులెక్కపెట్టెదను

ప్రథమ—ఓరియవినీతుఁడా! మనబిడ్డలవంటిజంతువులనుబట్టిబాధించుచున్నావేమిరా? ఔరా! నీసంరంభము వృద్ధియగుచున్నది! ఋషిజనులు నీకుసర్వదమనుఁడనిపేరుపెట్టినందుకు నీ కిది తగియేయున్నది.

రాజు—ఇది యేమోకాని యీబాలునియెడఁ గడుపునఁబుట్టిన బిడ్డయందువలె నామనస్సు ప్రేమార్ద్ర మగుచున్నది. సంతానములేకపోవుటయే నాకీవాత్సల్యమును గలిగించుచున్నది. నిశ్చయము.

ద్వితీయ—నీవీసింహపుఁబిల్లను విడిచిపెట్టనిపక్షమున, ఇదిగో దానితల్లియైన సింహము నీమీఁదికి దుముకును.

బాలు—(చిఱునవ్వుతో) ఓహో! నేనుమిక్కిలిబెదరిపోతిని గదా? (అని యధరోష్ఠమును జూపుచున్నాఁడు.)

రాజు—క. బాలుఁ డితఁడు బహుతేజ
శ్శాలికి జనియించినట్లు సంభావింతున్;
జ్వాలఁగఁ గట్టెలఁగోరెడు
కీలికణంబట్లు వీఁడు కేవల మలరున్.

ప్రథమ—వత్సా! ఈబాలమృగేంద్రమును విడువుము. నీకాడుకొనుటకు మఱియేదైన నిచ్చెదను.

బాలు—ఏదీ? అది తెమ్ము. (అని చేయిచాఁచుచున్నాఁడు.)

రాజు—ఎందుచేతనో యితఁ డీచేతియందుఁ జక్రవర్తిలక్షణములనుసహితము ధరించియున్నాఁడు. అవును—

ఉ. కోరినవస్తువున్ గొనఁగఁగోరి యొకించుక వ్రేళ్లువంచి యిం
పారఁగఁ జాఁచినట్టిమృదుహస్తము రక్తిమచేతనొప్పచున్,

జారుదళాంత రాళము గనంబడకుండు ప్రభాతపుష్పితాం
భోరుహసుందరంబయి యపూర్వముదావహమయ్యె దృష్టికిన్.

ద్వితీయ—సువ్రతా! వీఁడు మాటలచేత మరలించుటకు శక్యుఁడుకాఁడు. నీవు పోయి మాపర్ణశాలలో మార్కండేయుఁడను ఋషికుమారునియొక్క రంగువేసిన మట్టినెమలియున్నది. దానిని వీని కిం దెచ్చియిమ్ము.

ప్రథమ—మంచిది. (అని నిష్క్రమించుచున్నది.)

బాలు—నేను దీనితోనె యాడుకొనియెదను.

(అని తాపసిని జూచి నవ్వుచున్నాఁడు.)

రాజు—ఈదుండగీనియెడ నాకపేక్షకలుగుచున్నది.

ఉ. హేతువులేనినవ్వుల నొకించుకచూపుచు లేఁతదంతముల్,
వాతెరచింద నందముగఁ బల్కుచు స్పష్టముకానివాక్కులన్,
భూతలధూళి దేహమునఁ బూయుచు మైల యొనర్చుపుత్రులం
బ్రీతిని ధన్యులెత్తితొడమీఁదను జేర్చి సుఖంతు రెంతయున్.

తాపసి—కానిమ్ము. వీఁడునన్ను గణనచేయకున్నాఁడు. (పార్శ్వమునజూచి) ఋషికుమారులలో నిక్కడ నెవఁడున్నాఁడు. (రాజునుజూచి) ఓ ప్రసన్నవదనా! ఇటువచ్చి, వీఁడుచిన్నతనముచేతఁజేతులతో విడిపింప శక్యముకానిపట్టు పట్టి బాధించుచున్న యీసింహపుఁబిల్లనువిడిపింపుము.

రాజు—(దగ్గఱఁబోయి చిఱునవ్వుతో) ఓయీ! మహర్షికుమారా!

గీ. పుట్టుకను సత్వగుణమును బూనఁదగియు,
నీకరణి నాశ్రమవిరుద్ధవృత్తిచేతఁ
జెలఁగుచును శాంతగుణమును జెఱిచెదేల;
చందనకుజంబుఁ గృష్ణాహిశాబమట్లు.

తాపసి—ఓ ప్రసన్నముఖుఁడా! వీఁడు ఋషికుమారుఁడుకాఁడు సుమీ.

రాజు—వీనియాకారానుగుణ మయినచేష్టితమే యది తెలుపుచున్నది. అయినను మేము స్థానవిశ్వాసముచేత నీవిధముగాఁ దలఁచితిమి. అనియామె (చెప్పిన ప్రకారముచేసి బాలస్పర్శనసుఖము పొందితనలో)

గీ. ఎవ్వనికులాంకురంబొ యైమెసఁగువితని
నంటునాగాత్రముల సుఖ మబ్బ నిట్టు,
లెవనికడుపునఁ బుట్టెనో యీతఁ డట్టి
సుకృతి మదిలోన నెటువంటిసుఖము గనునొ ?

తాపసి—(ఉభయులనుజూచి) ఆశ్చర్యము ! ఆశ్చర్యము !

రాజు—అమ్మా ! ఎందుచేత ?

తాపసి—ఈబాలకునకును నీకును రూపము చుట్టఱికమును దెలుపుచున్నదని యాశ్చర్యపడినదానను. అపరిచితుఁడవయ్యును, నీకితఁ డనుకూలుఁ డయ్యెననియు నాశ్చర్యపడితిని.

రాజు—(బాలునిబుజ్జగించుచు) ఇతఁడు మునికుమారుఁడు కాఁడేని మఱి యీతని కులమేది ?

తాపసి—పూరువంశము.

రాజు—(తనలో) ఈతఁడు నా కేకవంశమువాఁ డెట్లయ్యెను ? అందుచేతనేగదా యీామె యీతనిని నన్నుఁబోలినవానినిగా నెంచినది. పౌరవులకుఁ గులక్రమాగతమయిన యీవ్రత మంత్యమున నున్నదే.

గీ. వసుమతీరక్షణార్థ మెవ్వారు తొలుత
వాస మొనరింతురో దివ్యభవనములను,
వారు పిదప నియతతపోవ్రతము పూని
వృక్షమూలము లిండ్లు కావించుకొంద్రు.

(ప్రకాశముగా) ఈప్రదేశము స్వశక్తిచేత మనుష్యులకు రాశక్యమయినది కాదుకదా ?

తాపసి—తమరు చెప్పినట్లేయగును. అప్సరస్సంబంధముచే వీని తల్లి యీదేవగురుని తపోవనమునందుఁ బ్రసవమయినది.

రాజు—(తనలో) ఆహా ! ఈవాక్యము మరల నాకాశను బుట్టించుచున్నది ! (బిగ్గరగా) ఆమె యేపేరుగలరాజర్షిభార్య ?

తాపసి—ధర్మపత్నిని విడిచిపెట్టినవానిపే రెవ్వరుచ్చరింపఁద లఁతురు?

రాజు—(తనలో) ఈకథయు నాకేతాఁకుచున్నదిగదా! ఇప్పు డీపిల్లవానితల్లి పేరడుగుదునా? (ఆలోచించి) అట్లుకాదు. పరదారపే రడుగుట న్యాయముకాదు.

తాప—(మట్టినెమలినిచేతఁబట్టుకొని ప్రవేశించి) సర్వదమనా! శకుంతల సత్సౌందర్యంబు చూడుము.

బాలు—(దృష్టిసారించి) మాయమ్మ యెక్కడ?

ప్రథమ—నామసాదృశ్యముచేతమాతృవత్సలుఁడై నయీతఁడు భ్రమపడెను.

ద్వితీయ—వత్సా! ఈపక్షియొక్క యందమును జూడుమని పలికితిని.

రాజు.—(తనలో) ఏమి! ఈతనితల్లిపేరు శకుంతలా? అయిన నేమి? ఒక్కపేరుగలవారు పలువురుందురు. నామధేయమాత్రప్రస్తావ ము నాకెండమావివలె విదాహంబు కలిగించుచున్నది.

బాలు—అమ్మా! ఈమంచినెమలి నాకు రమ్యముగానున్నది. (అని దానిని పుచ్చుకొనుచున్నాఁడు.)

ప్రథమ—(చూచి తొందరతో) ఈతనితాయెతు మణికట్టునఁ గానఁబడదు.

రాజు—తొందరపడఁబోకు. ఓతాపసీ! ఇదిసింహశాబముతోఁ బెనఁగులాడినప్పుడు జాఱిపడినది. (అని తీసియియ్యఁబోవుచున్నాఁడు.)

ఇద్ద—తీయకుతీయకు—ఈతఁడు తొందరపడి దీని నెట్లుతీసె ను. (అని యద్భుతపడి ఱొమ్మునఁజేయివేసుకొని యొండొరులను చూ చుకొనుచున్నారు.)

రాజు—నన్ను మీరేలనివారించితిరి?

ప్రథమ—ఓమహారాజా! వినుము. ఇది యీచిన్నవానికి జాతకర్మసమయమునందుఁ ద్రికాలవేదియైన మారీచమహర్షియిచ్చినయపరాజిత యనునోషధి. దీనిని తల్లిదండ్రులును దానునుదక్క భూమిమీఁది వారు మఱియొకరు ముట్టఁగూడదు.

రాజు—ముట్టుకొన్న నేమి?

ప్రథ—అప్పుడ పామయి కఱచును.

రాజు—మీ రెప్పుడైన దీనివిక్రియను బ్రత్యక్షముగాఁ జూచి యున్నారా?

ఇద్ద—అనేకపర్యాయములు.

రాజు—(హర్షముతో తనలో) ఇప్పుడు సంపూర్ణ మయిన నా మనోరథమునకు నేనెట్లు సంతోషింపకుందును? (అని బాలకుని కౌఁగిలింగుకొనుచున్నాఁడు.)

ద్వితీయ—సువ్రతా! రమ్ము. ఇప్పుడీవృత్తాంతమును వ్రతనిష్ఠయందున్న శకుంతలకుఁ దెలుపుదము. (అని నిష్క్రమించుచున్నారు.)

బాలు—నన్ను విడిచిపెట్టు. నేనుమాయమ్మదగ్గరకుఁ బోవలెను.

రాజు—పుత్రకా! నాతోఁగలసియే తల్లిని సంతోష పెట్టుదువుగాని.

బాలు—నాకు దుష్యంతుఁడుగదా తండ్రి? నీవుకావు.

రాజు—(చిరునవ్వుతో) ఈవివాదమే నాకు విశ్వాసము కలిగించుచున్నది.

[అప్పు డొక్కజడగానల్లుకొన్నతలతో శకుంతల ప్రవేశించుచున్నది.]

శకుం—వికారకాలమునందు సహితము స్వభావరూపమున నున్న సర్వదమనుని యోషధిసంగతివినియు నాకు నాభాగ్యమునందు నమ్మకము కలుగకున్నది. ఒకవేళ సానుమతి చెప్పినప్రకారముననే యిది సంభవింపను వచ్చును.

రాజు—(శకుంతలవంకఁజూచి) ఆహా! ఇదిగో పూజ్యురాలయిన శకుంతల!

గీ. మిగులమాసినవస్త్రంబు మేనఁ దాల్చి,
నియమకృశముఖి యేక వేణిని ధరించి,
శుద్ధశీలయై, యతిదయాశూన్యుఁడనగు
నాదుచిరవిరహార్తి యీనాతి దాల్చె.

శకుం—(పశ్చాత్తాపముచేతవివర్ణుఁడయియున్న రాజునుజూచి) ఇతఁడు నాభర్తవలె నుండలేదు. మఱియెవ్వఁడితఁ డిప్పుడు రక్షకట్టి యున్ననాపుత్రుకునినిగాత్రసంసర్గముచేత మయిలగొనచున్నాఁడు?

బాలు—(తల్లినిచేరి) అమ్మా! ఎవఁడితఁడు నన్నుఁ గొడుకని పిలిచి యాలింగనము చేసికొనుచున్నాఁడు?

రాజు—ఓప్రియురాలా! నీయెడల నేనుజూపిన క్రూరత్వమును గడపట ననుకూలఫలము నిచ్చునదియైనది. ఎందుచేతనన, నీవిప్పుడు నన్నానవాలు పట్టఁ గలిగితి వనుకొనియెదను.

శకుం—(తనలో) హృదయమా! ఊరడుము. మత్సరము విడిచి దైవమును నాయందుఁ గరుణించెను. ఈతఁడు నాభర్తయే.

రాజు—ప్రియురాలా!

గీ. సుముఖిరో! భాగ్యమున, మోహతమము వీడి
స్మృతినిగన్ననాముందల వసించె దీవు;
సత్వరంబుగ గ్రహణావసానమునను
శశిని జేరినరోహిణిసరణి నివుడు.

శకుం—ప్రాణేశ్వరా! జయమగుఁగాక! జయమగుఁగాక! (అని సగముచెప్పికన్నీటిచే గద్గదస్వరమువడి విరమించుచున్నది.)

రాజు—సుందరీ!

గీ. గళముననె జయశబ్దంబు కనులనీట
నడఁగినను, నేను ధన్యుండనైనవాఁడ;

సంస్క్రియలు లేక పాటలోష్ఠంబుఁగలిగి
చెలువగుముఖంబుఁ జూడఁ గాంచితిని గాన.

బాలు——అమ్మా! ఇతఁ డెవరు?

శకుం——బిడ్డా! నీభాగ్యము నడుగు.

రాజు——(శకుంతలపాదములమీఁదఁబడి)

మ. అవమానించితినంచుఁ జింతిలకుమీ యావంతయు న్నీమదిన్;
దవిలెన్మోహము గాఢమై యపుడు మత్స్వాంతంబులో నేలొకో!
భువి నిట్లుండుఁ దమః ప్రధానులమనంబుల్ భద్రముల్ వచ్చుచోన్;
బువ్వుదండం దలనుండి పామనుభ్రమన్ బోఁద్రోయఁడేయంధుఁడున్?

శకుం——లెమ్ము. ప్రాణేశ్వరా! లెమ్ము. ఆదినములయందు నా పుణ్యప్రతిబంధకమైనపూర్వజన్మదుష్కృతము పండిపోయెను. నిశ్చయము. అట్లు కానియెడల, సదయులయ్యును దేవరవారు నాయెడల విరసత్వము నేల వహింతురు? (రాజు లేచుచున్నాఁడు.) మఱి దుఃఖభాగినినైన నేను దేవరవారి కెట్లుస్మరణకు వచ్చితిని?

రాజు——శోకనివారణము చేసికొని చెప్పెదను.

గీ. అధరమ్మును బాధచేయునీయశ్రుకణము
మోహమున నుపేక్షించితి మున్ను నేను;
కదలు కనుఱెప్పలందలి యుదకబిందు
విపుడు తుడిచి నేననుతాప మెడలువాఁడ.

(అని చెప్పినట్లు చేయుచున్నాఁడు.)

శకుం——(పేరుచెక్కిన పుద్దుటుంగరముచూచి) ప్రాణేశ్వరా! ఆ యుంగరమా యిది?

రాజు——ఈయుంగరము లభించుటవలననేనాకు స్మరణపుట్టినది.

శకుం——దేవరవారికినమ్మకముపుట్టింపవలసిన కాలముననే యిది కనఁబడక కష్టము తెచ్చిపెట్టినది.

రాజు—అట్లయిన, లత ఋతుసమాగమమును సూచించు పుష్పమునుంబోలె నీవు దీనిని గ్రహింపుము.

శకుం—దీనియందు నాకు విశ్వాసము లేదు. దీనిని భర్తయే ధరింపవలయును.

[అప్పుడు మాతలి ప్రవేశించుచున్నాఁడు.]

మాత—ఏమి నీభాగ్యము! నీవు ధర్మపత్నీ సమాగమము చేతను బుత్రముఖదర్శనముచేతను వర్ధిల్లుచున్నావు.

రాజు—నామనోరథము మంచిఫలమును బొందినది. మాతలీ! ఈవృత్తాంత మింద్రునకుఁ దెలియదుగదా?

మాత—(చిఱునవ్వుతో) ప్రభువులకుఁ దెలియనిదేముండును? దేవా! రమ్ము. మహాత్ముఁడయిన కశ్యపుఁడు నీకు దర్శన మిచ్చుచున్నాఁడు.

రాజు—శకుంతలా! కొడుకుం బట్టుకొనుము. నిన్ను ముందుంచుకొనియే మహర్షిని జూడఁగోరెదను.

శకుం—ప్రాణనాయకునితోఁగూడ గురుసమీపమునకుఁ బోవుటకు సిగ్గుపడుచున్నాను.

రాజు—అయినను, అభ్యుదయకాలములయం దిట్లు చేయవలెను. రమ్ము రమ్ము. (అని యందఱును నడుచుచున్నారు.)

(అప్పు డదితితోఁగూడ సింహాసనస్థుఁ డయినకశ్యపుఁడు ప్ర॥)

కశ్య—(రాజువంకఁజూపి) ఓ దక్షపుత్రీ!

ఉ. ఎంతయు నీదుపుత్రునకు నీతఁడు తోడయి ముందు నిల్చి దు
ష్యంతధరాతలేశ్వరుఁడు సంగరరంగమునందు వింటిచే
సంతత మెల్లకార్యములుఁ జక్కఁగ నిర్వహణం బొనర్ప, ని
శ్చింతతభూషణంబె యగుఁ జేతికి వజ్రము గోత్రభేదికిన్.

అదితి—ఈతని యాకారము సంభావనీయ మహత్త్వముగలది.

మాత—(రాజుతో) ఆయుష్మంతా! దేవతలకు జనకులయిన వీరు పుత్రప్రీతిసూచకములయిన కన్నులతో నిన్నుఁ జూచుచున్నారు. కాఁబట్టి వారిసమీపమునకు వెళ్లుము.

రాజు—మాతలీ!

శా. వీరాదక్షమరీచిసంభవతచేఁ బెంపొందుచున్, బ్రహ్మకు
న్దారే రెండవమెట్టువారయి, తగన్ బండ్రెండురూపంబు లో
ప్పారం దాల్చెడుతేజముం గని, త్రిలోకాధీశు నాయాగభు
గ్వారేశుం గని, పద్మజాదికు హరిం గన్నట్టి సద్దంపతుల్ ?

మాత—మఱియేమి?

రాజు—(సాగిలఁబడి) ఇంద్రనియోజ్యుఁ డయినదుష్యంతుఁడు మీయిరువురకును నమస్కరించుచున్నాఁడు.

కశ్య—వత్సా! దీర్ఘాయుష్మంతుఁడవయి భూమినేలుము.

అదితి—పుత్రకా! ఎదురులేనివాఁడవు కమ్ము.

శకుం—పుత్రసహితురాలనై నేను మీపాదాభివందనము చేయుచున్నాను.

కశ్య—బిడ్డా!

క. పెనిమిటి యింద్రసమానుఁడు;
తనయుండు జయంతసముఁడు; తగ విఁకఁ బెఱదీ
వన లేమియు నీ కతివా!
కనుమా శచితోడిసాటి ఘనముగ నీవున్.

అదితి—బిడ్డా! భర్తృసమ్మానము పొందుదానవుగమ్ము. ఈ పిన్నవాఁడు దీర్ఘాయుష్మంతుఁడై తప్పక యుభయకులములను సంతోషపెట్టునుగాక! కూరుచుండుఁడు. (అందఱును కశ్యపున కెదురుగఁ గూరుచున్నారు.)

కణ్వ—(ఒకరొకరిని నిర్దేశించి)

గీ. ఈశకుంతల కడుసాధ్వి; యితఁడు చూడ
మంచిపుత్త్రుఁడు; నీవును మానవిధివి;
మీరుముపురు భాగ్యంబునఁ జేరికొనుట
శ్రద్ధయు ధనంబు విధియుఁ జేరంగఁ గనుట.

రాజు—దేవా! ముందే యభిమతార్థసిద్ధియయి తరువాతఁ దమదర్శనము లభించినది. అందుచేత మీయనుగ్రహ మపూర్వము కదా! ఎట్లన—

గీ. తొలుతఁ బూవును దరువాత ఫలముఁ గల్గు;
మొదల మేఘ మడరి వాన పిదపఁ గురియు;
కార్యకారణముల కిది క్రమముచూడ;
నీప్రసాదంబునకు ముందె నిగుడు సిరులు.

మాత—సృష్టికర్తలీప్రకారముగానే ప్రసన్నులగుదురు.

రాజు—ఓభగవానుఁడా! ఈసేవకురాలిని గాంధర్వవివాహ విధిచేతఁ బెండ్లియాడి, కొంతకాలమునకు బంధువులు తీసికొనివచ్చి నప్పుడు నేను గొప్ప మరపుచే నిరాకరించి పూజ్యుఁడును యుష్మద్గోత్రుఁడు నయినకణ్వునియెడనపరాధి నైతిని. తరువాత నీయుంగర మును జూచుటవలన నాతనికొమార్తెను బూర్వము వివాహమాడి నట్లు తెలిసినది. నాకది చిత్రమయి తోఁచుచున్నది.

గీ. ఎదుటఁ గన్పింప గజముకా దిది యటంచు
నెంచి, యది దాఁటి చన సంశయించి, పిదప
నడుగుజాడలు గని గజం బనుచు నమ్ము
కరణి నయ్యె నాచిత్తవికార మహహ!

కణ్వ—వత్సా! అపరాధముచేసితివని శంకింపఁబోకు. నీవు సమ్మోహపడుటయు ననుపపన్నముకాదు. వినుము.

రాజు—అవహితుఁడనై యున్నాఁడను.

కశ్య—అప్సర స్తీర్థమునుండి మిక్కిలి ఖిన్నురాలయియున్న శకుంతలనుదీసికొని మేనక దాక్షాయణియొద్దకు వచ్చినప్పుడే నే నంతయు ధ్యానముచేతఁ దెలిసికొంటిని. దుర్వాసశ్శాపమువలన సహధర్మచారిణియు దీనురాలునైన యీమెను నిరాకరించితివిగాని మఱియొకటికాదు. ఉంగరమును జూచినతోడనే యీశాపవిముక్తి యయినది.

రాజు—(నిట్టూర్పుపుచ్చి) ఇప్పుడు లోకాపవాదమునుండి విముక్తుఁడనైనాఁడను.

శకుం—(తనలో) మేలు! భర్తనన్ను నిరాకరించినందుకుఁగారణము లేకపోలేదు. నేను శపింపఁబడినట్టు నాకు స్మరణకురాలేదు. ఒకవేళ విరహముచేత నశ్వస్థచిత్తురాలనై నేనాశాపమును బొందియేయుందును. నాకది తెలియదు. అందుచేతనే నాసఖులు భర్తకుంగరమును జూపుమని నాకు బోధించిరి.

కశ్య—కుమారీ! కృతార్థురాలవైతివి. భర్తమీఁద నీవుకోపముంచఁగూడదు. చూడుము.

చ. పతిస్మృతిలేక శాపహతిపాలయి నిన్విడనాఁడె క్రూరతన్;
సతి! విను మిప్పు డాతమము జాఱుటఁ బ్రాభవ మెల్ల నీదెయా;
నతిమలినంపుదర్పణమునందుఁ దగం బ్రతిబింబ మేర్పడన్
జతపడకుండియు న్మరల స్వచ్ఛతగాంచిన నీడ యీనదే?

రాజు—ఓమహాత్మా! ఇక్కడఁగదా నావంశమునిలిచినది? (అని కుమారుని చేతితోఁజేరఁదీయుచున్నాఁడు.)

కశ్య—ఇతఁడు భావిచక్రవర్తియని తెలిసికొమ్ము.

ఉ. తిన్నఁగ నంతటందిరుగు తేరున వార్ధులుదాఁటి, యడ్డులే
కున్నతి దీవులేడుగలయుర్వి జయించు నితండు సర్వముజ్;

మున్నిటఁ బొల్చె సర్వదమనుం డన సత్వములం గలంచుటన్ ;
సన్నుతికెక్కు లోకభరణంబు నెయిన్ భరతాఖ్యనీవయిన్.

రాజు—తమచే సంస్కారము పొందుటచే వీనియందు మేమిది యంతయుఁగోరుదుము.

అదితి—స్వామీ ! ఈపుత్రికామనోరథస్థితి నవిస్తరముగాఁ గణ్వునకుఁ జెప్పిపుచ్చి యిప్పుడాతనిని సంతోషపెట్టవలెను. పుత్రికావత్సలయైన మేనకయు నాకుఁబరిచర్యచేయుచు నిచ్చటనేయున్నది.

శకుం—(తనలో) నాకుఁగలకోరిక నీమెయే చెప్పినదిగదా ?

కశ్య—తపఃప్రభావముచేతఁ గణ్వున కంతయుఁ బ్రత్యక్షమే.

రాజు—(తనలో) అట్లయిన నామునినాయెడల నతికోపము గలవాఁడుగా నుండఁడు.

కశ్య—అయినను మేమాతనికిఁ బ్రియవార్తను బంపవలయును. ఓరీ ! ఎవఁడురా అక్కడ ?

శిష్యుఁడు—(ప్రవేశించి) దేవా ! ఇదిగో వచ్చినాఁడను.

కశ్య—గాలవా ! ఇప్పుడే యాకాశమార్గమునఁబోయి పూజ్యుఁడైన కణ్వునితో "శాపము పోవుటచే స్మృతిమంతుఁడయిన దుష్యంతునిచేత శకుంతల పుత్రసహితముగాఁ బ్రతిగ్రహింపఁబడిన" దనినా వాక్యములుగాఁ బ్రియంబు తెలుపుము.

శిష్యు—దేవరయాజ్ఞాపించినట్లు. (అనినిష్క్రమించుచున్నాఁడు)

కశ్య—వత్సా ! నీవును భార్యాపుత్రసహితుఁడవయి సఖుఁడైన యింద్రునిరథమెక్కి నీరాజధానికి వెళ్లుము.

రాజు—దేవరవారి యాజ్ఞాప్రకారము చేసెదను.

కశ్య—మఱియును—

ఉ. వాసవుఁడిచ్చు నీప్రజకు వర్షము లెల్లపుడు న్సమృద్ధిగా ;
నాసురల న్మఖావళుల నందఱఁ దన్పుము నీవు నెప్పుడున్ ;

భాసిల స్వర్గమర్త్యభువనంబుల కిట్లు పరస్పరంబు సం
తోషముఁగూర్చుచు న్మనుఁడు నూర్ల యుగంబులు మేలుచేతలన్.

రాజు—దేవా! యథాశక్తిని మేలుకూర్చుటకుఁ బ్రయత్నిం
చెదను.

కశ్య—వత్సా! నీకు మఱి యేమిప్రియము చేయవలెను?

రాజు—నాకింతకంటె నేమిప్రియమున్నది? అయినను దేవర
వారు ప్రియముచేయ నిచ్చించుచున్నారుగనుక, ఈభరతవాక్యము
సిద్ధించునుగాక!

చ. ప్రజలహితార్థమే నృపుఁడు వర్తిలుఁ గావుత మెల్లయప్పుడున్;
సుజనులవిద్య పూజ్యయయి శోభవహించునుగాక యెల్లెడన్;
నిజకృప నీలలోహితుఁడు నిత్యుఁడుశక్తిధరుండునైనయా
గజదనుజారి పోనడఁచుఁగావుత నాకును మాఱుజన్మమున్?

(అని యందరును నిష్క్రమించుచున్నారు.)

సంపూర్ణము.

శ్రీ సత్యానందప్రెస్, ఇన్నీసుపేట, రాజమహేంద్రవరము. 1931